సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 261
సోమవారం 5-6-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



భారత రెజ్లర్లకు నిరాశ
వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో పతకాలు సాధించడంలో విఫలం - 12లో



'స్కోర్' కొట్టు... లోన్ పట్టు!
తక్కువ వడ్డీ రేటుకు వ్యక్తిగత రుణాన్ని పొందే మార్గాలపై కథనం - 13లో



లెక్కలతోనే ఇక్కట్లు..
జేఈఈ పరీక్షలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నా గణిత ప్రశ్నలు చాలా కఠినంగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు.
వివరాలు 3లో ▸



అర్జున్‌కు మూడో స్థానం
దుబాయ్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణకు చెందిన అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.
వివరాలు 12లో ▸



జొకోవిచ్ రికార్డు
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 17వ సారి క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సెర్బియా టెన్నిస్ స్టార్. నాదల్ పేరిట ఉన్న రికార్డు బద్దలు.
వివరాలు 12లో ▸



కటకం సుదర్శన్ మృతి
మావోయిస్ట్ పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ గుండెపోటుతో మృతి చెందారు.
వివరాలు 10లో ▸



ఏపీ స్థానం వెరీ'గుడ్డు'

- కోడిగుడ్ల లభ్యత, ఉత్పత్తిలో దేశంలోనే ఏపీది అగ్రస్థానం
- రాష్ట్రంలో ఏటా తలసరి గుడ్ల లభ్యత 501
- ఏటా 442 గుడ్ల లభ్యతతో రెండో స్థానంలో తెలంగాణ
- జాతీయ సగటు గుడ్ల లభ్యత 95 మాత్రమే
- రాష్ట్రంలో రెండేళ్లుగా పెరుగుతున్న పెరటి కోళ్ల సంఖ్య
- కేంద్ర పశు సంవర్థక మంత్రిత్వ శాఖ సర్వే–2022 వెల్లడి

10లో

రైళ్ల ప్రమాదంపై సీబీఐ

ఒడిశా ఘటనపై విచారణ జరిపించాలని రైల్వే శాఖ నిర్ణయం

- విద్రోహ కోణం ఉండొచ్చని అనుమానం
- కారణాన్ని, కారకులను గుర్తించాం: రైల్వే మంత్రి
- మృతుల సంఖ్య 275గా నిర్ధారణ
- గుర్తించాల్సిన మృతదేహాలు 187
- వాటిని భద్రపరచడమే పెద్ద సవాలు
- కేంద్రంపై మండిపడ్డ విపక్షాలు
- అశ్వనీ వైష్ణవ్ రాజీనామాకు డిమాండ్

6లో


ఆదివారం బాలాసోర్‌లో మృతుల ఫొటోల్లో తమ వారి కోసం వెతుకుతున్న బంధువులు

సిగ్నల్ రాంగ్ రూట్ - 6లో


తన భర్త ఆచూకీ కోసం ఆధార్ కార్డు పట్టుకొని విలపిస్తున్న మహిళ

ట్రాక్‌ల నిర్వహణ లోపాలమయం
కాగ్ అక్షింతలు వేసినా రైల్వే శాఖ పట్టించుకోని వైనం
2లో

రైలు ప్రమాదంలో ఏపీ బాధితులకు పరిహారం

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు
- తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు.. స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష
- సహాయక చర్యలపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం

2లో



మనోళ్లు 553 మంది క్షేమం

- రెండు రైళ్లలో రాష్ట్రానికి చెందిన వారు 696
- ప్రయాణాన్ని రద్దు చేసుకున్న వారు 92
- 22 మందికి గాయాలు, ఒకరు మృత్యువాత
- మరో 28 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు

2లో

జెడ్పీటీసీలకు పాలన, విధులపై శిక్షణ



రాష్ట్రంలోని జెడ్పీటీసీ సభ్యులకు తమ విధులు, పరిపాలనపై ప్రభుత్వం అవగాహన కల్పించనుంది. ఇందుకుగాను ఎస్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనుంది. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున 15 బ్యాచ్‌లకు మూడు ప్రాంతాల్లో ఈ నెల 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయి.

- వివరాలు 10లో

సంస్కరణలతో ఆదాయం వృద్ధి

- స్నేహపూర్వక శాఖగా మారిన వాణిజ్యపన్నుల శాఖ
- వ్యాపారులపై వేధింపుల్లేకుండా సులభంగా రిటర్నుల దాఖలుకు చాన్స్
- దేశంలోనే తొలిసారిగా ఆటో మేటెడ్ వెహికల్ చెకింగ్ ఏర్పాటు
- రిటర్న్ స్క్రూట్నీకి కొత్త విధానం.. వ్యాపారులతో ట్రేడ్ అడ్వైజరీ కమిటీ

2లో

రుతుపవనాలు మరింత ఆలస్యం

కేరళ తీరాన్ని ఇప్పటికే తాకాల్సిన నైరుతి రుతుపవనాల రాక కాస్త ఆలస్యం కానుంది. రుతుపవాలు రావడానికి మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. సర్వసాధారణంగా ప్రతీ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళ తీరాన్ని తాకి క్రమంగా దేశమంతటా విస్తరించడంతో వానలు కురుస్తాయి.

- వివరాలు 6లో

నేటి నుంచి పసుపు కొనుగోళ్లు

- ఆర్బీకేల ద్వారా 20 వేల టన్నులు కొనేందుకు ప్రభుత్వ అనుమతి
- ప్రస్తుతం క్వింటా ధర రూ.5,500 నుంచి రూ.6,300 వరకు
- కనీస మద్దతు ధర రూ.6,850కి సర్కారు కొనుగోలు

3లో

విమానాలతో ఏరియల్ సర్వే సక్సెస్

- సర్వేలో వేగం పెంచేందుకు డ్రోన్లతోపాటు ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగం.. 30 వేల చదరపు కిలోమీటర్లలో పూర్తయిన సర్వే



2లో

టీవీ, రేడియోల్లోనూ వాతావరణ హెచ్చరికలు

తీవ్ర వాతావరణ హెచ్చరికలను ఇకపై టీవీలు, రేడియోల్లోనూ ప్రసారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలు, తుపాన్లు, వడగాలులు వంటి తీవ్ర వాతావరణ మార్పులను గురించి మొబైల్ ఫోన్లలో మెసేజీలు పంపే ప్రక్రియను ఇప్పటికే జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) ప్రారంభించింది. రెండో దశలో భాగంగా టెలివిజన్, రేడియో, ఇతర మాధ్యమాల ద్వారానూ ప్రజలకు తీవ్ర వాతావరణ హెచ్చరికల మెసేజీలను పంపే ప్రక్రియ ఈ ఏడాది చివర్లో ప్రారంభించనుంది.

- వివరాలు 6లో



ఇక చెల్లదు!

ఇష్టానుసారం గర్భసంచి తొలగింపు కుదరదు
కాసుల కోసం ఇష్టానుసారం ఆపరేషన్లు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు
కట్టడికి డీఎంహెచ్‌కు ప్రభుత్వ ఆదేశాలు

మహిళలు కడుపులో నొప్పని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే.. చాలు వైద్యులు గర్భసంచి సమస్య అంటూ తొలగించాలని సూచిస్తున్నారు. కానీ దాని తొలగింపు అవసరం ఎంతన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. దీంతో పలువురు మహిళలు గర్భసంచిని తీయించుకుంటున్నారు. కానీ దీని తొలగింపు తరువాత ఆ మహిళల్లో మరిన్ని అనారోగ్యకరమైన పరిణామాలు సంభవిస్తున్నాయి. దీంతో జీవితమంతా బాధపడుతూ జీవించాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆర్థిక ప్రయోజనాలే చూస్తున్న ఆస్పత్రి వర్గాలు అమ్మల ఆరోగ్యం గురించి కాస్తైనా ఆలోచించకపోవడం విస్మయపరుస్తోంది.

☛ గంట్యాడ మండలానికి చెందిన 30 ఏళ్ల మహిళకు పొత్తి కడుపులో నొప్పి రావడంతో విజయనగరంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. వెంటనే గర్భసంచి తొలగించాలని అక్కడ వైద్యులు చెప్పారు. గత్యంతరం లేక గర్భసంచి తొలగింపు ఆపరేషన్ చేయించుకుంది. ఆమె నుంచి ఆస్పత్రి వర్గాలు రూ.30 వేలు బిల్లు తీసుకున్నారు.

☛ జామి మండలానికి చెందిన 36 ఏళ్ల మహిళ పొత్తి కడుపులో నొప్పి వస్తుందని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. ఇక్కడ కూడా వెంటనే గర్భసంచి తొలగింపు ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. వెంటనే ఆ మహిళ ఆ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. ఆమె నుంచి రూ.25 వేలు బిల్లు తీసుకున్నారు.

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో అనేక మంది మహిళలకు అవసరం ఉన్నా.. లేకున్నా.. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు గర్భసంచి తొలగింపు ఆపరేషన్(హిస్టక్టమీ) చేసేస్తున్నారు. మహిళల ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా కాసులే పరమావధిగా భావించి ఇష్టానుసారంగా ఆపరేషన్లు చేసేస్తున్నారు. పొత్తి కడుపు నొప్పి, వైట్ డిశార్జ్ (తెల్లబట్ట) అవుతుందని మహిళలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే చాలు వెంటనే ఆపరేషన్ అంటున్నారు.. లేకుంటే ఇన్‌ఫెక్షన్ సోకుతుందని, కేన్సర్‌గా మారే అవకాశం ఉందని చెప్పి మహిళలను భయపెడుతున్నారు. దీంతో మరో మార్గం లేక ఆపరేషన్ చేయించుకోవడానికి సంబంధిత మహిళలు అంగీకరిస్తున్నారు. వాస్తవంగా పై సమస్యలతో వైద్యులను సంప్రదించే మహిళలకు నెల, రెండు నెలలు పాటు మందులు వాడిన తర్వాత తగ్గకపోతే ఆపరేషన్ కచ్చితంగా చేయాలని నిర్ధారణకు వచ్చిన మీదట ఆపరేషన్ చేయాలి. కానీ కొందరు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా ఆపరేషన్లు చేసి మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

ఏటా 4 వేల వరకు ఆపరేషన్లు

జిల్లా వ్యాప్తంగా ఏటా వేలాదిగా గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు (హిస్టక్టమీ) చేసేస్తున్నారు. ఏటా 4 వేల మంది వరకు మహిళలకు హిస్టక్టమీ ఆపరేషన్లు చేస్తున్నట్టు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో విధంగా ఆపరేషన్‌కు ఫీజు వసూలు చేస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. మరికొన్ని ఆస్పత్రుల్లో రూ.30 వేల నుంచి రూ. 40 వేల వరకు కూడా ఫీజు వసూలు చేస్తున్నారు.


తొలగింపుతో అనర్థాలు

గతంలో గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు 40, 50 ఏళ్లు పైబడిన వారికి చేసేవారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చేస్తున్నారు. 25, 30 సంవత్సరాల మహిళలకు కూడా ఈ ఆపరేషన్లు చేస్తున్నారు. తక్కువ వయసులో అవసరం లేకున్నా గర్భసంచి ఆపరేషన్ చేయడం వల్ల మహిళలు నడుం నొప్పి, నీరసం, ఏ పని చేయలేక పోవడం వంటి సమస్యల బారిన పడతారు.

> **చర్యలకు ఆదేశాలొచ్చాయి..**
> గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు అవసరం లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. నిబంధనలు పాటించకుండా విరుద్ధంగా ఈ ఆపరేషన్లు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
> **- డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ**

కట్టడికి ప్రభుత్వం ఆదేశాలు

మహిళలకు అవసరం ఉన్నా.. లేకున్నా గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. వీటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో అవసరం లేకున్నా గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు చేస్తున్న వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.



మిషన్ 'సూర్యచంద్ర'

- చంద్రుడిపై పరిశోధనకు చంద్రయాన్–3.. సూర్యుడిపై పరిశోధనకు ఆదిత్య–ఎల్1
- జూలై.. ఆగస్టులోనే 2 ప్రయోగాలు
- సన్నాహాలు చేస్తున్న ఇస్రో



అంతర్జాతీయంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సత్తా చాటుతోంది.. గ్రహాంతర ప్రయోగాల్లో దేశప్రతిష్టను ఇనుమడింపజేస్తోంది.. ఇప్పటికే చంద్రయాన్.. మంగళయాన్ పేరుతో చంద్రుడు.. అంగారకుడిపై పరిశోధనలు చేపట్టింది. అదే స్ఫూర్తితో మరో పర్యాయం చంద్రమండలం స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది.. అలాగే సూర్యునిపై వాతావరణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించేందుకు ప్రత్యేక ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది.. ఎల్‌వీఎం-3.. పీఎస్ఎల్వీ సీ56 రాకెట్ల ద్వారా విశిష్ట ఉపగ్రహాలను రోదసీలోకి పంపించేందుకు సన్నద్ధమవుతోంది.. ప్రపంచవ్యాప్తంగా భారత కీర్తిపతాకను అప్రతిహతంగా ఎగురవేసేందుకు అడుగులు వేస్తోంది.

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ మరోసారి ప్రత్యేక ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. సూర్యచంద్రులపై పరిశోధనలు చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది జులై, ఆగస్టులోనే రెండు గ్రహాంతర ప్రయోగాలు విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. జులై 12న ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా 3,900 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు శ్రీహరికోట షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఎల్‌వీఎం-3 రాకెట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మే 28వ తేదీన చంద్రయాన్-3 మిషన్ కూడా బెంగళూరు నుంచి చేరుకుంది. షార్‌లోని క్లీన్‌రూంలో దీనికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో చంద్రయాన్-2 మిషన్‌లో భాగంగా ఆర్బిటర్ ద్వారా ల్యాండర్‌ను పంపించారు. ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై దిగిన తర్వాత రోవర్‌ను విడుదల చేసే విధంగా డిజైన్ చేశారు. చంద్రయాన్-3 ప్రయోగంలో ప్రపొల్షన్ మాడ్యూల్ ద్వారా ల్యాండర్‌ను చంద్రుడి వైపునకు పంపించబోతున్నారు. ల్యాండర్ నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలు చేసేలా రూపకల్పన చేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువంలో మెత్తగా వుండే స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ దించాలని నిర్ణయించారు. ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్టుకి సుమారు రూ.615 కోట్లు వెచ్చిస్తున్నారు.

పీఎస్ఎల్వీ ద్వారా ఆదిత్య ఎల్-1

సూర్యుడిపై పరిశోధనలను చేసేందుకు 1,412 కిలోల ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదికకు సంబంధించి పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనంలో రాకెట్ అనుసంధానం పనులు చేస్తున్నారు. ఈ ప్రయోగాన్ని జులై ఆఖరుకి కానీ, ఆగస్టు మొదటి వారంలో కానీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆదిత్య ఎల్-1 ద్వారా సౌరగోళంలో గాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలు చేయనున్నారు.. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు ఏర్పడే అవరోధాలు, కాంతి మండలం (ఫొటోస్ఫియర్), వర్ణ మండలం (క్రోమోస్ఫియర్)పై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. సౌర వాతావరణాన్ని పరిశోధించేందుకు కరోనాగ్రఫీ ప్రయోగమని కూడా అంటారు. భూమికి 1.5 మిలియన్ కిలోమీటర్లు దూరంలో వున్న సూర్య వ్యవస్థ లాంగ్రేజ్ పాయింట్-1 (ఎల్-1) కక్ష్యలోకి ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి పరిశోధనలు చేపట్టనున్నారు.

సత్తా చాటిన ఇస్రో

గ్రహాంతర ప్రయోగాల్లో ఇస్రో ఇప్పటికే సత్తా చాటింది. గతంలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది. 2008లో చంద్రయాన్-1, 2019లో చంద్రయాన్-2, 2013లో మంగళయాన్-1 పేరుతో విశేష పరిశోధనలు చేపట్టింది. మూడు గ్రహాంతర ప్రయోగాలు చేసిన ఇస్రో ఇప్పుడు ఏకంగా సూర్యుడిపైకి ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని, చంద్రుడిపై పరిశోధనలు చేయడానికి చంద్రయాన్-3 అనే రెండు ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతోంది. చంద్రయాన్-1 ప్రయోగంతో లూనార్ ఆర్బిట్‌లో చంద్రుడి చుట్టూ ఉపగ్రహాన్ని తిప్పి చంద్రుడికి రెండోవైపు ఏముందో పరిశోధనలు చేసింది. అప్పుడే చంద్రుడిపై నీరు ఉన్నట్లు కనిపెట్టింది. చంద్రయాన్-2 పేరుతో మరో అడుగు ముందుకేసి చంద్రుడిపై ల్యాండర్, రోవర్‌ను దించేందుకు యత్నించింది. అయితే చివరి రెండు నిముషాల్లో సాంకేతిక లోపం తలెత్తడంతో ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొనడంతో ప్రయోగం విఫలమైంది. దీంతో ఈ పర్యాయం విజయం సాధించేందుకు చంద్రయాన్-3లో భాగంగా మరోమారు ల్యాండర్, రోవర్‌ను చంద్రుడిపై దించేందుకు సంకల్పించింది. ఈ రెండు ప్రయోగాలు సక్సెస్ అయితే ఇస్రో ఖ్యాతి అంతర్జాతీయంగా మరింత ఇనుమడిస్తుందనడంతో సందేహం లేదు.



క్లుప్తంగా...

శాంతి యజ్ఞంలో పాల్గొన్న సీఎం జగన్



యజ్ఞంలో దీపారాధన చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న గోశాలలో ఆదివారం శాంతి యజ్ఞం నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం(దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల విజయవాడలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టోత్తర శతకుండాత్మక(108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ మహాయజ్ఞం విజయవంతంగా పూర్తి అయిన నేపథ్యంలో వేద పండితుల సూచనల మేరకు, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు నిమిత్తం ఆదివారం గోశాలలో శాంతి యజ్ఞం నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారుగా బాగ్దాదీ



బాగ్దాదీకి నియామక పత్రాన్ని అందిస్తున్న సజ్జల

సాక్షి, అమరావతి: కడప ప్రాంత ముస్లిం మత గురువైన ముఫ్తీ సయ్యద్ షా మొహమ్మద్ అలీ బాగ్దాదీ ఏపీ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అందజేశారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రుహుల్లా, ఏపీ స్టేట్ హజ్ కమిటి చైర్మన్ బీఎస్ గౌస్ లాజామ్, ఏపీ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అసిఫ్ అలీ, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ షమీమ్ అస్లం, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ చైర్మన్ వి.ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	45.8	29.6
గుంటూరు	44.0	33.0
రాజమహేంద్రవరం	42.0	29.5
విజయవాడ	42.0	29.0
ఏలూరు	42.0	29.0
తిరుపతి	41.0	28.0
కడప	40.7	30.4
నెల్లూరు	39.9	33.7
విజయనగరం	38.0	28.0
విశాఖపట్నం	37.2	29.4
అనకాపల్లి	37.0	24.0
శ్రీకాకుళం	36.0	29.0



విజయవాడ 58వ డివిజన్‌లో ఐతం రంగమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ భవాని



గుంటూరు నాజ్‌సెంటర్ వద్ద సుభాషిణికి వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ సందీప్



ఏలూరులో ఎస్‌కే కాలేషాకు పింఛను అందజేస్తున్న వలంటీర్ ఎస్.ఇందిర

61.82 లక్షల మందికి రూ.1,703.39 కోట్లు

97.92 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: వలంటీర్లు ఆదివారం కూడ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 61,82,629 మంది లబ్ధిదారులకు రూ.1,703.39 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటికే 97.92 శాతం పంపిణీ పూర్తయినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు తెలిపారు. సోమవారం కూడా వలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ కొనసాగనుంది.



రాజమహేంద్రవరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాడిమళ్లకు చెందిన వీరన్నకు పింఛను అందిస్తున్న వలంటీర్ కన్నబాబు



తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చోడవరానికి చెందిన ఆనందయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ బాలాజీ

మనోళ్లు 553 మంది క్షేమం

- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాద ఘటనలో రాష్ట్రానికి చెందిన 553 మంది క్షేమంగా ప్రమాదం నుంచి బయట పడ్డారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో 485 మంది, యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది వెరసి 696 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 92 మంది ప్రయాణించలేదని చెప్పారు. మిగతా వారిలో 553 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, 21 మంది స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి మృత్యువాత పడ్డారన్నారు. మిగతా 28 మంది ప్రయాణికుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. వారి మొబైల్ నంబర్ల ఆధారంగా చిరునామా తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ప్రయత్నిస్తోందని తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ విశాఖలో 309, రాజమండ్రిలో 31, ఏలూరులో 9, విజయవాడలో 135 మంది దిగాల్సిన వారు ఉన్నారన్నారు. యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ నుంచి 33, రాజమండ్రి నుంచి ముగ్గురు, ఏలూరు నుంచి ఒకరు, విజయవాడ నుంచి 41, బాపట్ల, తెనాలి నుంచి ఎనిమిది, గుంటూరు నుంచి ఇద్దరు, ఒంగోలు నుంచి 11 మంది, నెల్లూరు నుంచి ముగ్గురు, తిరుపతి నుంచి 107 మంది ఎక్కారని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరిని విశాఖ కేజీహెచ్, ఇద్దరిని సెవెన్ హిల్స్, ఒకరిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రుల్లో చేర్చి చికిత్స అందిస్తున్నామని, నలుగురిని ఒడిశా నుంచి ఏపీకి తీసుకొస్తున్నారని చెప్పారు. మిగతా వారు వైద్యం చేయించుకుని ఇళ్లకు వెళ్లిపోయారన్నారు. రాష్ట్రం నుంచి 50 అంబులెన్సులను కటక్, భువనేశ్వర్‌లకు పంపించామన్నారు. ఇంకా తమ వారి ఆచూకీ తెలియ లేదని కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ కాల్స్ రాలేదని తెలిపారు. రైళ్ల ప్రమాదం నుంచి బయటపడి వాహనాల్లో విశాఖ చేరుకున్న ఏడుగురికి రవాణా ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరఫున రూ.30 వేల చెక్కును బాధితుడు ఎం.సత్యంకు మంత్రి అందజేశారు. రాష్ట్రానికి చెందిన క్షతగాత్రులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు సీఎం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశంతో ఇప్పటికే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఐఏఎస్, ఐపీఎస్‌లతో కూడిన బృందం ఘటన స్థలం నుంచి.. విశాఖ నుంచి తాను, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ పాల్గొన్నారు.



ప్రమాద బాధితుడు సత్యానికి చెక్కు అందిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కల్యాణి

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఒడిశాలోని బహనాగబజార్ స్టేషన్ సమీపంలో రైలు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించారు. ప్రమాదం నుంచి బయటపడిన ప్రయాణికులను స్వస్థలాలకు పంపించేందుకు భాద్రాక్ స్టేషన్ నుంచి చెన్నైకు ఆదివారం ప్రత్యేక రైలు(13863) నడిపారు. చెన్నై–హౌరా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైనందున.. ఈ నెల 5న దానికి ప్రత్యామ్నాయంగా చెన్నై సెంట్రల్ నుంచి బహనాగబజార్‌కు ప్రత్యేక రైలు(02842)ను అదే షెడ్యూల్‌లో నడపనున్నట్లు అధికారులు తెలిపారు. పునరుద్ధరణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో చెన్నై సెంట్రల్–హౌరా(12840) రైలును ఆదివారం కూడా రద్దు చేశారు. సికింద్రాబాద్–గౌహతి ఎక్స్‌ప్రెస్(12513)ను ఖరగ్‌పూర్, టాటానగర్, రూర్కెలా, జార్సుగూడ స్టేషన్ల మీదుగా మళ్లించి నడుపుతున్నారు.

రైలు ప్రమాదంలో ఏపీ బాధితులకు పరిహారం

సాక్షి, అమరావతి: ఒడిశా రైలు ప్రమాదంలో ఏపీకి చెందిన బాధితులందరికీ పరిహారం ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైలు ప్రమాద దుర్ఘటన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆదివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖపట్నంలో మరో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణించి ఉంటే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయానికి ఇది అదనం అని స్పష్టం చేశారు. బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మరణించారని, ఇది తప్ప రాష్ట్రానికి చెందిన వారెవరూ ఈ ఘటనలో మరణించినట్టుగా ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు. గాయపడ్డ వారికి మంచి వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ట్రాక్‌ల నిర్వహణ లోపాలమయం

సాక్షి, అమరావతి: రైల్వేలో భద్రతా లోపాలపై గత ఏడాది కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2017 నుంచి 2021 మధ్య కాలంలో జరిగిన రైలు ప్రమాదాలు ప్రతీ నాలుగింటిలో మూడు పట్టాలు తప్పిన ఘటనలే జరిగాయని తెలిపింది. ట్రాక్స్ నిర్వహణలో లోపాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించింది. 2022 డిసెంబర్‌లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ నివేదికలో ఏదైనా రైలు ప్రమాదం జరిగిన తర్వాత పూర్తి స్థాయిలో నివేదికలు రావడం లేదని, ఆ ప్రమాదం లోపాలను మళ్లీ సవరించుకోవడం లేదని కాగ్ నిందించింది.

- 422 రైళ్ల పట్టాలు తప్పితే అందులో 171 ప్రమాదాలు ట్రాక్‌ల నిర్వహణలో లోపాల కారణంగా, మరో 156 ఒక లైన్‌లోకి బదులుగా మరో లైన్‌లోకి వెళ్లడం వల్ల జరిగాయి.
- 63శాతం దుర్ఘటనల్లో విచారణ నివేదికలను నిర్ణీత కాల పరిమితిలోగా విచారణ నివేదికను సమర్పించ లేదు. 49శాతం ఘటనల్లో విచారణ నివేదికను ఉన్నతాధికారులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదించలేదు.
- రైల్వేను నిధులు కొరత వేధిస్తోంది. 2017–18లో కేటాయించిన పనుల్లో 81.55 శాతం పనులే పూర్తిచేయగా 2019–20లో కేవలం 73.76శాతం పనులే చేయగలిగింది.
- ఆన్‌లైన్ ద్వారా ట్రాక్‌ల నిర్వహణ కార్యకలాపాలను పర్యవేక్షించే ఈ వ్యవస్థ సరిగా పని చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో అధికారులకి తెలీడం లేదు. రైల్వే భద్రతపై కాగ్ అక్షింతలు వేసినా అధికారుల అలసత్వమే ఒడిశా రైలు ప్రమాదానికి కారణమని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

బాధితులకు ఏపీ ప్రభుత్వ భరోసా

- ఘటన స్థలం సందర్శించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- సహాయక చర్యలపై రైల్వే మంత్రితో చర్చలు
- కుటుంబ సభ్యులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు : మంత్రి సురేశ్
- క్షతగాత్రులు, మృతుల వివరాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్

సాక్షి అమరావతి/భువనేశ్వర్/మహారాణిపేట : ఒడిశా రాష్ట్రంలో చోటుచేసుకున్న రైలు ప్రమాదంలో గాయపడి, బాలాసోర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందున్న క్షతగాత్రులను ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరామర్శించారు. అంతకు ముందు ఆయన బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో స్థితిగతులను సమీక్షించి, ఘటన పూర్వాపరాలపై అధికారులతో విశ్లేషించారు. లోటుపాట్లు లేకుండా సహాయ, పునరుద్ధరణ కార్యకలాపాలు కొనసాగేలా వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా చర్చించారు. స్థానికుల సహాయ, సహకారాలను మంత్రి ప్రశంసించారు. బాధితులను ఆదుకునే దిశగా ఏపీ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని వివరించారు. అత్యవసర సేవలకు అనుకూలంగా భువనేశ్వర్‌లో 16 అంబులెన్స్‌లు, 10 మహా ప్రస్థానం వాహనాలు, బాలాసోర్‌లో 5అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచిందని చెప్పారు.

భువనేశ్వర్‌లో బాధితుల సహాయ కేంద్రం

ఆచూకీ తెలియని వారి కోసం భువనేశ్వర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఏపీ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఒడిశా అధికారులతో సంప్రదింపులు చేస్తోందన్నారు. భువనేశ్వర్‌లోని ఆస్పత్రుల్లో 120 గుర్తు తెలియని మృతదేహాలు ఉన్నాయన్నారు. మృతులను గుర్తించడానికి కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు వాహనాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సహాయం కోసం 1929 హెల్ప్‌లైన్‌తో పాటు ప్రత్యేక అధికారి తిరుమల నాయక్(ఐఏఎస్) 8895351188ను బాధిత కుటుంబాలు సంప్రదించాలని సూచించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల, మృతుల వివరాలను https://srcodisha.nic.in/, https://www.bmc.gov.in, https://www.osdma.org వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారన్నారు. కటక్ రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎస్‌సీబీ మెడికల్ కళాశాల, భువనేశ్వర్ రైల్వేస్టేషన్, బారముండా బస్టాండ్, విమానాశ్రయంలో హెల్ప్‌డెస్క్‌లు పని చేస్తున్నాయన్నారు.



బాలాసోర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

క్షతగాత్రులకు విశాఖలో చికిత్స

రైలు ప్రమాదంలో గాయపడ్డ పలువురికి విశాఖలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. సెవెన్ హిల్స్, ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రుల్లో ఇద్దరి చొప్పున, కేజీహెచ్‌లో ముగ్గురికి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎ.శంకరరావుకు అన్ని పరీక్షలు చేశామని, ఆరోగ్యం స్థిరంగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. బాధితుల కోసం కేజీహెచ్ క్యాజువాలిటీ వద్ద 30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. బుచ్చిరాజు పాలెం ప్రాంతానికి చెందిన భారతి, మాధవరావులకు ఇక్కడే చికిత్స అందిస్తున్నామన్నారు. కె.పూజ అనే మహిళను భువనేశ్వర్ నుంచి విశాఖకు తీసుకొస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.



విశాఖ కేజీహెచ్‌లో బాధితుడు శంకరరావుకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గురుమూర్తికి అక్కడే అంత్యక్రియలు

ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన సి.గురుమూర్తి ఒక్కరే మృతి చెందారు. ఆయన కుటుంబం బాలాసోర్‌లో ఉంటున్నందున మృతదేహాన్ని అక్కడికే తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా విజయవాడలో దిగాల్సిన ప్రయాణికుల్లో 11 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. బాధితుల కుటుంబసభ్యులకు సమాచారం అందించేందుకు అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచామని రైల్వే అధికారులు తెలిపారు. బాధితుల వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 1070, 18004250101, 8333905022 (వాట్సాప్) సంప్రదించవచ్చని తెలిపారు.

విమానాలతో విజయవంతంగా ఏరియల్ సర్వే

- సర్వేలో వేగం పెంచేందుకు డ్రోన్లతోపాటు ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగం
- మూడు ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఒక హెలికాప్టర్‌తో కొలతలు
- 30 వేల చదరపు కిలోమీటర్లలో పూర్తయిన సర్వే
- భూముల సర్వేకు దేశంలోనే తొలిసారి విమానాలు వాడిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: వందేళ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా భూముల రీ సర్వే చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. దాన్ని మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా విమానాలను వినియోగిస్తోంది. ఈ విధానంలోనూ విజయవంతంగా ముందుకెళ్తోంది. రీసర్వేలో 1.30 లక్షల చదరపు కిలోమీటర్లు కొలవాల్సివుంది. అందులో 32,252 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఏరియల్ సర్వే ద్వారా, మిగిలిన ప్రాంతాన్ని డ్రోన్ల ద్వారా కొలవాలని నిర్ణయించారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 32,252 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఏరియల్ సర్వే ద్వారా కొలవడం మొదలుపెట్టి ఇప్పటికే 30 వేల చదరపు కిలోమీటర్లకుపైగా పూర్తి చేశారు. మరో 15 రోజుల్లో మిగిలిన 2 వేలకుపైగా చదరపు కిలోమీటర్లలోనూ సర్వే పూర్తి చేస్తామని సర్వే సెటిల్మెంట్ అధికారులు తెలిపారు.

త్వరగా సర్వే పూర్తి చేయడం కోసమే..

రీ సర్వేను ఇంకా వేగంగా నిర్వహించాలంటే డ్రోన్లకంటే ఎక్కువ ఎత్తుకు ఎగిరే విమానాలు, హెలీకాప్టర్లను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ భాగాన్ని కొలవొచ్చు. కానీ భూముల సర్వే కోసం ఇప్పటివరకు దేశంలో ఎక్కడా విమానాలను ఉపయోగించలేదు. జాతీయ రహదారులు, కొన్ని పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి విమానాలతో ఆ ప్రాంతాలను కొలిచిన అనుభవం మాత్రమే ఉంది. దీంతో అందులో అనుభవం ఉన్న సంస్థలతో చర్చించి తొలిసారి విమానాల ద్వారా భూముల కొలతను నంద్యాలలో ప్రారంభించారు. ఎక్కువ ప్రాంతాన్ని కొలిచేందుకు ఎక్కువ పిక్సెల్స్ ఉండే అత్యాధునిక కెమేరాలు ఉపయోగించారు. వాటి చిత్రాలను హైదరాబాద్‌లోని సర్వే ఆఫ్ ఇండియా లేబొరేటరీలో తనిఖీ చేయించారు. డ్రోన్ల కంటే కచ్చితత్వంతో చిత్రాలు వచ్చాయని నిర్ధారణ అయింది. అనంతరం 32 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని రెండు ఏజెన్సీల ద్వారా 3 ఎయిర్‌క్రాఫ్ట్‌లతో, ఒక ఏజెన్సీకి చెందిన హెలీకాప్టర్‌ను వినియోగించి సర్వే చేయించారు. డ్రోన్ల ద్వారా 120 మీటర్ల ఎత్తు నుంచి చిత్రాలు తీస్తున్నారు. విమానాల ద్వారా 1,500 మీటర్ల ఎత్తు నుంచి ఫొటోలు తీశారు. ఒక్క రోజులో 200 నుంచి 300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని విమానాల ద్వారా కొలిచారు. ఎక్కువ పరిధిలోని భూమి ఒకే చిత్రంలో అత్యంత నాణ్యతతో రావడంతో రీసర్వే సులభమైందని సర్వేశాఖ అధికారులు చెబుతున్నారు.

సంస్కరణలతో ఆదాయం వృద్ధి

- స్నేహపూర్వక శాఖగా మారిన వాణిజ్యపన్నుల శాఖ

సాక్షి, అమరావతి: వాణిజ్యపన్నుల శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలతో ఆ శాఖ ఆదాయం భారీగా పెరిగింది. 2022–23లో జీఎస్టీ ఆదాయం 20.13% వృద్ధితో ఏకంగా రూ.28,092.87 కోట్లు నమోదవడం విశేషం. గతంలో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు అంటే వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఎప్పుడు తనిఖీలు చేస్తారో.. ఎలాంటి జరిమానాలు విధిస్తారో.. అన్న భయం ఉండేది. కానీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అధికారులు వాణిజ్యపన్నుల శాఖను పూర్తిగా స్నేహపూర్వక శాఖగా మార్చారు. గత ఏడాది కాలంగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. అవకతవకలకు పాల్పడకుండా పన్నులు చెల్లించే వ్యాపారులకు రక్షణ కల్పిస్తూ.. అదే సమయంలో పన్నులు ఎగ్గొట్టేవారిని గుర్తించడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో తనిఖీల భయం లేకుండా నిజమైన వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ సంస్కరణలతో రాష్ట్రంలో పన్ను ఎగవేతలకు అడ్డుకట్టపడింది. గతేడాది (2022–23)లో ఈ సంస్కరణల ద్వారా అదనంగా రూ.1,745 కోట్ల ఆదాయం సమకూరినట్లు రాష్ట్ర పన్నుల ప్రధాన అధికారి గిరిజాశంకర్ 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఒకే సంవత్సరం 10కిపైగా కీలక సంస్కరణలతో పూర్తిస్థాయి ప్రక్షాళన చేశామన్నారు. పన్ను చెల్లించని వ్యాపారులను గుర్తించి వారితో పన్ను కట్టించడం ద్వారా రూ.263.9 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆటోమేటిక్ రిటర్న్ స్క్రూట్నీ ద్వారా రూ.132.91 కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. ఆడిటింగ్ ద్వారా రూ.38.79 కోట్లు, తనిఖీల ద్వారా రూ.64.29 కోట్లు, వ్యాట్ బకాయిలను వసూలు చేయడం ద్వారా రూ.235.13 కోట్లు వచ్చాయన్నారు. 2021–22తో పోలిస్తే రాష్ట్ర జీఎస్టీ ఆదాయం (పరిహారం లేకుండా) 2022–23లో 20.13% వృద్ధితో రూ. 28,092.87 కోట్లుగా నమోదైందని తెలిపారు. పరిహారంతో కలిపి చూస్తే మొత్తం జీఎస్టీ ఆదాయం రూ.33,511.33 కోట్లని చెప్పారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన కీలక సంస్కరణలివే..

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అధికారుల ప్రమేయం లేకుండా సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాహనాలను తనిఖీచేసే ఆటోమేటెడ్ చెక్ ఆఫ్ వెహికల్ ట్రాఫిక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విధానంలో ఏ అధికారి వాహనాలను చెకింగ్ చేస్తారన్న విషయాన్ని 24 గంటలు ముందుగానే ఎస్ఎంఎస్ విధానంలో తెలియజేస్తారు. రిటర్నుల స్క్రూట్నీలో కూడా అధికారుల ప్రమేయం లేకుండా ర్యాండమ్ విధానంలో ఎంపిక చేసేలా రిటర్న్ స్క్రూట్నీ ఆటోమేటెడ్ టూల్‌ను అందుబాటులోకి తెచ్చారు. జీఎస్టీ పోర్టల్‌లోని డేటా, ఎనలిటికల్ నివేదికల ఆధారంగా స్క్రూట్నీ కోసం రిటర్నులను ఎంపిక చేస్తారు. అలాగే ఎనలిటిక్ రిపోర్టులను ఎప్పటికప్పుడు తెలిపేలా డ్యాష్‌బోర్డు, కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా లీగల్ కేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్, ఈ–జర్నల్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్రీకృత డేటా ఎనలిటికల్ సెంటర్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సమాచారాన్ని క్రోడీకరిస్తున్నారు. తద్వారా పన్ను ఎగవేతదారులను గుర్తించి నేరుగా వారివద్దే తనిఖీలు చేస్తున్నారు.

వ్యాపారుల రక్షణే మా లక్ష్యం



రాష్ట్రంలో నిజాయితీగా వ్యాపారం చేస్తున్నవారికి రక్షణగా ఉండాలన్నదే మా ప్రభుత్వ విధానం. ఇందుకోసం ఏడు ప్రధాన రాష్ట్రాల్లో వాణిజ్యపన్నుల శాఖ పనితీరు, అమలు చేస్తున్న విధానాలను పరిశీలించాం. వీటన్నింటినీ క్రోడీకరించి వాటికంటే మంచి విధానాలను రాష్ట్రంలో అమలుచేసే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం. ఈ సంస్కరణలను రాష్ట్ర వ్యాపార, వాణిజ్యసంఘాలు స్వాగతిస్తున్నాయి.

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థికమంత్రి

క్లుప్తంగా...

నీట్ యూజీ రెస్పాన్స్ షీట్‌ల విడుదల

సాక్షి, అమరావతి: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) యూజీ- 2023 ఓఎంఆర్ రెస్పాన్స్ షీట్స్‌ను ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. నీట్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలో నమోదు చేసిన మెయిల్ ఐడీల ద్వారా రెస్పాన్స్ షీట్‌లను విద్యార్థులకు పంపారు. తుది 'కీ' మాత్రం వెలువరించలేదు. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం గత నెల 7న దేశ వ్యాప్తంగా నీట్ యూజీ నిర్వహించారు. ఏపీ నుంచి 68,000 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో తరగతులు పునఃప్రారంభం

నూజివీడు: వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈ నెల ఐదో తేదీ నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. గత నెల 14 నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఆర్జీయూకేటీ అధికారులు వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో విద్యార్థులందరూ వేసవి సెలవులకు ఇళ్లకు వెళ్లారు. సెలవులు ఆదివారంతో ముగియడంతో విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు చేరుకుంటున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా హాస్టళ్ల గదులను సిద్ధం చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఆదివారం సాయంత్రం నుంచే విద్యార్థులు చేరుకుంటున్నారు.

11న 'ఏపీ మోడల్ స్కూల్స్' ప్రవేశ పరీక్ష
హాల్ టికెట్లు విడుదల



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం ఈ నెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ ఎంవీ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ పరీక్షకు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విశాఖలో అమిత్‌షా పర్యటనను నిరసించండి
ప్రజలకు 10 వామపక్ష పార్టీల పిలుపు

సాక్షి, అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం చేసిందని, తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 8న విశాఖలో బహిరంగ సభ కోసం వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటనను నిరసించాలని పది వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి చేసిన విద్రోహాన్ని ఖండిస్తూ వామపక్ష పార్టీల నేతలు ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశం వివరాలను మీడియాకు ఓ ప్రకటనలో వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు 2014లో ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత గత పార్లమెంటులోనూ, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వి.శ్రీనివాసరావు (సీపీఎం), కె.రామకృష్ణ (సీపీఐ), వై.సాంబశివరావు, వెంకటేశ్వర్లు (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్(సీపీఐ ఎంఎల్), కె.నాగభూషణం(ఎంసీపీఐయూ), ఎస్.మూర్తి(సీపీఐ ఎంఎల్ లిబరేషన్), బీఎస్ అమర్‌నాథ్(ఎస్‌యుసీఐసీ), పీవీ సుందర రామరాజు(ఫార్వర్డ్ బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ) ఉన్నారు.

టీడీపీ నేత 'ఆనం'పై దాడికి యత్నం

నెల్లూరు (క్రైమ్): ఐదుగురు దుండగులు కర్రలతో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డిపై దాడికి ప్రయత్నించగా, అపార్ట్‌మెంట్ వాసులు కేకలు వేయడంతో పరారయ్యారు. నెల్లూరు షార్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆదివారం తన స్నేహితుడు సికిందర్‌రెడ్డి, మరికొందరితో కలిసి ఉన్నారు. ఆయన మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి సెల్లార్‌లోకి వచ్చారు. ఇదే సమయంలో ముఖానికి రుమాలు కట్టుకుని ఉన్న ఐదుగురు యువకులు కర్రలు తీసుకుని రావడంతో వెంకటరమణారెడ్డి, సికిందర్‌రెడ్డి పెద్దగా కేకలు వేశారని, అపార్ట్‌మెంట్ వాసులు సైతం బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని స్థానికులు తెలిపారు. అయితే, టీడీపీ నేతలు మాత్రం ఆనం వెంకటరమణారెడ్డిపై దుండగులు దాడికి యత్నించారని, సికిందర్‌రెడ్డి, అపార్ట్‌మెంట్ వాసులు అడ్డుకోవడంతో పరారయ్యారని చెబుతున్నారు. దుండగులు పరారయ్యే క్రమంలో వారికి చెందిన రెండు బైక్‌లను అక్కడే వదిలివెళ్లారు. సమాచారం అందుకున్న వేదాయపాలెం సీఐ పీవీ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దుండగులు వదిలివెళ్లిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఆనం వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, బైక్ నంబర్ల ఆధారంగా దుండగుల కోసం గాలిస్తున్నారు.

లెక్కలతోనే ఇక్కట్లు..

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 పరీక్షలో ప్రశ్నల సరళి

- కెమిస్ట్రీ, ఫిజిక్సు ఒకింత సులభం
- పరీక్షకు 1.9 లక్షల మంది దరఖాస్తు.. 85 శాతం వరకు హాజరు
- ప్రశాంతంగా ముగిసిన పరీక్ష
- ఈసారి కటాఫ్ 86–91 మధ్య ఉండొచ్చని అంచనా



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్-2023 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు 1.9 లక్షల మంది దరఖాస్తు చేయగా, అందులో 85 శాతానికి పైగా హాజరైనట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేసిన విద్యార్థుల్లో 44వేల మంది బాలికలు ఉన్నారు. ఉదయం పేపర్–1, మధ్యాహ్నం పేపర్–2 పరీక్షను కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించారు. ఈసారి ఈ పరీక్షలో ప్రశ్నల సరళి గతంలో మాదిరిగానే మధ్యస్థంగా ఉన్నట్లు పరీక్షకు హాజరైన అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్ ప్రశ్నలు ఒకింత సులభంగా ఉన్నా, గణితానికి సంబంధించిన ప్రశ్నలు చాలా కఠినంగా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఈసారి సిలబస్‌ను బోర్డు సిలబస్‌తో సమానంగా ఉండేలా ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌నే పేర్కొన్నప్పటికీ ప్రశ్నలను రూపొందించిన తీరు వినూత్నమైన రీతిలో ఉందని వివరించారు. ముఖ్యంగా గణితానికి సంబంధించిన ప్రశ్నల చిక్కులు విప్పడం విద్యార్థులకు కష్టంగా మారిందని హైదరాబాద్ కేంద్రంగా పరీక్షకు కోచింగ్ నిర్వహించిన కార్పొరేట్ విద్యా సంస్థ అకడమిక్ డీన్ ఒకరు అభిప్రాయపడ్డారు.

ప్రశ్నలు అర్థం చేసుకోవడానికే ఎక్కువ సమయం..

ఇక, ఐఐటీ గౌహతి ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. పేపర్–1లో మొత్తం 180 మార్కులకు 51 ప్రశ్నలు అడిగారు. ఫిజిక్సు, కెమిస్ట్రీ, మేథమెటిక్స్‌లో 17 చొప్పున ప్రశ్నలు ఇచ్చారు. ఒక్కో విభాగంలో 60 మార్కులు చొప్పున ప్రశ్నలిచ్చారు. పరీక్ష రాసిన విద్యార్థుల అభిప్రాయం ప్రకారం మేథమెటిక్స్‌లో ప్రశ్నల సరళి అంతుచిక్కని రీతిలో కఠినంగా ఉంది. 'ప్రశ్నలను అర్థంచేసుకోవడానికి చాలా సమయం పట్టింది. ఎక్కువ సమయం మేథమెటిక్స్ విభాగపు ప్రశ్నలకే వెచ్చించాల్సి వచ్చింది'.. అని హైదరాబాద్ కేంద్రంగా పరీక్ష రాసిన విద్యార్థి శ్రీకాంత్ వివరించాడు. ఫంక్షన్స్, మేట్రిక్స్, ఎలిప్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబులిటీల నుంచి ప్రశ్నలు వచ్చాయని తెలిపాడు. ప్రాబబులిటీ, కాంప్లెక్సు నెంబర్స్, త్రీడీ, జామెట్రీల నుంచి కొంచెం మంచి ప్రశ్నలు వచ్చాయని మరికొందరు చెప్పారు. ఇక ఫిజిక్స్ విభాగంలో కైనమేటిక్స్, థర్మో డైనమిక్స్, మోడరన్ ఫిజిక్సు, కరెంట్ ఎలక్ట్రిసిటీ, కెపాసిటర్, గ్రావిటేషన్, ఆప్టిక్స్, ఎలక్ట్రో స్టాటిస్టిక్స్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ప్రశ్నలు వచ్చినట్లు విద్యార్థులు చెప్పారు. మేథమెటిక్స్, కెమిస్ట్రీలతో పోల్చిచూస్తే ఈసారి ఫిజిక్స్ సులభంగా ఉందనే చెప్పుకోవచ్చని పలు కోచింగ్ సంస్థల అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. కెమిస్ట్రీలో వచ్చిన ప్రశ్నలు ఒకింత అసమతుల్యంగా ఉన్నా మేథమేటిక్స్ అంత గజిబిజిగా లేదన్నారు. కెమిస్ట్రీ ప్రశ్నలను రాయడంలో విద్యార్థులు ఇబ్బంది పడినట్లు చెప్పారు. కొన్ని ప్రశ్నలు ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల నుంచి నేరుగా ఇచ్చినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఫిజికల్ కెమిస్ట్రీకి సంబంధించి కెమికల్ కైనటిక్స్, లోనిక్, కెమికల్ ఈక్విలిబ్రియమ్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఆటమిక్ స్ట్రక్చర్ అంశాల నుంచి ప్రశ్నలు వచ్చాయి. ఇక ఆర్గానిక్ కెమిస్ట్రీలో అమినీస్, పాలిమర్స్, బయోమాలిక్యులస్, ఆక్సిజన్ కంటైనింగ్ కాంపౌండ్స్ వంటి అంశాల్లో ప్రశ్నలు అడిగారు. ఎక్కువగా మిక్స్‌డ్ కాన్సెప్టులతో కూడిన ప్రశ్నలు వచ్చాయని విద్యార్థులు చెప్పారు. ఫిజికల్ కెమిస్ట్రీలో కన్నా ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయన్నారు.

జూన్ 11న ప్రిలిమనరీ కీ..


జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ప్రాథమిక కీని జూన్ 11న ఐఐటీ గౌహతి విడుదల చేయనుంది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు జూన్ 9 నుంచి వారికి అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వహణ సంస్థ ప్రకటించింది. జూన్ 18న ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేస్తామని ఐఐటీ గౌహతి ప్రకటించింది.

సీఆర్ఎల్ కటాఫ్ 86-91 మధ్య ఉండొచ్చు..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరైన అభ్యర్థులకు వారు సాధించిన మార్కుల ఆధారంగా రెండు రకాల ర్యాంకులను ప్రకటించనున్నారు. ఒకటి కామన్ ర్యాంకు లిస్టుకు సంబంధించినది కాగా.. మరొకటి అడ్మిషన్ల ర్యాంకుకు సంబంధించినది. అడ్మిషన్ల ర్యాంకులు మొత్తం సీట్లు, పరీక్ష రాసిన అభ్యర్థులు, సంస్థల వారీగా ఆయా సంస్థల్లో సీట్ల కేటాయింపులో చివరి ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ ర్యాంకు కటాఫ్ నిర్ణయిస్తారు. అలాగే, ర్యాంకు లిస్టుకు సంబంధించి కటాఫ్ మార్కులు ఈసారి జనరల్ కేటగిరీలో 86–91 మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఓబీసీలో 71–76, ఈడబ్ల్యూఎస్‌లో 77–82, ఎస్సీలకు 51–55, ఎస్టీలకు 39–44గా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు.

అడ్మిషన్ కటాఫ్‌కు గత కొన్నేళ్లుగా కనీస మార్కులు ఇలా..

కేటగిరీ	2022	2021	2020	2019
జనరల్	55	63	69	35
ఓబీసీ	50	56	62	31.5
ఈడబ్ల్యూఎస్	50	56	62	31.5
ఎస్సీ	28	31	34	17.5
ఎస్టీ	28	31	34	17.5



నేటి నుంచి పసుపు కొనుగోళ్లు



సాక్షి, అమరావతి: కొద్దిరోజులుగా ధరలేక ఇబ్బందిపడుతున్న పసుపు రైతుకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనీస మద్దతు ధర రూ.6,850గా నిర్ణయించి, 20 వేల టన్నులు కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఆర్బీకేల ద్వారా ఈ నెల 5వ తేదీ నుంచి కొనుగోలు చేసేందుకు ఏపీ మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేసింది.

నాలుగేళ్లలో 52 వేల టన్నుల పసుపు కొనుగోలు

కేంద్రం కనీస మద్దతు ధరలు ప్రకటించే పంటల జాబితాలో లేని పసుపునకు గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తోంది. ధర తగ్గిన ప్రతిసారి రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. ఇలా 2019–20 నుంచి ఇప్పటివరకు 29,193 మంది రైతుల నుంచి రూ.405.11 కోట్ల విలువైన 52,456.82 టన్నుల పసుపును సేకరించింది. అదే టీడీపీ ఐదేళ్ల పాలనలో 28 వేలమంది రైతుల నుంచి రూ.305 కోట్ల విలువైన 48,540.38 టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా గత రెండేళ్లుగా పసుపు ధరలు ఆకాశానికి ఎగబాకాయి. ఒకదశలో క్వింటా రూ.10 వేలకుపైగా పలికింది. నెలరోజుల కిందటి వరకు రూ.7 వేల నుంచి రూ.8 వేల మధ్య పలికింది. సాధారణంగా 50 శాతం రాష్ట్ర పరిధిలో వినియోగిస్తుండగా, 20 శాతం పొరుగు రాష్ట్రాలకు, 30 శాతం ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. 2022–23లో రికార్డు స్థాయిలో 84 వేల ఎకరాల్లో సాగుచేయగా, నాలుగు లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికే 50 శాతానికిపైగా మార్కెట్‌కు వచ్చింది.

సీఎం యాప్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

డిమాండ్‌కు మించి పసుపు వస్తుండడంతో పాటు దేశీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కొద్దిరోజులుగా మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం నాణ్యమైన పసుపు క్వింటా ధర రూ.5,500 నుంచి రూ.6,300 వరకు పలుకుతోంది. సీఎం యాప్ ద్వారా మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం పసుపు రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. మరోసారి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుంటోంది. ఇప్పటివరకు మార్కెట్‌కు ఎంత వచ్చింది. ఇంకా రైతుల వద్ద ఏ మేరకు నిల్వలున్నాయని ఆర్బీకే స్థాయిలో సర్వే చేసింది. వైఎస్సార్, నంద్యాల, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని రైతుల వద్ద పసుపు నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఆయా జిల్లాల పరిధిలోని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. రైతుల వద్ద ఉన్న పసుపు నిల్వలను నాణ్యతను బట్టి కనీస మద్దతు ధర రూ.6,850కి కొనుగోలు చేయనుంది.

సీఎం ఆదేశాల మేరకు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కనీస మద్దతు ధరకు రైతుల వద్ద ఉన్న పసుపును ఆర్బీకేల ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశాం. ఆర్బీకేల ద్వారా రైతులు తమ వివరాలను నమోదు చేసుకుంటే, వారివద్ద ఉన్న ఫైన్ క్వాలిటీ పసుపును కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.
- రాహుల్‌పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

న్యాయవ్యవస్థను భ్రష్టుపట్టించింది టీడీపీ సర్కారే

- ప్రభుత్వంపై లోపాలుంటే విమర్శలు చేయాలి..
- వ్యక్తిగత దూషణలకు దిగడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): న్యాయ వ్యవస్థను భ్రష్టుపట్టించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని, చంద్రబాబుకు అనుకూలంగా తీర్పులొస్తే ఒకలా.. వ్యతిరేకంగా వస్తే చంద్రబాబు అండ్ కోతో పాటు ఎల్లో మీడియా మరోలా రెచ్చిపోతూ న్యాయ వ్యవస్థపై పరోక్ష దాడులకు దిగుతోందని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.మనోహర్‌రెడ్డి ఆరోపించారు. విశాఖపట్నంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే, చంద్రబాబు అండ్ కో ఓర్వలేకపోతోందని, వాటిని అడ్డుకోవడానికే అనేక రిట్ పిటిషన్లు వేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాల అమలు సక్రమంగా సాగిపోతుండడంతో ఏమీచేయలేక నేరుగా సీఎంపైనే వ్యక్తిగత దూషణలకు దిగడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

సిగ్గుచేటుగా ఎల్లోమీడియా తీరు..

మరోవైపు.. చంద్రబాబుకి వత్తాసు పలుకుతున్న ఎల్లో మీడియా న్యాయవ్యవస్థపై పరోక్ష దాడులకు దిగడం సిగ్గుచేటని మనోహర్‌రెడ్డి అన్నారు. ఏమైనా లోపాలుంటే విధానాలపై విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత దూషణలకు దిగడం హేయమన్నారు. చివరకు చంద్రబాబు, లోకేశ్‌లు బూతులు తిడుతున్నారంటే వారు ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఇక వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ విషయంలో జడ్జిపై వ్యక్తిగతంగా దూషణలు చేసిన రెండు టీవీ చానల్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణ

ఉర్దూ వర్సిటీలో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల
జూన్ 20, 21, 22 తేదీల్లో నిర్వహణ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ఆధారిత కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ ప్రవేశ ఆధారిత రెగ్యులర్ కోర్సుల కోసం ప్రవేశ పరీక్షలను జూన్ 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి గడువు జూన్ 6వ తేదీగా ప్రకటించారు. ప్రవేశ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఎంబీఏ కోసం ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్) బీటెక్ కంప్యూటర్ సైన్స్ (లాటరల్ ఎంట్రీ), పీహెచ్‌డీ కోర్సులతోపాటు పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు కూడా ఉన్నాయి, ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఈ-ప్రాస్పెక్టస్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ manuu.edu.inలో అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6207728673, 9866802414, 6302738370 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ విశ్వవిద్యాలయంలో రెండు రకాల ప్రవేశాలు కల్పించేందుకు ఏటా చర్యలు తీసుకుంటారు. మరో రకమైన ప్రవేశాల ప్రక్రియను కూడా వర్సిటీ అధికారులు ప్రకటించారు. మెరిట్ ఆధారిత పీజీ, పీజీ డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలను జూలై 24 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

సురక్షిత మంచినీటి సరఫరాలో ఏపీ టాప్

- రాష్ట్రాల వారీగా ర్యాంకులు ప్రకటించిన కేంద్రం
- పరీక్షల నిర్వహణ, కలుషితాలు గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం ఆధారంగా మార్కులు



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచి నీటి సరఫరాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే టాప్‌లో నిలిచింది. గ్రామీణ ప్రజలు తాగే నీటికి ఏటా కనీసం రెండు విడతల పాటు నాణ్యత పరీక్షలు నిర్వహించడం.. కలుషితాలు గుర్తించినట్లయితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల రాష్ట్రాలకు ర్యాంకులు ప్రకటించింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత నీటి సౌకర్యాల కల్పన-ప్రజల భాగస్వామ్యం తదితర కార్యక్రమాలపై కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 2 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు సురక్షిత తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యల ఆధారంగా రాష్ట్రాలకు మార్కులు కేటాయించింది. మొత్తం 700కుగాను తమిళనాడు 699.93 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, ఏపీ 657.10 మార్కులతో రెండో స్థానం సాధించింది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక, మధ్యప్రదేశ్ ఉన్నాయి. అట్టడుగు స్థానాల్లో రాజస్థాన్, బిహార్, పశ్చిమ బెంగాల్ నిలిచాయి.

ఏపీలో 99.7 శాతం గ్రామాల్లో..

ప్రజలు తాగునీటికి ఉపయోగించే బోర్లు, బావులు, ఇతర వనరులలో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. మొత్తం 99.7 శాతం గ్రామాల్లోని నీటిలో బ్యాక్టీరియా, కెమికల్ సంబంధిత కలుషితాలను ప్రాథమికంగా గుర్తించడానికి కిట్లను అందుబాటులో ఉంచడంతో పాటు వాటి నిర్వహణపైనా గ్రామంలో ఒకరికి శిక్షణ ఇచ్చినట్టు కేంద్ర గణాంకాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని 18,357 గ్రామాలకుగాను 18,302 గ్రామాల్లో ప్రభుత్వం వర్షాకాలం ముందు, ఆ తర్వాత రెండు సార్లు తాగునీటి నాణ్యత పరీక్షలు జరిపిందని కేంద్రం వివరించింది. స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే తాగునీటి వనరుల్లో కూడా 97 శాతానికి పైగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించినట్టు కేంద్రం పేర్కొంది. కలుషితాలను గుర్తించిన చోట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్పటికప్పుడే ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టిందని కేంద్రం పేర్కొంది. ఏపీలో 25,546 వనరుల్లో కలుషిత నీటిని గుర్తించగా.. 25,545 చోట్ల ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిందని వివరించింది.

ఈవెనింగ్ వాక్‌లా..

- 3 రోజులుగా సాయంత్రం 5 గంటల తర్వాతే లోకేశ్ పాదయాత్ర
- సీఎం జగన్ ఫ్లెక్సీపై అసహనం.. చింపేస్తామని పోలీసులతో వాగ్వాదం
- రెండుచోట్ల చించివేత..



సీఎం జగన్ ఫ్లెక్సీని చింపేస్తామంటూ సీఐలతో లోకేశ్ వాగ్వాదం

చాపాడు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర ఆదివారం వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలో ఈవెనింగ్ వాక్‌లా సాగింది. మూడు రోజులపాటు సాయంత్రం 5 గంటల తర్వాతే లోకేశ్ పాదయాత్ర జరిగింది. ఇదేం పాదయాత్ర అని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇలా అయితే ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని వారు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. పాదయాత్ర పొడవునా ప్రతి గ్రామం వద్ద అక్కడికి వచ్చే కొద్దిపాటి మందిని లోకేశ్ దగ్గరకు రప్పించుకుని సెల్ఫీలు తీయించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సీఎం ఫ్లెక్సీపై లోకేశ్ వాగ్వాదం.. రాత్రికి చించివేత

ఇదిలా ఉంటే.. మండల కేంద్రమైన చాపాడులో శనివారం రాత్రి జరిగిన పాదయాత్రలో చాపాడు వద్ద వెలసిన పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం పేరుతో ఉన్న సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీపై పోలీసులతో లోకేశ్ వాగ్వాదం చేశారు. తమ తండ్రిని కించపరిచేలా ఉన్న ఫ్లెక్సీని చింపేస్తాం.. పీకేస్తాం.. అంటూ మైదుకూరు అర్బన్ సీఐ చలపతి, రూరల్ సీఐ నరేంద్రరెడ్డిలతో ఆయన వాగ్వాదం చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో చాపాడు కూడలిలో ఉన్న ఇద్దరు పోలీసులను కారులో వచ్చిన కొందరు వ్యక్తులు బెదిరించి అక్కడి సీఎం జగన్ ఫ్లెక్సీని చించేశారు. దీనిపై స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేయగా ఆదివారం పోలీసులు ఖాజీపేట ప్రాంతంలో ఆ కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు.. ఖాజీపేట మండలంలోనూ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని టీడీపీ కార్యకర్త చించివేయడం వివాదాస్పదమైంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

జగనన్న సంక్షేమ పాలనపై క్షేత్రస్థాయి ప్రచారం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మీట్‌లో సజ్జల భార్గవ్



సాక్షి, చెన్నై: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా పరిపాలనను, అందిస్తున్న సంక్షేమాన్ని సోషల్ మీడియా వేదికగా క్షేత్రస్థాయికి తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ పిలుపునిచ్చారు. చెన్నైలోని ఓఎంఆర్ పార్క్ ప్లాజాలో తమిళనాడు వైఎస్సార్‌సీపీ సేవాదళ్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నేతృత్వంలో ఆదివారం సోషల్ మీడియా సైనికుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. వందలాదిగా సోషల్ మీడియా సైనికులు, చెన్నైలోని అభిమానులు, వైఎస్సార్‌సీపీ, సేవాదళ్ కార్యకర్తలు ఈ సమావేశానికి తరలి వచ్చారు. సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా మధుసూదన్, సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్ జ్యోతి ప్రజ్వలనతో ఈ సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం సజ్జల భార్గవ్ మాట్లాడుతూ.. ప్రజల కలలను సాకారం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వివరించారు. విద్య, మహిళా సాధికారత, గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ , ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, హార్బర్‌లు నిర్మిస్తూ ప్రగతి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం దిశగా జగనన్న పయనిస్తుంటే.. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, నాలుగు రోడ్లు, పది లైట్లు అన్నట్టు టీడీపీ అధినేత చంద్రబాబు తీరు ఉందని మండి పడ్డారు. పేదల కష్టాలు, వారి జీవితాలతో చంద్రబాబుకు సంబంధం లేదని, పెత్తందారుల శ్రేయస్సే ఆయనకు ముఖ్యమని ధ్వజమెత్తారు.

కాలుష్యానికి కళ్లెం

వాయు కాలుష్యాన్ని 30 శాతం తగ్గించేలా ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వాయు కాలుష్యాన్ని 30% మేర తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. విశాఖ, విజయవాడ నగరాల్లో గాలిలో ఉన్న కాలుష్యం అంతకంతకు పెరుగుతోన్న నేపథ్యంలో దాన్ని తగ్గించేందుకు రెండేళ్లుగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే విశాఖ మునిసిపల్ కార్పొరేషన్.. ఏయూ, ఐఐటీ (కాన్పూర్), అమెరికాకు చెందిన డ్యూక్ వర్సిటీలతో కలిసి కాలుష్య నియంత్రణకు ప్రణాళిక తయారు చేసింది. విజయవాడ కార్పొరేషన్ కూడా ఐఐటీ (తిరుపతి) భాగస్వామ్యంతో ప్రణాళిక సిద్ధం చేస్తోంది. శ్రీకాకుళం,విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు నగరాల్లో ఈ తరహా ప్రణాళికలను రూపొందించారు. ఇందుకోసం ఆ నగరాలకు ప్రభుత్వం ఏటా రూ.2 కోట్ల చొప్పున మూడేళ్లు కేటాయిస్తుంది. శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు నగర పాలక సంస్థలు ఏయూ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ ప్రణాళికలు రూపొందించాయి. గుంటూరు, ఒంగోలు, నెల్లూరు నగరాలకు ఐఐటీ (తిరుపతి) సహకారంతో, చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు నగరాలకు నేషనల్ సెంటర్ ఫర్ అట్మోస్ఫియరిక్ రీసెర్చ్ (తిరుపతి) ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆ ప్రణాళికలను బట్టి గాలి కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వాయు కాలుష్య పర్యవేక్షణ

వాయు కాలుష్య నియంత్రణ కోసం ఈ నగరాల్లో రూ.35 కోట్లతో కంటిన్యూస్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. విశాఖ, విజయవాడ నగరాల్లో 5 చొప్పున, 11 మునిసి పాల్టీల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేస్తున్నారు. వీటిద్వారా గాలి కాలుష్యాన్ని ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం, ప్రజలకు దానిపై డిజిటల్‌గా చూపించడంపై అవగాహన కల్పించనున్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రతి జిల్లా కేంద్రంలోను ఒక స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



మంచివాళ్లకు ఎలా బాధ్యతగా ప్రవర్తించాలో చెప్పడానికి చట్టాలు అక్కర్లేదు. అదే సమయంలో చెడ్డవాళ్లు ఆ చట్టాల్లోని లొసుగులను దొరికించుకుంటారు.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 5 జూన్ 2023

రైలు పుస్తకం

ఈ దేశానికి స్వాతంత్ర్యం రైలు వల్లే వచ్చిందంటే ఉలిక్కిపడవలసిన అవసరం లేదు. జూన్ 7, 1893 రాత్రి– సౌత్ ఆఫ్రికా డర్బన్ నుంచి ప్రెటోరియాకు గాంధీ ప్రయాణిస్తున్నప్పుడు, ఆయన దగ్గర మొదటి తరగతి టికెట్ ఉన్నా, అది 'వైట్స్ ఓన్లీ క్యారేజ్' కావడాన పీటర్‌మార్టిస్‌బర్గ్ అనే చిన్న స్టేషన్‌లో కిందకు ఈడ్చేశారు. వివక్షతో కూడిన ఆధిపత్యం ఎంతటి క్రూరమైనదో గాంధీకి అవగాహన వచ్చిన సందర్భం అది. భారతదేశం వచ్చాక ఇక్కడ బ్రిటిష్‌వారి పాలనలో అంతకన్నా ఘోరమైన వివక్షను, ఆధిపత్యాన్ని దేశ జనులు అనుభవిస్తున్నారని ఆయనకు తెలియచేసింది రైలే. 'మూడవ తరగతి పెట్టెల్లో విస్తృతంగా తిరిగాక ఈ దేశమంటే ఏమిటో అర్థమైంది' అని ఆయన చెప్పుకున్నాడు. తర్వాత స్వాతంత్ర్య సంకల్పం తీసుకున్నాడు. నిజానికి గాంధీ రైలు ప్రయాణాలే జనం చెప్పుకుంటారుగాని నెహ్రూ కూడా 'నేను ఈ దేశాన్ని రైలులో తిరగడం ద్వారానే ఆకళింపు చేసుకున్నాను' అని 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో రాసుకున్నాడు.

'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా వాసికెక్కిన లార్డ్ డల్హౌసీ బ్రిటిష్ రాజ్యం, పాలన బలపడాలంటే భారతదేశంలో రైళ్ల వ్యవస్థ సమర్థంగా విస్తరించాలని భావించాడు. అయితే డల్హౌసీ ఒకటి తలిస్తే దేశ జనులు మరొకటి తలిచారు. ఏనాడు కనని, వినని ప్రాంతాలను రైలు ద్వారా సగటు భారతీయుడు తెలుసుకున్నాడు. బహు జాతులతో, సంస్కృతులతో సంపర్కంలోకి వచ్చాడు. అలా మనదంతా ఒక జాతి, 'భారత జాతి' అనే భావన పాదుకొనడానికి, అందరూ ఏకమై బ్రిటిష్ వారిపై పోరాడటానికి మొదటి భూమికను ఏర్పరించింది ఈ దేశంలో రైలే.

'భారతీయులు తమ పల్లెటూళ్లను రైల్వేస్టేషన్ లోకి తీసుకొస్తారు. పల్లెల్లో వాళ్ల ఇళ్లల్లోకి రానీయకపోవచ్చు. కాని పల్లె స్వభావం మొత్తం స్టేషన్‌లో ప్రదర్శనకు పెడతారు' అని అమెరికన్ ట్రావెల్ రైటర్ పాల్ థెరూ 'ది గ్రేట్ రైల్వే బజార్' (1975) పుస్తకంలో రాశాడు. నిజమే. గడ్డి మోపులు, ధాన్యం బస్తాలు, కోళ్ల గంపలు, కుండలు, గిన్నెలు, కట్టెలు, పాల క్యాన్లు, సైకిళ్లు, పనిముట్లు, అరుపులు, కేకలు, అక్కరలు, మక్కువలు... వారు స్టేషన్‌కు తేనిది ఏమిటి? బండి ఎక్కించనిది ఏమిటి? 'భారతదేశంలో రైలు కంపార్ట్‌మెంట్ అంటే ఇల్లే. అందులో ప్రతి ఒక్క ఇంటి సభ్యుణ్ణి చూడొచ్చు. రైలులో వారు అక్క, తమ్ముడు, అమ్మ, నాన్నలుగానే ఎక్కువగా ప్రయాణిస్తారు. ప్రయాణికులుగా తక్కువగా మారుతారు' అని మరొక పాశ్చాత్య రచయిత రాశాడు.

దొరలు ఎక్కే ఈ పొగబండి జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చాక కథ, కవిత, నవల, సినిమా, నాటకాల్లో దీని ప్రస్తావన లేకుండా సృజన సాగలేదు. భారతీయ రైళ్లను, వాటి కిటికీల గుండా కనిపించే దేశాన్ని మొదట రడ్‌యార్డ్ కిప్లింగ్ 'కిమ్' (1901) నవలలో రాశాడు. అయితే రైలును ఒక చారిత్రక సాక్ష్యంగా కుష్వంత్ సింగ్ మలిచాడు. మనో మజ్రా అనే చిన్న సరిహద్దు గ్రామంలో జనం ఒక ట్రైన్ ఆ ఊరి మీదుగా వెళితే నిద్ర లేస్తారు. మరో ట్రైను కూత వినిపిస్తే మధ్యాహ్నం కునుకు సమయం అని గ్రహిస్తారు. ఇంకో ట్రైన్ శబ్దం వచ్చాక రాత్రయ్యింది పడుకోవాలి అని పక్కల మీదకు చేరుతారు. 1947లోని ఒక వేసవి రోజు వరకూ వారి దినచర్య అలాగే ఉండేది. కాని ఆ రోజున వచ్చిన ఒక రైలు వారి జీవితాలను సమూలంగా మార్చేసింది. ఆ ఊరి వాళ్లు ఆ రైలు రాకతో హిందువులుగా, ముస్లింలుగా, సిక్కులుగా విడిపోయారు. ఆ తర్వాత? 'ట్రైన్ టు పాకిస్తాన్' నవల చదవాలి.

రైలు ప్రయాణాన్ని నేపథ్యంగా తీసుకుని 'గాలి వాన' అనే గొప్ప కథ రాశారు పాలగుమ్మి పద్మరాజు. మనుషుల ప్రాథమిక సంవేదనల ముందు వారు నిర్మించుకున్న అహాలు, జ్ఞానాలు, ఆస్తులు, అంతస్థులు, విలువలు గాలికి లేచిన గడ్డిపోచల్లా కొట్టుకుని పోతాయి అని చెప్పిన కథ ఇది. చాసో 'ఏలూరెళ్లాలి' కథ రైలు పెట్టెలోనే మనుగడ రహస్యాన్ని విప్పుతుంది. రైలు చుట్టూ ఎన్నో ప్రహసనాలు, పరిహాసాలు. తిలక్ రాసిన 'కవుల రైలు'లో కవులందరూ ఎక్కి కిక్కిరిసిపోతారు. పాపం ప్లాట్‌ఫారమ్ మీద ఒక యువతి మిగిలిపోతుంది. 'నీ పేరేమిటమ్మా' అంటాడు స్టేషన్ మాస్టరు. యువతి జవాబు– 'కవిత'!

'షోలే అంత పెద్ద హిట్ ఎందుకయ్యింది' అని ఎవరో అడిగితే 'రైలు వల్ల' అని సమాధానం ఇచ్చాడు అమితాబ్. 'షోలే' సినిమా రైలుతో మొదలయ్యి రైలుతో ముగుస్తుంది. అందులోని ట్రైన్ రాబరీ వంటిది ఇప్పటికీ మళ్లీ సాధ్యపడలేదు. 'సగటు ప్రేక్షకుడికి రైలు కనపడగానే కనెక్ట్ అయిపోతాడు' అని అమితాబ్ ఉద్దేశం. 'ఆరాధన'లో రైలు కిటికీ పక్కన పుస్తకం చదువుకుంటున్న షర్మిలా టాగోర్‌ను, రోడ్డు మీద జీప్‌లో పాడుకుంటూ వస్తున్న రాజేష్ ఖన్నాను మర్చిపోయామా మనం? 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' క్లయిమాక్స్– కదిలిపోతున్న రైలులోని హీరోను అందుకోవడానికి హీరోయిన్ పరుగులు– సూపర్‌హిట్ ఫార్ములా!

అందుకే రైలు ఈ దేశ ప్రజల జీవనంలో అవిభాజ్యం. అంతేనా? రైలు ఈ దేశంలో ఎన్నో బరువుల, బాధ్యతల, మమతల, కలతల, కలల వాహిక. గమ్యంపై ప్రయాణికుడు పెట్టుకునే నమ్మకం. 'చేరి ఫోన్ చేస్తారు' అని కుటుంబం పెట్టుకునే భరోసా. బెర్త్‌పై నిశ్చింతగా ముసుగు తన్నే నిద్ర. దానికి దెబ్బ తగిలితే భారతీయుడు విలవిల్లాడతాడు.

'నువ్వు ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటు' అన్నాడు ఆరుద్ర. మృత్యుశకటం లాంటి రైలు కంటే ఎప్పటికీ రాని రైలు మేలైనది అనిపిస్తే ఆ నేరం ఎవరిది?

విలువల్లోనూ పట్టువిడుపులు!

కామెంట్



కరణ్ థాపర్

వాజ్‌పేయిని 'భావోద్వేగాల ఒంటరితనంలో నిరాశ్రయుడైన పురుష బాలకుడి'గా అర్థం చేసుకున్నారు అభిషేక్ చౌధరి. అటల్ సంక్లిష్టమైన వ్యక్తిగత జీవితానికి అది తగిన వివరణ కాగలదా? వాజ్‌పేయిని 'విలువల్లోనూ పట్టువిడుపులు పాటించే మనిషి' అంటారాయన. 2002లో గోవాలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కేంద్ర కేబినెట్ సహచరుల అభీష్టానుసారం ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించలేకపోవడానికి ఈ పట్టువిడుపుల స్వభావం నుంచే మనం సమాధానాన్ని రాబట్టుకోవాలా? 'మహాత్ముడి మరణాన్ని అటల్ అస్సలేమాత్రం మానవాళికి సంభవించిన తీవ్రమైన నష్టంగా పరిగణించనే లేదు' అని చౌధరి రాశారు. అయితే యౌవనానంతర దశలో పరిణతి కలిగిన నాయకుడిగా తన పూర్వపు ధోరణికి భిన్నంగా అటల్ బిహారీ వాజ్‌పేయి మారిపోయారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి గురించి మనకు తెలుసనే అనుకుంటాం. నిజంగానే మనకు తెలుసా? ఎందరికో ఆయన ఆరాధ్యులు. చాలామందికి ఆయనొక మంచి ప్రధాని కూడా. ఇక ఆయన వాగ్ధాటికైతే మంత్రముగ్ధులు కానివాళ్లెవరు! అయినప్పటికీ, ఆయనేమిటో పూర్తిగా మనకు తెలుసా? వాజ్‌పేయి ఛాయ వెనుక ఉన్న వాజ్‌పేయి గురించి మనకు తెలుసా?


ఇటీవల విడుదలైన వాజ్‌పేయి జీవిత చరిత్రలో మనకు తెలియని, మనం ఊహించని ఎన్నో అంశాలు ఉన్నాయి. అవి మాత్రమే కాదు, ఆయన గురించి కచ్చితమైనవిగా మనం ఇప్పటివరకూ భావిస్తూ వస్తున్న కొన్ని కథనాలకు రుజువులు లేవని ఆ పుస్తకం ద్వారా తెలుస్తుంది. సంప్రదాయబద్ధం కాని వాజ్‌పేయి వ్యక్తిగత జీవితాన్ని కూడా పుస్తకం స్పృశించింది. ఆయనను బాగా ఎరిగిన వాళ్లు సైతం వాజ్‌పేయిలోని ఈ అసంప్రదాయపరత్వాన్ని ఎక్కడా బయట పెట్టలేదు. తాజాగా అభిషేక్ చౌధరి రాసిన 'వాజ్‌పేయి: ది అసెంట్ ఆఫ్ ది హిందూ రైట్ 1924–1977' అనే పుస్తకంలోని విశేషాలు ఇవన్నీ. రెండు సంపుటాల ప్రయత్నంలోని మొదటి భాగం ఇది. రెండో భాగం డిసెంబరులో రానుంది.

వాజ్‌పేయి ఆహార ప్రియులనీ, విలాసజీవుడనీ మనం విన్నాం. 'భంగ్ ఆయనకు ప్రీతికరమైనది. తగు మోతాదుల్లో సేవించేవారు'. 'చైనా వంటల్ని అదే తన జీవితేచ్ఛ అన్నట్లుగా ఆరగించేవారు'. న్యూయార్క్‌లో ఉన్నప్పుడు రాత్రి క్లబ్బులు ఆయన్ని రంజింపజేశాయి. ఆ అనధికార సందర్శనలలో ఒకటీ అరా పెగ్గులు మనసారా గ్రోలేవారు.

చౌధరి అనడం అటల్ తన యౌవనంలో ముస్లిం వ్యతిరేకి అని. 'జీవిక కోసం భారతదేశాన్ని ఎంపిక చేసుకున్న ముస్లింలను దేశ ద్రోహులుగానే చూడాలని అటల్ వాదించేవారు' అని రాశారు. అటల్ 'రాష్ట్రధర్మ' పత్రికకు రాసిన ఒక వ్యాసంలో ముస్లింలను 'ఫిఫ్త్ కాలమిస్టులు' (ఆశ్రయమిచ్చిన దేశంలో ఉంటూనే ఆ దేశానికి వ్యతిరేకంగా పోరాడేవారు) అని పేర్కొన్నారు. యౌవనానంతర దశలో మాత్రం తన పూర్వపు ధోరణికి పూర్తి భిన్నంగా ఆయన మారిపోయారు. అది నిజం. ఆ మార్పు ఎంత గొప్పదో చెప్పే వెల్లడింపులు కొన్ని ఈ పుస్తకంలో ఉన్నాయి.

మహాత్మా గాంధీ పట్ల వాజ్‌పేయి వైఖరిని గురించి చెబుతూ, 'మహాత్ముడి మరణాన్ని అటల్ అస్సలు ఏమాత్రం మానవాళికి





సంభవించిన తీవ్రమైన నష్టంగా పరిగణించనే లేదు. అటల్ రాసిన అనేక వ్యాసాలు దేశ విభజనకు కారకుడిగా మహాత్ముడినే బాధ్యుడిని చేశాయి. నీతి కాని రీతిలో ముస్లింలను గాంధీజీ సంతృప్తిపరిచే ప్రయత్నం చేయడం అన్నది ఆయన్ని హత్య చేసేంతగా పర్యవసాన పరిణామాలను విషతుల్యం చేసిందని అటల్ విమర్శించారు' అని అభిషేక్ రాశారు. ఇదేమైనా నిందను సంకేతిస్తోందా? కావచ్చు.

వాజ్‌పేయి గురించి బాగా ప్రచారంలో ఉన్న కొన్ని కథనాల్లో అసలు నిజమే లేదనీ, అవి కేవలం అపోహలేననీ ఈ పుస్తకం తేల్చేస్తుంది. 1971 భారత్–పాక్ యుద్ధంలో పాకిస్తాన్ ఓడిపోయిన డిసెంబర్ 16వ తేదీ నాడు ఇందిరాగాంధీని దుర్గాశక్తిగా అటల్ కీర్తించారని ఒక కథనం. అయితే అది నిజం కాదని, 'ఆ సాయంత్రం అటల్ పార్లమెంటులోనే లేరు. అప్పుడు ఆయన ఏదైనా ప్రయాణంలో గానీ, లేదా స్వల్ప అస్వస్థతతో గానీ ఉండి ఉండాలి' అని అభిషేక్ రాశారు.

అలాగే, అటల్ గురించి నెహ్రూ గొప్పగా భావించేవారనీ, ఆయనను భావి భారత ప్రధానిగా గుర్తించేవారనీ ఒక ప్రచారం ఉంది. అది అబద్ధం కాదు. అయితే మునుపు మనకు తెలియని విషయం ఒకటి కూడా ఈ పుస్తకంలో ఉంది. తొలినాళ్లలో అటల్‌పై నెహ్రూ అభిప్రాయం ఇంకోలా ఉండేదని! మొదట్లో ఆయన వాజ్‌పేయిని 'అత్యంత అభ్యంతరకరమైన వ్యక్తి'గా భావించారు. 'జమ్మూలో మితిమీరిన తెంపరితనాన్ని ప్రేరేపిస్తున్నాడు', 'అతడిని జమ్మూలోకి అడుగుపెట్టనివ్వకండి' అని నెహ్రూ తన క్యాబినెట్ కార్యదర్శి విష్ణు సహాయ్‌ని కోరినట్లు ఈ పుస్తకం చెబుతోంది.

స్వాతంత్ర్యోద్యమంలో వాజ్‌పేయి పాత్ర లేదన్న కాంగ్రెస్ వాదనను కూడా రచయిత కొట్టిపారేశారు. 'గ్వాలియర్‌లో జరిగిన క్విట్ ఇండియా నిరసనల్లో వాజ్‌పేయి పాల్గొన్నారన్నది నిజం'. మరీ ముఖ్యంగా, బ్రిటిష్ వారికి అటల్ సమాచారం చేరవేస్తుండేవాడు అని 'బ్లిట్జ్' పత్రిక కలిగించిన ప్రేరేపణ పచ్చి అబద్ధం.'

మిమ్మల్ని ఆశ్చర్యపరచగల మరికొన్ని ముఖ్యమైన వివరాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. బాల్యంలో వాజ్‌పేయి పేద విద్యార్థి. స్కూల్లో చాలా అరుదుగా మాత్రమే ఆయనలోని ప్రతిభ బయటపడేది. 'పాంచజన్య' పత్రిక మాత్రం ఆయన్ని ఆకాశానికెత్తింది. అటల్ ఎప్పుడూ తరగతిలో రెండో స్థానంలో నిలవలేదని రాసింది. ఆయనకు ఎల్‌ఎల్‌బి డిగ్రీ ఉందన్న మాటలో కూడా నిజం లేదు. నిజానికి, 'అటల్ లా డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేశారు.'

శ్రోతల్ని కట్టిపడేసే వక్తగా ప్రసిద్ధి చెందిన మనిషి, తన తొట్టతొలి స్కూల్ డిబేట్‌లో ఘోరంగా ఓడిపోయాడని తెలుసుకోవడం నన్ను ఆహ్లాదపరిచింది. 'అతడి కాళ్లు చల్లబడ్డాయి. తడబడటం మొదలు పెట్టాడు. ప్రసంగ పాఠం మర్చిపోయాడు. అదొక అవమానకరమైన అనుభవం. సాటి విద్యార్థుల ఆనాటి వెక్కిరింతల్ని జీవితాంతం ఆయన గుర్తుచేసుకుంటూనే ఉన్నారు'.

వాజ్‌పేయిని 'భావోద్వేగాల ఒంటరితనంలో నిరాశ్రయుడైన పురుష బాలకుడి'గా అర్థం చేసుకున్నారు పుస్తక రచయిత. అటల్ సంక్లిష్టమైన వ్యక్తిగత జీవితానికి అది తగిన వివరణ కాగలదా? వాజ్‌పేయిని 'విలువల్లోనూ పట్టువిడుపులు పాటించే మనిషి' అంటారాయన. 2002లో గోవాలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో కేంద్ర కేబినెట్ సహచరుల అభీష్టానుసారం ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించలేకపోవడానికి ఈ పట్టువిడుపుల స్వభావం నుంచే మనం సమాధానాన్ని రాబట్టుకోవాలా?

రెండవ సంపుటి కూడా మొదటి సంపుటం మాదిరిగానే అనేక విశేషాలతో కూడి ఉన్నట్లయితే 1977–2004 మధ్య వాజ్‌పేయి గురించిన సత్యాలను తెలుసుకోడానికి నేను ఎక్కువ కాలం వేచి ఉండలేను. అది ఉత్తమ భాగం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్నడూ చూడనిది...



నేను 'రైలు ప్రమాదం' జరిగిన ప్రాంతానికి చెందినవాడిని. ఎన్నో మృత శరీరాలను చూశాను. నిజంగా బాధాకరం. భారతదేశం ఎప్పుడూ ఇలాంటి ప్రమాదం చూడలేదు.
– బసంత సాహు, విద్యార్థి

ఎవరు బాధ్యులు?



ఇండియాలో ప్రతిదానికీ రెండు మంత్రిత్వ శాఖలు ఉంటాయి. ఒకటి ప్రారంభోత్సవాల కోసం, ఇంకొకటి నిందలు మోయడం కోసం!
– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

బలమివ్వు దేవా!



హౌరా నుంచి చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుడిగా గాయాలు లేకుండా బయటపడ్డందుకు కృతజ్ఞుడిని. పెంచి చెప్పడం కాదుగానీ నేనే 200–250 చావులకు సాక్షిగా ఉన్నాను. కుటుంబాలు నలిగిపోయి, కాళ్లూ చేతులు లేకుండాపోయి, ట్రెయిన్ ట్రాకుల్లో రక్తం మడుగులు కట్టి... నేను ఎప్పటికీ మరిచిపోలేని దృశ్యం. దేవుడా! ఆ కుటుంబాలను కాపాడు.
– అనుభవ్ దాస్, ప్రయాణికుడు

అదే తర్కంతో...



ఆల్ ఇండియా ముస్లిం లీగ్ ఒక లౌకిక వాద పార్టీ అని తెలుసుకున్న తర్వాత, సౌదీ అరేబియా తనను తాను శాకాహార దేశంగా ప్రకటించుకుంది.
– ఇంతియాజ్ మహమూద్, థింకర్

షో అవసరమా?



ప్రమాద ఘటనా స్థలాలను దర్శించడానికి వీవీఐపీలు వెళ్లినప్పుడు జరిగే అత్యంత చెడు ఏమిటంటే – అది సహాయ కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తుంది. ఈ ఆధునిక కాలంలో వాళ్లు ఎక్కడ ఉన్నా సమాచారాన్ని వెన్వెంటనే తెలుసుకోగలరు. అలాంటప్పుడు వెళ్లి ఒత్తిడి పెంచడం ఎందుకు?
– సుహేల్ సేఠ్, నటుడు

ప్రాణాలు చవక



మూడు రైళ్లు. ఇప్పటికీ మింగుడు పడటం లేదు. మూడు! ఈ దేశంలో మనిషి ప్రాణాలకంటే చవకైనది ఇంకేమీ లేదు. ఆ కుటుంబాల శోకం లెక్కించలేనిది.
– శివ్ ఆరూర్, జర్నలిస్ట్

ఇప్పుడు జరగవనా?



'లొబాటమీ' కనిపెట్టిన వైద్యుడికి నోబెల్ బహుమతి వచ్చింది. వైద్య చరిత్ర అంతా ఇట్లాంటి భారీ తప్పులతో కూడుకొని ఉన్నదే. అయినా మనం అంతా మారిపోయిందని భావిస్తాం లేదా నటిస్తాం. (స్కిజోఫ్రెనియా లాంటి మానసిక అనారోగ్యాలకు ఒకప్పుడు మెదడుకు శస్త్రచికిత్స చేసేవారు; లొబాటమీ అలాంటి ఒక ప్రక్రియ.)
– ఆరన్ ఖేరియాటీ, ఫెలో

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సీమను అద్దంలో చూపిన కథకుడు

సందర్భం



దాసు కృష్ణమూర్తి

నిత్య కలహాలు, కరువుతో పీడించబడుతున్న రాయలసీమ గురించిన అత్యంత సాధికారిక పరిశీలకుడు, వ్యాఖ్యాత అయిన కేతు విశ్వనాథరెడ్డి ఇక లేరు. 82 ఏళ్ల వయసులో మే 21న ఆయన కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఆయన నివసిస్తున్నప్పుడు, తన కుమార్తె కుటుంబంతో గడిపేందుకు తరచుగా అమెరికాకు వచ్చినప్పుడు ఆయనను చాలాసార్లు కలిశాను.

దిద్దిన జవాబు పత్రాల కట్టను అందజేయడానికి 'ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ' హైదరాబాద్ ఆఫీసులో ఆయన్ని నేను మొదటిసారిగా కలిశాను. 'ఇది హైదరాబాద్ ఆఫీస్ పని కాదు' అని నాతో చెపుతున్న కింది స్థాయి ఉద్యోగి వైపు ఆయన మెల్లగా చూశారు. '1947 సంతోషాబాద్ ప్యాసింజర్ అండ్ అదర్ స్టోరీస్' అనే మా మొట్టమొదటి సంకలనంలో 'ది నర్స్' అనే ఆయన కథను ప్రచురించే అదృష్టం నాకు లభించింది. జానకి ఉన్న చోట లేబర్ రూమ్ పరిస్థితిని వివరిస్తూ కథలో వాతావరణాన్ని పరిచయం చేయాలన్న నా సూచనను ఆయన వెంటనే అంగీకరించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. నర్సు ఉన్న చోటికి చేరుకోవడానికి పాత పల్లె ఓబన్న సైకిల్ తొక్కడం కూడా! 'ది హిందూ' (ఫిబ్రవరి 7, 2012) నా వ్యాసాన్ని ప్రచురించింది, అందులో నేను ఆయన్ని సీమకు చెందిన రసవాది (ఆల్కెమిస్ట్) అని పేర్కొన్నాను. నిజానికి ఆయన ఏం రాసినా తెలుగువారందరూ... వారు ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నా (ప్రవాస భారతీయులతో సహా) ఎంతో ఆసక్తిగా చదువుతారు.

ఆయన పాత్రలు నేలతల్లి బిడ్డలు. హద్దూ అదుపూలేని భూబకాసురులు, ప్రపంచీకరణ బేహారులు చూపించే కొత్త కొత్త మార్గాల్లో పయనించి, అమాయకంగా ధనపిశాచి వలలో చిక్కి మనస్సాక్షిని కోల్పోయేంత పతాక స్థాయికి చేరే అమాయకులు వారు. నేను రెడ్డిగారిని చివరిసారిగా హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో కలిశాను. నేను ఇంట్లో రెండు మెట్లు ఎక్కి ఆయన ఉన్న చక్కగా గాలి వీస్తూ ఉన్న విశాలమైన చోటుకు చేరుకోవడం చూసి నేనేదో కష్టపడ్డాననుకుని బాధపడ్డారు.

ఒక అమెరికన్ విద్యావేత్త సంకలనం చేసిన ప్రామాణిక ఇంగ్లీష్–తెలుగు నిఘంటువును ఆయనకు ఇచ్చాను. నేను వెళ్లిపోతున్నప్పుడు, ఆయన భార్య నాకు సీమ మిఠాయిల ప్యాకెట్ ఇచ్చింది. వార్తాపత్రిక అందించే పరిమిత స్థలంలో, రెడ్డిగారి విస్తారమైన రచనలను లోతుగా పరిశోధించడం అసాధ్యం. కాబట్టి, ఆయన్ని జీవితంలో నడిపించిన, కామూసియన్ నిరాశా ఛాయలను పారదోలిన... ఆయన తత్వాన్ని సేకరించడం మాత్రమే సాధ్యపడుతుంది. ఆయన రాసిన అనేక నవలలు, చిన్న కథల సంకలనాలు జీవితపు రంగులను ప్రకాశింపచేస్తాయి. రాయలసీమ, ముఖ్యంగా దాని లోతట్టు ప్రాంతాలే ఆయన క్యాన్వాస్. తాను చనిపోయే ముందు సీమ సమస్యలను, దాని ప్రజలను వెలుగులోకి తీసుకురావడానికి కొత్త తరం యువ రచయితలను ప్రవేశపెట్టారు. ఆయనకు వచ్చిన అనేక అవార్డులలో, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు వంటివి ఉన్నాయి.

వ్యాసకర్త ప్రముఖ పాత్రికేయుడు – సాహితీవేత్త, అమెరికా

ఆయనో సజీవ విశ్వవిద్యాలయం

ప్రముఖ సాహితీవేత్త కేతు విశ్వనాథ రెడ్డి మృతి సాహితీ లోకానికి తీరని లోటు. ఆయన కడప జిల్లాలోని గ్రామ నామవాచకాల నేపథ్యాన్ని విశ్లేషించడం ద్వారా ఆంధ్రుల సామాజిక, సాంస్కృతిక చరిత్ర రచనకు నూతనమైన మలుపు తీసుకువచ్చారు. సురవరం ప్రతాపరెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేవీ రమణారెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి వంటి వారు తెలుగు సాహిత్య రంగంలో కులాతీత భావ చైతన్యాన్ని కలిగించారు. కేతు చాలా సౌమ్యులు. పరిశోధనా దక్షులు. కులేతర, మతేతర భావజాల సంపూర్ణులు. ఇటీవల కడప నుండి నాతో ఫోన్లో మాట్లాడారు. 'మీ రచనలు, కవితలు, పోరాటాలు ఎప్పుడూ నన్ను ఉత్తేజపరుస్తుంటాయి. మీరు ఈ తరానికి స్ఫూర్తి' అని అన్నారు. నాకు ఎంతో సంతోషం వేసింది. సామాజిక శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంలో ఆయనకు ఏ విధమైన శషభిషలూ లేవు.



కేతు విశ్వనాథరెడ్డి (1939–2023)

ఆయన కొడవటిగంటి కుటుంబరావు రచనలను సంపుటాలుగా వెలువరించడం ద్వారా ఒక పెద్ద సాహితీ నిధిని తెలుగువారికి అందించినట్లు అయ్యింది. కేతు కథల్లో రాయలసీమ అస్తిత్వం ఉంటుంది. ఒక రెడ్డి కులంలో పుట్టి, రెడ్డి ఫ్యాక్షనిజం నేపథ్యాన్ని చెప్పగలిగిన ధైర్యం గలవారు ఆయన. వారి కథల్లో రెడ్డి, భూస్వామ్య ఆధిపత్యాన్ని దళిత పాత్రలు నిలేస్తాయి. అది ఆయన కుల, వర్గ ఆధిపత్య దోపిడీ వ్యతిరేక భావనకు నిదర్శనం. 'వైఎస్సార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు'ను ఆయనతో పాటూ నేనూ తీసుకోవడం నాకు ఒక మధురానుభూతి. కేతు కేవలం సాహితీవేత్తే కాదు. సమాజం పట్ల బాధ్యత కల పోరుడు. గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథం గల అభ్యుదయ రచయిత. 'అరసం' అధ్యక్షులుగానూ పనిచేశారు.

భూస్వామ్య కులాలవారు దళితుల్ని అమానుషంగా వేధించారని ఆయన స్పష్టంగా చెప్పారు. దళితులు కూలీలుగానే బతకాలనీ, వాళ్ళ పిల్లలు చదువుకోకూడదనే దుష్టనీతి కొందరు భూస్వామ్య కులాల వారికి ఉందని గమనించారు. భూస్వామ్య కులాలు భూములు ఆక్రమించడంలో సాయుధులయ్యారనీ, ఫ్యాక్షనిజాన్ని ఆశ్రయించారనీ, ఆస్తి కోసం, అధికారం కోసం అడ్డువచ్చిన వారిని ఎవరినైనా నిర్దాక్షిణ్యంగా హతమార్చడానికి కూడా వెనకాడలేదనీ తన నవలల్లో, కథల్లో దృశ్యీకృతంగా చెప్పారు.

రాయలసీమ జిల్లాలో పాత రాతియుగం (పాలియోలితిక్ ఏజ్), కొత్త రాతి యుగం (నియోలితిక్ ఏజ్)ల నుంచీ ఉత్పత్తి శక్తులుగా దళితులే ఉన్నారు. భూస్వామ్య కులాల వారు అక్కడకు వివిధ కాలాలలో వలస వచ్చినవారే. వీరు భూ పాలెగాళ్లు. వీరిది సామంత గుణం. దళితులది ఇండిపెండెంట్ నేచర్. వారు స్థానికులు. వారు ఉత్పత్తి పరికరాల్ని ఉత్పత్తికే వాడతారు గాని హత్యలకు వాడరు. ఈ విషయాలను అనేక చారిత్రక కథనాలు తెలియజేస్తాయి. ఈ చారిత్రక నేపథ్యం రాయలసీమ రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ అవగాహన ఉన్నవారు కాబట్టే కేతు రాయలసీమ జీవనాన్ని అద్భుతంగా చిత్రించగలిగారు.

కేతుది కరుణ హృదయం. ఆయన కన్నీటిని అక్షరాల్లో పొదుగుతారు. 'ఏకో రసః కరుణ ఏవ' అన్నారు. దుఃఖాన్ని చెప్పని వాడు కథకుడు కాదు. కవి కాదు. కళాకారుడు కాదు. కడప రచయితల్లో శాంతి నారాయణ కుల అణచివేతను దృశ్యీకరింపజేసిన గొప్ప బహుజన నవలాకారుడు. ఆయన కేతు విశ్వనాథ రెడ్డికి సహచరుడు. ఆయనతోపాటు చాలామంది కేతు విశ్వనాథ రెడ్డిని పెద్దదిక్కుగా భావిస్తారు.

ఈ యుగ సాహితీ నిర్మాతల్లో కేతు ఒకరు. ఆయన పుస్తకాలన్నీ సంకలనాలుగా ముద్రించి సమాజానికి అందించడం ద్వారా సాంస్కృతిక విప్లవాన్ని కొనసాగించాలి. ఆయన సాహితీ విమర్శలో డైలెక్టికల్ నేచర్ ఉంటుంది. ఆయన కథల్లో, నవలల్లో, విశ్లేషణలో హెగెల్ డైలెక్టిక్స్‌ను చూడవచ్చు. హెగెల్ గతితర్కాన్ని ఫ్యూర్బా భౌతిక వాదంతో కార్ల్ మార్క్స్ సమన్వయీకరించారు. కార్ల్ ఫోర్త్ గతితార్కిక భౌతికవాదాన్ని సామాజిక దృక్కోణం నుంచి విశ్లేషించారు. మావో డైలెక్టికల్ మెటీరియలిజాన్ని ఆధారం చేసుకుని 'వైరుధ్యాలు' అనే గ్రంథం రాశారు. భారతదేశంలో తాత్విక భావజాల రంగంలో సామాజిక తత్వ సమన్వయం లోపించింది. కేతు విశ్వనాథ రెడ్డి రచనలలో మనకు ఈ సామాజిక అన్వయం కనిపిస్తుంది. నిజానికి ఒకనాడు రాయలసీమ మొత్తంగా బౌద్ధ సంస్కృతి ఉంది. ఆ తర్వాత వీరశైవ, వీర వైష్ణవ ఉద్యమాలతో అది సన్నగిల్లింది. ఆ తర్వాత వచ్చిన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా ఇక్కడ సామాజిక భావజాల అన్వయం ఉంది. భూస్వామ్య పెత్తందారీ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇక్కడ ఎక్కువమంది తిరుగుబాటుదారు లయ్యారు. తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య – వీరందరూ భూస్వామ్య కుల పెత్తందారీ సమాజం నుంచి వచ్చినవారే. అయితే వీళ్లు ఆ సమాజంతోనూ, కుటుంబాలతోనూ పోరాడారు. ఈ మొత్తం పోరాట ప్రభావం ఆ తర్వాత వచ్చిన రచయితల మీద ఉంది.

సందర్భం



డాక్టర్ కత్తి పద్మారావు

కేతు ఒక విశ్వవిద్యాలయం. విశ్వజనీయమైన భావన సృష్టికర్త. ఆయన పేరును రాయలసీమలోని ఏదో ఒక విశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితం. నిజానికి రాజమండ్రిని నన్నయ కంటే కుసుమ ధర్మన్న ఎక్కువ ప్రభావితం చేశారు. శ్రీకాకుళాన్ని ఇతర రచయితల కంటే వంగపండు ప్రసాదరావు ఎక్కువ ప్రభావితం చేశారు. తెలంగాణను గూడ అంజయ్య ప్రభావితం చేసినంతగా మరెవరూ ప్రభావితం చేయలేదు. తమిళనాడులో, బెంగాల్లో ఇటువంటి వారి పేర్లతో విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అయితే తెలుగు అకాడెమీకి బ్రాంచ్‌గా 'రాయలసీమ భాషా సాంస్కృతిక అకాడెమీ'ని కూడా పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కేతు ఊర్ల పేరు మీద చేసిన విశ్లేషణలో భాషా శాస్త్ర, మానవ పరిణామశాస్త్ర, పురాతత్వశాస్త్ర చారిత్రక మూలాలు ఉన్నాయి. దానికి కొనసాగింపు పరిశోధన జరగలేదు. అందుకు ఇటువంటి అకాడెమీ పెట్టాల్సి ఉంది.

అలాగే కేతు విశ్వనాథ రెడ్డి పేరు రాయలసీమ జిల్లాల్లో ఒక జిల్లాకు పెట్టవలసిన చారిత్రక అవసరం ఉంది. చరిత్రను సృష్టించిన వాడు ఆకాశ నక్షత్రాల్లో పొదగబడిన కీర్తిమంతుడు. వారి మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త సామాజిక ఉద్యమకర్త, సాహితీ విమర్శకులు
మొబైల్: 98497 41695

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.7.36 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మూల రా.3.32 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.17 నుండి 1.49 వరకు, తిరిగి రా.1.58 నుండి 3.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.20 వరకు, తిరిగి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** రా.9.15 నుండి 10.45 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

క్లుప్తంగా...

జమ్మూలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ ప్రారంభం



పంచగవ్యప్రాశన నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): జమ్మూలోని మజీన్ గ్రామంలో తావి నది ఒడ్డున టీటీడీ నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పుణ్యాహవాచనం, పాలు, పెరుగు, నెయ్యి, గోమూత్రం, గోమయంతో పంచగవ్య ప్రాశన చేశారు. తర్వాత యాగశాలలో ఏర్పాటు చేసిన 18 హోమ గుండాల్లో వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షా బంధనం నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ట, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు, కంకణభట్టార్ రామకృష్ణ దీక్షితులు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు



స్నపన తిరుమంజనంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు ఉభయ దేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో పునఃదర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఉదయం శ్రీమలయప్ప స్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తర్వాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 85,366 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది.

లంబసింగికి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ప్రభాత్‌కుమార్ సింగ్ దంపతులకు స్వాగతం పలుకుతున్న జడ్జి శ్రీనివాస్

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రముఖ పర్యాటక ప్రాంతం లంబసింగికి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రభాత్ కుమార్ సింగ్, సిమసింగ్ దంపతులు ఆదివారం వచ్చారు. లంబసింగి టూరిజం రిసార్ట్‌కు చేరుకున్న వీరికి చింతపల్లి ప్రథమశ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. మూడు రోజుల పాటు చింతపల్లి, అరకులోయ, అనంతగిరి మండలాల్లోని పర్యాటక ప్రాంతాల్లో వారి పర్యటనకు అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం నుంచి లంబసింగి ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో పర్యాటక ప్రాంతాల సందర్శనను వారు రద్దు చేసుకున్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి ఘన నివాళి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న అభిమానులు

తిరువళ్లూరు: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తామరపాక్కంలోని ఆయన సమాధి వద్ద ఆదివారం ఎస్పీబీ సతీమణి సావిత్రి, కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఎస్పీబీ సమాధిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొందరు అభిమానులు కాలినడకన చెన్నై నుంచి తామరపాక్కం చేరుకోవడం గమనార్హం. కాగా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుమారుడు చరణ్ విదేశాల్లో ఉండడంతో ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.

విద్యార్థుల కోసం
మరో 6 లక్షల ట్యాబ్‌లు

ఉపాధ్యాయులందరికీ ట్యాబ్‌లు ఇచ్చే యోచన

- ట్యాబ్‌ల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగం
- కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతిక సమస్యలు 3 రోజుల్లో పరిష్కారం
- ట్యాంపరింగ్ చేస్తే ఐటీ సెల్‌కు అలర్ట్



సాక్షి, అమరావతి: కొత్త విద్యా సంవత్సరం (2023–24)లో 8వ తరగతిలోకి వచ్చే విద్యార్థుల కోసం కొత్తగా 6 లక్షల ట్యాబ్‌లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులందరికీ ట్యాబ్‌లు ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో 8వ తరగతి విద్యార్థులతోపాటు సుమారు 75 వేల మంది ఉపాధ్యాయులకు 5,18,740 ట్యాబ్‌లను ఉచితంగా అందించింది. 8, 9 తరగతుల విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాలకు సంబంధించి సుమారు రూ.25 వేల ఖరీదు చేసే బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందించింది.

సమస్య వస్తే మూడు రోజుల్లో పరిష్కారం

గత ఏడాది విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగాన్ని అందుబాటులోకి తెచ్చింది. ట్యాబ్‌లలో తలెత్తే సాంకేతిక సమస్యలను గరిష్టంగా మూడు రోజుల్లో పరిష్కరించేలా ఏర్పాట్లు చేసింది. ట్యాబ్‌ల వినియోగంలో తలెత్తే సాఫ్ట్‌వేర్ సమస్యలు పరిష్కరించేలా ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది. అయితే, హార్డ్‌వేర్ సమస్యలు వస్తే ట్యాబ్‌లను స్థానిక వార్డు, గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రులు ట్యాబ్‌ను డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేసి సమస్యను వివరిస్తే ఫోన్ నంబర్, ట్యాబ్ ఈఎంఐఈ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అయితే, వివరాల నమోదు, ఆన్‌లైన్‌లో ఉండటంతో చదువుకోలేని తల్లిదండ్రులు రసీదులు పొందడంలో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారికోసం మాన్యువల్‌గా రశీదులు ఇవ్వనున్నారు. మరమ్మతుకు గురైన ట్యాబ్‌లను రాష్ట్రంలోని 145 శాంసంగ్ సర్వీస్ సెంటర్లలో గరిష్టంగా 3 రోజుల్లో మరమ్మతు చేయించి అందించనున్నారు.

ట్యాంపర్ చేస్తే ఐటీ సెల్‌కు అలర్ట్

ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ప్రత్యేకంగా రూపొందించింది. ఈ ట్యాబ్‌ల్లో కంటెంట్ ఇంటర్నెట్ లేకుండానే వినియోగించుకోవచ్చు. సబ్జెక్టుల వారీగా ఉన్న పాఠ్యాంశాలను విద్యార్థి ఎన్ని గంటలు చూశారు, ఏ సబ్జెక్టు కోసం ఎక్కువ సమయం కేటాయించారో అందులో నమోదవుతుంది. ట్యాబ్స్‌ను నెట్(వైఫై)కు అనుసంధానం చేయగానే మొత్తం వివరాలు స్టేట్ ఐటీ సెల్‌కు చేరుతాయి. విద్యార్థులు ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు విశాఖపట్నంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం గురువారం అందుబాటులోకి తెచ్చింది. ఇక్కడ ఉన్న సిబ్బంది ప్రతి విద్యార్థికి ఇచ్చిన ట్యాబ్‌ను ఎలా వాడుతున్నారో గుర్తిస్తారు. మరోవైపు ట్యాబ్‌లను ట్యాంపరింగ్ చేసే వీలు లేకుండా సాంకేతికపరంగా కట్టడి చేశారు. విద్యార్థికి ఇచ్చిన ట్యాబ్‌లోని కంటెంట్ తొలగించేందుకు యత్నించినా, కొత్తగా మార్పులు చేసినా ఆటోమేటిక్‌గా ట్యాబ్ లాక్ అయిపోతుంది. వెంటనే ఏ జిల్లాలో, ఏ పాఠశాలలోని విద్యార్థి ఈ పని చేశారో ఐడీ నంబర్‌తో సహా ఇబ్రహీంపట్నంలోని స్టేట్ ఐటీ సెల్‌కు, విశాఖలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆ వివరాలు వెళ్లిపోతాయి. అనంతరం కారణం తెలుసుకుని, మొబైల్ డివైజ్ మేనేజ్‌మెంట్ (ఎండీఎం) సిస్టంతో పాటు గూగుల్ అథెంటికేషన్ ఓటీపీ ద్వారా జిల్లా నోడల్ అధికారి అన్‌లాక్ చేస్తారు.

స్వదేశీ అబ్బాయి.. విదేశీ అమ్మాయి

- హిందూ సంప్రదాయంలో ఒక్కటైన వధూవరులు



వధూవరులతో సంప్రదాయ వస్త్రధారణతో ఇరు కుటుంబాల సభ్యులు

తెనాలి: ఆస్ట్రేలియా అమ్మాయి..తెనాలి అబ్బాయి ప్రేమించుకుని హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఈ సంఘటన గుంటూరు జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. కొల్లిపరకు చెందిన ఇంద్రసేనారెడ్డి ఎంఎస్ చేయడానికి ఆస్ట్రేలియా వెళ్లారు. చదువు పూర్తయ్యాక ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆ దేశ పౌరసత్వమూ లభించింది. తన కంపెనీలోనే పనిచేస్తోన్న ఆస్ట్రేలియా యువతి సారా ఎలిజబెత్ కొల్టర్‌ను ప్రేమించాడు. యువతి కూడా ప్రేమను అంగీకరించడంతో ఈ విషయాన్ని ఇరువురూ వారి కుటుంబాలకు చెప్పారు. హిందూ సంప్రదాయాన్ని పరిచయం చేయాలన్న ఉద్దేశంతో కొల్లిపరలో సంప్రదాయ వివాహానికి ఇంద్రసేనారెడ్డి చేసిన ప్రతిపాదనకు ఎలిజబెత్ సమ్మతించారు. దీంతో ఇంద్రసేనారెడ్డి తల్లిదండ్రులు కూసం శ్రీనివాసరెడ్డి, పద్మజ, బంధుమిత్రుల సమక్షంలో కొల్లిపరలోని జీవీఆర్ కళ్యాణమండపంలో శనివారం వైభవంగా వివాహం జరిగింది. కుమార్తె పెళ్లికి ఎలిజబెత్ తల్లిదండ్రులు జాన్ కొల్టర్, అన్నెట్టీ దంపతులు, సోదరి, సోదరుడు, అతడి భార్య హాజరయ్యారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో పురుషులు షర్టు, పట్టు పంచెలు, మహిళలు చీరె, జాకెట్ ధరించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఈ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నకిలీల్లో రూ.500 నోట్లే ఎక్కువ

- రెండో స్థానం రూ.100 నోట్లదే
- గత ఏడాది దేశంలో 2.25 లక్షల నకిలీ నోట్ల గుర్తింపు
- ఆర్‌బీఐ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక విలువ కలిగిన రూ.2 వేల నోటు కంటే.. రూ.500 నోట్లే అత్యధికంగా నకిలీవి చలామణి అవుతున్నాయని ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. రూ.200 నోట్ల కంటే కూడా రూ.100 నకిలీ నోట్లే ఎక్కువ మార్కెట్‌లోకి ప్రవేశించాయని తెలిపింది. ఆర్‌బీఐ తాజాగా ఉపసంహరించిన రూ.2 వేల నోట్లు నకిలీ నోట్లలో 5వ స్థానంలో ఉన్నాయి. 2022–23లో దేశంలో నకిలీ నోట్లపై ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు గుర్తించే నకిలీ నోట్లపై ఆర్‌బీఐ ఏటా నివేదిక విడుదల చేస్తుంది. జాతీయ బ్యాంకులు, ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తాము గుర్తించిన నకిలీ నోట్లను ఆర్‌బీఐకి పంపిస్తాయి. ఆ విధంగా గుర్తించిన నోట్ల గణాంకాలను ఆర్‌బీఐ ఏటా విడుదల చేస్తుంది.

నోట్ల ముద్రణకు రూ.4,682.80 కోట్లు

ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. 2022–23లో కరెన్సీ నోట్ల ముద్రణ కోసం (సెక్యూరిటీ ప్రింటింగ్) ఆర్‌బీఐ రూ.4,682.80కోట్లు వెచ్చించింది.

➤ దేశవ్యాప్తంగా 2022–23లో మొత్తం 2,25,769 నకిలీ నోట్లను గుర్తించారు. వాటిలో 4.6 శాతం నోట్లను ఆర్‌బీఐ నేరుగా గుర్తించగా.. 95.4 శాతం నోట్లను దేశంలోని వివిధ బ్యాంకులు గుర్తించాయి.

➤ 2021–22తో పోలిస్తే 2022–23లో దేశంలో గుర్తించిన నకిలీ నోట్లు 5,202 తగ్గాయి. 2021–22లో దేశంలో 2,30,971 నకిలీ నోట్లను గుర్తించారు.

➤ గత ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన నకిలీ నోట్లలో రూ.500 నోట్లు మొదటి స్థానంలో ఉన్నాయి. 91,110 నకిలీ రూ.500 నోట్లను గుర్తించారు. 2021–22 కంటే నకిలీ రూ.500 నోట్లు 14 శాతం పెరిగాయి.

➤ నకిలీ నోట్లలో రూ.100 నోట్లు రెండో స్థానంలో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 78,699 నకిలీ రూ.100 నోట్లను గుర్తించారు.

➤ రూ.200 నకిలీ నోట్లు మూడో స్థానంలో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 27,258 నకిలీ రూ.200 నోట్లను గుర్తించారు.

➤ నాలుగో స్థానంలో రూ.50 నోట్లు ఉన్నాయి. 2022–23లో 17,755 నకిలీ రూ.50 నోట్లను గుర్తించారు.

➤ దేశంలో ఎక్కువ విలువైన రూ.2 వేల నోట్లు నకిలీ నోట్లలో 5వ స్థానంలో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 9,806 నకిలీ రూ.2 వేల నోట్లను గుర్తించారు.

➤ గుర్తించిన మిగిలిన నకిలీ నోట్లలో రూ.2, రూ.5 నోట్లతో పాటు రూ.500, రూ.1,000 విలువ గల స్పెసిఫైడ్ బ్యాంక్ నోట్లు (2016కు ముందు చలామణిలో ఉన్న నోట్లకు నకిలీవి) ఉన్నాయి.

ఆర్గానిక్ మహోత్సవ్ అదిరింది

- రైతు సాధికార సంస్థతో రూ.140 కోట్లకు పైగా ఎంవోయూలు
- సింగపూర్‌తో పాటు భారత్ నలుమూలల నుంచి ప్రతినిధుల రాక
- ఆకట్టుకున్న సేంద్రియ ఉత్పత్తుల స్టాల్స్
- ఆర్గానిక్ ఫుడ్ కోర్టు ఏర్పాటుతో ఫిదా
- మూడు రోజుల్లో 22 వేల మందికి పైగా సందర్శన
- తొలిసారి నిర్వహించినా విశేష ఆదరణ
- ఫలించిన వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ కృషి



ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్గానిక్ మహోత్సవ్‌లో రూ.140 కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదిరాయి. ఈ నెల 2వ తేదీ నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా ఈ భారీ మేళాను నిర్వహించాయి. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, వినియోగదారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో రాష్ట్రంలో తొలిసారిగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ మేళాలో సేంద్రియ విధానంలో పండించిన వరి, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, బెల్లం, మామిడి పండ్లు, తేనె తదితర సేంద్రియ సహజ ఉత్పత్తులను 123 స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. ప్రత్యేకంగా ఒక ఆర్గానిక్ ఫుడ్ కోర్టును కూడా ఏర్పాటు చేశారు. సందర్శకులు వివిధ సేంద్రియ వంటకాలను ఆరగించి సంతృప్తి చెందారు.

బహుళజాతి సంస్థల ప్రతినిధులు రాక

దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు సింగపూర్ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు ప్రతినిధులు, చిరుధాన్యాల ఉత్పత్తి, సాగుదారులు, కొనుగోలుదారులు భారీగా హాజరయ్యారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ మేళాకు మూడు రోజుల్లో 22 వేల మందికి పైగా సందర్శకులు వచ్చారు. 12కు పైగా సంస్థలు రైతుల తరఫున రైతు సాధికార సంస్థతో అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. వీటిలో బెంగళూరుకు చెందిన ఫలద ఆగ్రో ప్యూర్ అండ్ ష్యూర్ సంస్థ రూ.90 కోట్లు, సాగ్లిష్ హార్వెస్ట్ రూ.10 కోట్లు, సింగపూర్‌కు చెందిన జీఎస్ ఆర్గానిక్ రూ.10 కోట్లతో పాటు ఈ–మిల్లెట్స్, స్వచ్ఛ మిల్లెట్స్, బిగ్ బాస్కెట్, గాట్ కాటన్ తదితర సంస్థలు వెరసి రూ.140 కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు చేసుకున్నాయి. ప్రకృతి వ్యవసాయ రైతులతో ప్రతినెలా ఉత్పత్తుల కొనుగోలుకు ముందుకొచ్చాయి. జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండాలంటే జీవన విధానం మార్చాలనే ఇతివృత్తంతో సేంద్రియ పంటలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆర్గానిక్ మహోత్సవ్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆర్గానిక్ మేళాకు హాజరైన ఆయా సంస్థల ప్రతినిధులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారని రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ ప్రభాకర్ 'సాక్షి'కి తెలిపారు.

ఘాట్ రోడ్డు ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళిక

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల భద్రత కోసం ఘాట్ రోడ్డు ప్రయాణంలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేశామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఆదివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల ఘాట్‌రోడ్లలో ఇటీవల డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాల కండీషన్ బాగా లేకపోవడంతో కొన్ని ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాల నివారణకు జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందిస్తున్నాయని తెలిపారు. సుందర తిరుమల– శుద్ధ తిరుమల కార్యక్రమంలో భాగంగా 15,441 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 13,351 మంది కార్పొరేషన్ సిబ్బంది, ఆరు వేల మందికి పైగా శ్రీవారి సేవకులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టరేట్, పోలీస్, న్యాయశాఖ అధికారులు తిరుమలలో పారిశుద్ధ్య విధుల్లో పాల్గొన్నారని వివరించారు. మహారాష్ట్రంలోని నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి జూన్ 7న భూమి పూజ చేయనున్నామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

- కార్డుల జారీ కోసం ఆర్బీకే స్థాయిలో స్పెషల్ డ్రైవ్‌లు
- జగనన్న పాలవెల్లువ, జీవక్రాంతి లబ్ధిదారులకు ఇవ్వాలని లక్ష్యం
- పాడిసంరక్షణ, నిర్వహణ కోసం హామీలేని రుణాలు
- గరిష్టంగా రూ.1.60 లక్షల వరకు రుణాలిస్తున్న బ్యాంకులు
- ఇప్పటికే ఆక్వారైతులు, మత్స్యకారులకు కేసీసీ రుణాలు



సాక్షి, అమరావతి: కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ)ల ద్వారా పాడిరైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆక్వారైతులు, మత్స్యకారులకు కేసీసీల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నారు. అదేబాటలో పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడిరైతులకు పాడిసంరక్షణ, నిర్వహణ కోసం హామీలేకుండా గరిష్టంగా రూ.1.60 లక్షల వరకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలివ్వాలని సంకల్పించారు. కార్డుల జారీకోసం ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో స్పెషల్ డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టారు.

ఇప్పటికే 45,652 మందికి పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

పశుకిసాన్ క్రెడిట్ కార్డుల కోసం మత్స్యకారులు, ఆక్వారైతుల తరహాలోనే పాడిరైతులు స్థానిక ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలి. వ్యక్తిగతంగానే కాకుండా గ్రూపులుగా ఏర్పడినా కార్డులు జారీచేస్తారు. ఇందుకోసం మే 1వ తేదీ నుంచి ఆర్బీకే స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ డ్రైవ్‌లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు చేసే పాడిరైతులు ఎంతకాలం నుంచి పశుపోషణ చేస్తున్నారు. ఎంత పాడి ఉంది. ఎంత పాల ఉత్పత్తి చేస్తున్నారు వంటి వివరాలను పశువైద్యాధికారితో ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 45,652 మందికి పశుకిసాన్ క్రెడిట్ కార్డులు జారీచేశారు. వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా పొందిన లబ్ధితో పాడిపశువులు, సన్నజీవాలు కొనుగోలు చేసిన ప్రతి పాడిరైతుకు పశుకిసాన్ క్రెడిక్ కార్డు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. నాలుగేళ్లలో 2.67 లక్షల మంది పాడిరైతులకు జగనన్న పాలవెల్లువ, జగనన్న జీవక్రాంతి పథకాల కింద మూగ, సన్నజీవాలను అందించారు. వీరందరికి ఈ కార్డులు జారీ చేయాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నారు.

షెడ్లు, మంచినీటి తొట్టెల నిర్మాణం

ఈ కార్డు ఆధారంగా ఎలాంటి హామీలేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం ఇస్తారు. పశువులు, సన్నజీవాలకు షెడ్లు, మంచినీటి తొట్టెల నిర్మాణం, తాళ్లు, ఇతర సామగ్రితో పాటు పశుగ్రాసం కొనుగోలుకు ఈ రుణాలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ రుణాలను కొత్త పశువుల కొనుగోలుకు ఉపయోగించకూడదు. కార్డు పొందే పాడిరైతుకు బీమా సదుపాయం కూడా ఉంటుంది. నాలుగేళ్లలో మత్స్యకారులు, ఆక్వారైతులకు 20 వేల కార్డులు జారీచేయగా, రూ.2,800 కోట్ల రుణ పరపతి కల్పించారు. ప్రతి సీజన్‌లో ఆక్వారైతులకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారు. ఈ రుణంలో మొదటి రూ.రెండు లక్షలను కేసీసీ రుణంగా పరిగణిస్తారు. కార్డుల జారీ, రుణపరపతి కోసం ప్రత్యేకంగా ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ (ఆటోమేషన్)ను కూడా అభివృద్ధి చేశారు. జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు కేసీసీల జారీ, రుణాల మంజూరు వివరాలను ఆర్బీకేల్లోని పశుసంవర్ధక సహాయకుల ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ డ్రైవ్ వచ్చే మార్చి నెలాఖరు వరకు కొనసాగనుంది.

రాష్ట్రాన్ని దోచుకున్న బాబును అరెస్ట్ చేయాలి

- 980వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ నాయకులు



రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన మాజీ సీఎం చంద్రబాబును అరెస్ట్ చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 980వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ రాజధాని పేరుతో ఈ ప్రాంతంలో రైతులు, బహుజనులను దోచుకున్న చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడమనేది కలగానే మిగిలిపోతుందన్నారు. అమరావతి అభివృద్ధికి కులవాదులే అడ్డు అని, 400 కేసులు అక్రమంగా వేసి ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా అడుగడుగునా అడ్డుపడుతున్న వీరికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విశాఖ 'గ్రీన్'ప్లాంట్

విశాఖ నగరంలో కంటే స్టీల్‌ప్లాంట్‌లో 4 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు

ఉక్కు నగరం (విశాఖ): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసరాలు ప్రత్యేక వాతావరణంలో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్లాంట్ స్థలంలోకి ప్రవేశించిన దగ్గర నుంచి రహదారికి ఇరువైపులా ఉండే పరిసరాలను చూస్తే విశాఖ నగరంలో ఉన్నామా లేక మరెక్కడైనా ఉన్నామా అనే సందేహం కలుగుతుంది. ఉక్కు ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే వేడిని చల్లార్చేలా వాతావరణ సమతుల్యత కోసం తీసుకుంటున్న చర్యల వల్ల నగరంలో కంటే స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో 4 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. పర్యావరణ పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించడంతో దేశంలోనే పర్యావరణ హిత ప్లాంట్‌గా ఖ్యాతి గాంచింది. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్ ప్లాంట్ గ్రీన్ ప్లాంట్‌గా ఎలా మారిందన్నదానిపై ప్రత్యేక కథనం..

ఆగ్రో ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో..

స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం స్టీల్‌ప్లాంట్ ఆగ్రో ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో మొదటి దశలో టన్ను స్టీల్ ఉత్పత్తికి ఒకటి చొప్పున మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని మూడు మిలియన్ చెట్లు నాటి ఆదర్శంగా నిలిచింది. ప్లాంట్ మొదటి దశలో హరిత వనాల పెంపునకు రూ.360 కోట్లు వ్యయం చేయగా.. విస్తరణ యూనిట్లలో మొక్కల పెంపునకు రూ.1,150 కోట్లు వ్యయం చేస్తున్నారు. నిబంధనల మేరకు పరిశ్రమలోని 33 శాతం గ్రీన్ బెల్ట్‌కు వినియోగించాల్సి ఉండగా.. స్టీల్‌ప్లాంట్ ఆ రికార్డును అధిగమించి 2,600 హెక్టార్లలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేసింది.

7.2 మిలియన్ మొక్కలు నాటే లక్ష్యం

ప్రస్తుతం జరుగుతున్న 7.2 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అనుగుణంగా 7.2 మిలియన్ మొక్కలు నాటే లక్ష్యంతో ఆగ్రో ఫారెస్ట్ ముందుకు సాగుతోంది. 2023 మే నెల నాటికి 5.51 మిలియన్ మొక్కలు నాటారు. తుపానులు, సునామి వంటి ఉపద్రవాలను తట్టుకునేలా సుమారు 24 లక్షల కాజురీనా మొక్కలు నాటారు. కాలుష్యాన్ని నివారించేందుకు 18 లక్షలు ఏఏ ఫోర్మిస్, మామిడి, కొబ్బరి, జీడి, జామ, వేప, సుబాబుల్, సపోటా, రావి, మర్రి, టేకు మొక్కలు నాటారు. అదేవిధంగా 2.50 లక్షల యూకలిప్టస్ మొక్కలు నాటారు. బయోడీజిల్‌ను ప్రోత్సహించేందుకు సుమారు 4.50 లక్షలు పాల్‌మైరా, పొంగామియా, జట్రోపా మొక్కలు నాటారు.

నగర కాలుష్యాన్నీ తగ్గించేలా..

నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చేపట్టిన గ్రీన్ విశాఖ ప్రాజెక్ట్‌లో 4.50 లక్షల మొక్కలు నాటేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముందుకొచ్చింది. 2012–19 మధ్యకాలంలో 4.50 లక్షలు మొక్కలు నాటి నగర పర్యావరణానికి సహకారం అందించారు. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) ప్రాజెక్ట్‌లో భాగంగా 2019–23 వ్యవధిలో వివిధ ఫల జాతులకు చెందిన 55 వేల మొక్కలు నాటారు. 2020లో నగరంలోని ఐఐఎం క్యాంపస్‌లో గ్రీనరీ పెంపునకు రూ.40 లక్షలు అందజేశారు. సీఈఆర్‌లో భాగంగా స్టీల్‌ప్లాంట్ పరిసర గ్రామాల్లోని రైతులకు సుమారు 75 వేల జామ, మామిడి, సపోటా, కొబ్బరి మొక్కలు అందజేశారు.

పర్యావరణంతో పాటు సంస్థకు ఆదాయం

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. లక్షలాది మొక్కలను నాటడం ద్వారా నగరంలోని పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తోంది. వివిధ రకాల మొక్కలను పెంచడం ద్వారా సంస్థకు లక్షలాది రూపాయలు ఆదాయం కూడా లభిస్తోంది. సంస్థపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఆదాయం సమకూరుస్తున్నాం. – వీఎల్‌పీ లాల్, డీజీఎం, ఆగ్రో ఫారెస్ట్ విభాగం

క్లుప్తంగా

నైరుతి రుతుపవనాలు మరింత ఆలస్యం

మూడు నాలుగు రోజుల్లో కేరళకు!

న్యూఢిల్లీ: కేరళ తీరాన్ని ఇప్పటికే తాకాల్సిన నైరుతి రుతుపవనాల రాక ఇంకాస్త ఆలస్యం కానుంది. మరో మూడు, నాలుగు రోజులు పడుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా ఏటా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళ తీరాన్ని తాకి దేశమంతటా విస్తరించడంతో వానలు కురుస్తాయి. ఒక్కో ఏడాది వాటి రాక వారం దాకా ఆలస్యమవుతుంది. గత అంచనాల మేరకు జూన్ 4 కల్లా రుతుపవనాలు కేరళకు రావాల్సింది. ''వాటి రాకకు అన్నీ అనుకూలమైన పరిస్థితులే ఉన్నాయి. పశ్చిమం నుంచి వస్తున్న గాలులు దక్షిణ అరేబియా సముద్రం మీదుగా బలంగానే వీస్తున్నాయి. ఆదివారం నాటికి సముద్ర మట్టానికి 2.1. కిలోమీటర్ల పైకి వీస్తున్నాయి. ఆగ్నేయ అరేబియా సముద్రంపై ఆకాశం దట్టంగా మేఘావృతమై ఉంది. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండడం వల్ల మరో మూడు నాలుగు రోజుల్లో రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశాలున్నాయి. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితుల్ని పర్యవేక్షిస్తున్నాం'' అని ఐఎండీ ప్రకటనలో వివరించింది.

టీవీ, రేడియోల్లోనూ వాతావరణ హెచ్చరికలు

న్యూఢిల్లీ: తీవ్ర వాతావరణ హెచ్చరికలను ఇకపై టీవీలు, రేడియోల్లోనూ ప్రసారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలు, తుపాన్లు, వడగాలుల గురించి మొబైల్ ఫోన్లకు మెసేజీలు పంపే ప్రక్రియను ఇప్పటికే జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రారంభించింది. రెండో దశలో టీవీ, రేడియో తదితర మాధ్యమాల ద్వారా కూడా హెచ్చరికల మెసేజీలను పంపే ప్రక్రియ ఈ ఏడాది చివర్లో మొదలవుతుందని ఎన్‌డీఎంఏ అధికారి ఒకరు చెప్పారు.

విపక్షాల భేటీ వాయిదా!

న్యూఢిల్లీ: బీజేపీ వ్యతిరేక పార్టీలను ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన కీలక సమావేశం వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పాట్నాలో ఈ నెల 12వ తేదీన ఈ భేటీ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం అందుబాటులో లేరు. ఆయన అమెరికా పర్యటనలో ఉన్నారు. దాంతో సమావేశాన్ని వాయిదా వేయాలని జేడీ(యూ) నేతలు నిర్ణయించుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్ష కూటమి ఏర్పాటుకు బిహార్ సీఎం నితీశ్‌కుమార్ యత్నిస్తుండటం తెలిసిందే.

బాలాసోర్ తాత్కాలిక మార్చురీలో తమ వారి మృతదేహాల కోసం వెతుకుతున్న ఓ వ్యక్తి



మృతదేహాలను భద్రపరచడం సవాల్

ఒడిశాలో నిండిపోయిన మార్చురీలు

బాలాసోర్: ఒడిశాలోని మూడు రైళ్ల ప్రమాదంలో ఎవరూ గుర్తు పట్టని మృతదేహాల సంఖ్య అధికంగా ఉండడంతో అధికారులు అతి పెద్ద సమస్య ఎదుర్కొంటున్నారు. మార్చురీలలో చోటులేకపోవడంతో మృతదేహాలను ఎక్కడ ఉంచాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు. ప్రమాద స్థలికి చుట్టుపక్కల ఆస్పత్రుల మార్చురీలు నిండిపోవడంతో పాఠశాలల్లోనూ మృతదేహాలను ఉంచారు. రైలు ప్రమాదంలో కుటుంబాలకు కుటుంబాలే దుర్మరణం పాలవడంతో వారిని గుర్తించడానికి ఎవరూ రాని దుస్థితి ఏర్పడింది. దీంతో భువనేశ్వర్‌కి 187 మృతదేహాలను తరలించారు. ఒకేసారి వందల కొద్దీ మృతదేహాలు రావడంతో భువనేశ్వర్‌లో ఉంచడం కూడా సమస్యగానే మారింది. భువనేశ్వర్ ఎయిమ్స్‌లో 110 మృతదేహాలను ఉంచారు. మిగిలినవి ప్రైవేటు ఆస్పత్రులకు పంపారు. ''బంధువులు తీసుకువెళ్లే దాకా మృతదేహాలను భద్రపరచడం కత్తి మీద సామే. ఎయిమ్స్‌లో 40కి మించి ఉంచే సదుపాయాలు లేవు'' అని ఎయిమ్స్‌కు చెందిన అధికారి ఒకరు చెప్పారు వేరే చోట భద్రపరచాలన్నా శవపేటికలు, రసాయనాలు, ఐస్ వంటివి ఏర్పాటు చేయడం కూడా కష్టమవుతోందని ఆ అధికారి చెప్పారు.

మార్చురీ బయట ఆటోలో రోదిస్తున్న మృతుల బంధువులు



ఒడిశా రైళ్ల ప్రమాదంపై... సీబీఐ విచారణ

కారణాన్ని, కారకులను గుర్తించాం

- రైల్వే మంత్రి వైష్ణవ్ ప్రకటన
- విద్రోహ కోణంపై అనుమానం

బాలాసోర్/న్యూఢిల్లీ: దేశాన్ని కుదిపేసిన ఒడిశా రైళ్ల ప్రమాదంపై సీబీఐ విచారణ జరిపించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రమాదానికి మూలకారణాన్ని, ఈ 'నేరపూరిత' చర్యకు ప్రధాన కారకులను ఇప్పటికే గుర్తించినట్టు ఆదివారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించిన కాసేపటికే ఈ మేరకు ప్రకటన వెలువడింది. అంతేగాక, ''ప్రమాదం వెనక విద్రోహ కోణాన్నీ తోసిపుచ్చలేం. రైళ్ల ఉనికిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ వాటి గమనాన్ని నిర్దేశించే అతి కీలకమైన ఇంటర్ లాకింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి ఉండే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేం'' అని రైల్వే వర్గాలు చెప్పుకొచ్చాయి. రైలును ట్రాక్‌ను మళ్లించే ఎలక్ట్రిక్ పాయింట్, ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సంబంధిత సమస్యే ప్రమాదానికి కారణమని ప్రమాద స్థలి వద్దే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న వైష్ణవ్ భువనేశ్వర్‌లో మీడియాకు చెప్పారు. ''పూర్తి వివరాల్లోకి నేనిప్పుడే వెళ్లదలచుకోలేదు. అయితే పాయింట్ యంత్రం సెట్టింగ్‌ను మార్చారు. ఇదెందుకు, ఎలా జరిగిందన్నది విచారణ నివేదికలో వెల్లడవుతుంది'' అని వివరించారు. మూడు రైళ్ల ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీబీఐకి సిఫార్సు చేసినట్టు వెల్లడించారు. విపక్షాలు మాత్రం ఈ విషయంలో కేంద్రంపై దుమ్మెత్తిపోశాయి. ప్రమాదానికి పూర్తి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ సహా పలు ఇతర విపక్షాలు రైల్వే మంత్రి రాజీనామాకు డిమాండ్ చేశాయి. మంత్రుల స్థాయి నుంచి కింది దాకా బాధ్యులందరినీ గుర్తించి కఠినాతి కఠినంగా శిక్షించి తీరాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. మోదీ సర్కారు మీడియా పిచ్చి, పీఆర్ గిమ్మిక్కులు ప్రభుత్వ వ్యవస్థను చేతగానిదిగా మార్చేశాయమంటూ ఖర్గే తూర్పారబట్టారు. యూపీఏ హయాంలో రైల్వే మంత్రుల పనితీరు ఎంత ఘోరంగా ఉండేదో కాంగ్రెస్ ఆత్మ పరిశీలన చేసుకోవాలంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. మహా విపత్తును కూడా రాజకీయం చేయడం దారుణమని మండిపడింది. ప్రమాదంలో మరణించిన వారి తుది సంఖ్యను 288 నుంచి 275గా రైల్వే శాఖ ఆదివారం సవరించింది.

ప్రమాదస్థలి వద్ద యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు



విద్రోహ కోణంపై రైల్వే ఏం చెప్పిందంటే...

పాయింట్ మెషీన్, ఇంటర్ లాకింగ్ వ్యవస్థ పూర్తిగా సురక్షితమని రైల్వే వర్గాలు వివరించాయి. ''అదెంత సురక్షితమంటే ఒకవేళ అది పూర్తిగా విఫలమైనా సిగ్నళ్లన్నీ వెంటనే రెడ్‌కు మారి రైళ్ల రాకపోకలన్నీ తక్షణం నిలిచిపోతాయి. అయినా సిగ్నలింగ్ సమస్యే ప్రమాదానికి కారణమైంది గనుక బయటి శక్తుల ప్రమేయాన్ని తోసిపుచ్చలేం. కేబుళ్లను చూసుకోకుండా ఎవరైనా తవ్వేయడంతో తెగిపోయి ఉండొచ్చు'' అని రైల్వే బోర్డు సభ్యురాలు జయా వర్మ సిన్హా వివరించారు. ప్రమాదానికి మితిమీరిన వేగం, డ్రైవర్ల తప్పిదం కారణం కావని రైల్వే వర్గాలు స్పష్టం చేశాయి. లోపలి, లేదా బయటివ్యక్తులు విద్రోహానికి పాల్పడే అవకాశాన్నీ తోసిపుచ్చలేమని రైల్వే అధికారి ఒకరన్నారు.

టికెట్ లేని వారికీ పరిహారం

షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ శుక్రవారం రాత్రి ఒడిశాలోని బహనగా బజార్ స్టేషన్ సమీపంలో లూప్‌లైన్లోకి దూసుకెళ్లి ఆగున్న గూడ్సును ఢీకొని పట్టాలు తప్పడం, పక్క ట్రాక్‌పై పడ్డ బోగీలను ఢీకొని బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా పట్టాలు తప్పడం తెలిసిందే. ఈ ఘోర ప్రమాదంలో గాయపడ్డ 1,175 మందిలో వందలాది మంది ఇంకా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండు రైళ్లలో చాలావరకు వలస కార్మికులే ఉన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని టికెట్ లేని ప్రయాణికులకు కూడా పరిహారం అందించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. మరోవైపు సహాయ చర్యలతో పాటు ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. తూర్పు, దక్షిణ భారతాలను కలిపే ఈ కీలక రైల్వే లైన్లో పూర్తిగా దెబ్బ తిన్న ట్రాకుల్లో ఇప్పటిదాకా రెండింటిని పునరుద్ధరించారు.

ప్రమాదంపై సుప్రీంలో పిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఒడిశాలో రైలు ప్రమాదంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సారథ్యంలో విచారణకు కేంద్రాన్ని ఆదేశించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. రైల్వే వ్యవస్థలో ప్రమాద, భద్రత పరామితులను కమిటీ విశ్లేషించి, వాటి బలోపేతానికి సలహాలు, సూచనలిచ్చేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ విశాల్ తివారీ కోరారు. కవచ్ వ్యవస్థను వెంటనే అమలు చేసేలా మార్గదర్శకాలివ్వాలన్నారు.

సిగ్నల్ రాంగ్ రూట్

- మూడు నెలల ముందు సంపర్క్ క్రాంతికి తప్పిన ప్రమాదం
- సిగ్నల్ వ్యవస్థలో లోపాలు అరికట్టాలంటూ అప్పట్లోనే హెచ్చరికలు

భువనేశ్వర్: ఒడిశాలోని మూడు రైళ్లు ఢీకొని 275 మంది ప్రాణాలు బలైపోయిన తర్వాత మన దేశంలో రైల్వే సిగ్నల్ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. మూడు నెలల ముందే సిగ్నల్ వ్యవస్థలో తీవ్రమైన లోపాలు ఉన్నాయంటూ సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ రాసిన లేఖ ఒకటి మీడియాకి చిక్కింది. సిగ్నల్ వ్యవస్థలో లోపాలు వెంటనే సవరించకపోతే భారీ ప్రమాదాలు చోటు చేసుకోవడం ఖాయమంటూ ఆ చీఫ్ మేనేజర్ రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతూ ఫిబ్రవరి 9న లేఖ రాశారు. ఫిబ్రవరి 8వ తేదీన బెంగుళూరు నుంచి న్యూఢిల్లీకి వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ భారీ ప్రమాదానికి గురై ఉండాల్సిందని డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ముప్పు తప్పిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో మెయిన్ లైన్ ద్వారా వెళ్లవచ్చునని డ్రైవర్‌కి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అలా సిగ్నల్ వచ్చినప్పుడు పట్టాల దగ్గర ఉండే పాయింట్ మారాలి. రైలుని ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌కి మళ్లించడాన్ని పాయింట్ అంటారు. అయితే సిగ్నల్, పాయింట్ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. దీనిని గమనించిన డ్రైవర్ సరైన సమయంలో రైలుని ఆపేశారు.



దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటర్‌లాకింగ్ వ్యవస్థని సరిగా వినియోగించుకోలేకపోవడం వల్ల ముంచుకొచ్చిన ప్రమాదం ఇదని ఆయన ఆ లేఖలో వివరించారు. సిగ్నలింగ్ సాంకేతిక వ్యవస్థపై సమగ్రమైన విచారణ జరపడమే కాకుండా, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఆఫీసర్లు, ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్లపై దీనిపై అవగాహన పెంచే ప్రయత్నాలు చేయాలన్నారు. సిగ్నల్ వ్యవస్థని నిరంతరం పర్యవేక్షిస్తూ వెనువెంటనే లోపాలు సరిదిద్దుకోకపోతే ఘోరమైన ప్రమాదాలు చూస్తామని సౌత్ వెస్ట్రన్ రైల్వే చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ మూడు నెలల కిందటే హెచ్చరికలు జారీ చేశారు.

బిహార్‌లో కూలిన తీగల వంతెన

నిర్మాణంలో ఉండగానే ఈదురుగాలులకు పగుళ్లు

వంతెన కూలిపోతున్న దృశ్యాలు



పట్నా: రూ.1,700 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భారీ తీగల వంతెన కూలిపోయింది. బిహార్ రాష్ట్రం భాగల్పూర్ జిల్లాలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. నిర్మాణంలో ఈ వారధి తొలుత రెండు ముక్కలుగా విడిపోయింది. ఒకదాని తర్వాత ఒకటి నేలకూలాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. బ్రిడ్జి కూలిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. గంగా నదిపై ఖగారియా.. అగువానీ, సుల్తాన్‌గంజ్ మధ్య ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. రెండేళ్ల క్రితం కొంత భాగం కూలిపోవడంతో పునర్నిర్మించారు. రెండు నెలల క్రితం బలమైన ఈదురు గాలుల ధాటికి పగుళ్లు వచ్చాయి. ఆదివారం నేల కూలింది. దాదాపు ఐదు స్తంభాలు కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వంతెన కూలిన ఘటనపై ప్రతిపక్ష బీజేపీ నేత విజయ్‌కుమార్ సిన్హా స్పందించారు. రాష్ట్రంలో ప్రతి పనిలోనూ కమిషన్లు తీసుకోవడం ఒక సంప్రదాయంగా మారిపోయిందని నితీశ్ కుమార్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో పరిపాలన ఆగిపోయిందని, అరాచకం, అవినీతి పెచ్చరిల్లిపోతున్నాయని ఆరోపించారు. ఇక్కడ వ్యవస్థలు భ్రష్టుపట్టిపోతుంటే సీఎం నితీశ్ విపక్షాల ఐక్యత గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

తీవ్రంగా చలించిపోయా: బైడెన్



వాషింగ్టన్: ఒడిశాలోని బాలాసోర్‌లో రైలు ప్రమాద ఘటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత్‌లో సుమారు 300 మందిని బలి తీసుకున్న రైలు ప్రమాద విషాద వార్త విని తీవ్రంగా చలించిపోయానని బైడెన్ పేర్కొన్నారు. 'భారత్‌లో చోటుచేసుకున్న అత్యంత తీవ్రమైన రైలు ప్రమాద విషాద వార్త విని నేను, నా భార్య జిల్ బైడెన్ తీవ్ర దిగ్భ్రాంతి చెందాము. ఈ ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి, క్షతగాత్రుల గురించి ప్రార్థిస్తున్నాం. భారత్, అమెరికాను ఇరు దేశాల కుటుంబ, సాంస్కృతిక మూలాల్లో ఉన్న విలువలే ఏకం చేస్తున్నాయి. బాధితుల కోసం యావత్తు అమెరికా సంతాపం వ్యక్తం చేస్తోంది' అని బైడెన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలాసోర్ ఘటనపై ఇప్పటికే యూకే ప్రధాని రిషి సునాక్, రష్యా అధ్యక్షుడు పుతిన్, జపాన్ ప్రధాని కిషిదా తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్షతగాత్రులను తరలిస్తున్న బస్సుకు ప్రమాదం

మేదినీపూర్: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ రైలు ప్రమాద ఘటనలో గాయపడిన వారిని తీసుకెళ్తున్న బస్సు పశ్చిమబెంగాల్‌లోని మేదినీపూర్‌లో ప్రమాదానికి గురైంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో బస్సు, పికప్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బస్సులోని వారిలో ఎక్కువమంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించారు.

తెలంగాణలో బీజేపీని తుడిచేస్తాం

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనిపించదు
- అన్ని ఎన్నికల్లోనూ కర్ణాటక ఫలితాలే పునరావృతం
- న్యూయార్క్‌లో ఓ కార్యక్రమంలో రాహుల్ గాంధీ

న్యూయార్క్: కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లోనూ పునరావృతం అవుతాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తుడిచిపెట్టేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీయే కాకుండా యావత్ భారత్ ప్రజలు విద్వేషపూరిత సిద్ధాంతాలను ఓడించడానికి సిద్ధమయ్యారని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ న్యూయార్క్‌లో శనివారం ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్-యూఎస్ఏ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ''కర్ణాటకలో మేము బీజేపీని ఓడించలేదు. తుడిచిపెట్టేశాము. ఆ పార్టీని నిర్మూలించాం. బీజేపీ గెలుపు కోసం చేయని ప్రయత్నం లేదు.మీడియా అంతా వారి వైపే ఉంది. మా దగ్గర కంటే 10 రెట్లు ధనబలం వారికి ఉంది. వారి చేతిలో అధికారం ఉంది. అన్నీ బీజేపీకే ఉన్నా వారిని తుడిచిపెట్టేశాం.'' అని రాహుల్ చెప్పారు. కర్ణాటక తర్వాత తెలంగాణలో బీజేపీని మట్టికరిపిస్తామన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ ఇక అక్కడ కనిపించదని జోస్యం చెప్పారు. తెలంగాణతో పాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయన్నారు. సమాజంలో బీజేపీ వ్యాప్తి చేస్తున్న విద్వేష వాతావరణం మధ్య ముందుకు వెళ్లలేమని భారత్ ప్రజలకు బాగా అర్థమైందని చెప్పారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీని ఓడిస్తామని రాహుల్ ధీమాగా చెప్పారు. ఈ సారి సార్వత్రిక ఎన్నికలు సిద్ధాంతాల మధ్య పోరాటంగా రాహుల్ అభివర్ణించారు. విద్వేషానికి, ప్రేమకి మధ్య జరిగే పోరాటంలో బీజేపీ ఓడిపోవడం తథ్యమన్నారు.

రాజకీయాల కంటే ఇంకా పెద్ద విషయాలుంటాయ్ : జై శంకర్

అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ విరుచుకుపడ్డారు. విదేశాల్లో రాజకీయాల కంటే మాట్లాడాల్సిన పెద్ద అంశాలెన్నో ఉంటాయని అన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఆయన కేప్‌టౌన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ విదేశీ గడ్డపై అడుగు పెట్టినప్పుడు రాజకీయాల కంటే పెద్ద అంశాలపై మాట్లాడాలని, ఇది ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

ఒడిశా రైలు దుర్ఘటనకు ప్రధాన కారణం ఏమిటన్న దానిపై చర్చ మొదలైంది. ఒకే ట్రాక్‌పై ప్రయాణించే రైళ్లు ఒకదానికొకటి ఢీకొట్టకుండా కవచ్ అనే ఆధునిక వ్యవస్థ ఉన్నప్పటికీ భారీ ప్రమాదం జరగడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఒడిశా ప్రమాద ఘటనకు కవచ్ వ్యవస్థతో సంబంధం లేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా ప్రకటించారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్(ఈఐ) వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పుల వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. బాధ్యులను గుర్తించామని చెప్పారు. దర్యాప్తు కొనసాగుతోందని, రైలు సేఫ్టీ కమిషనర్ త్వరలో నివేదిక అందజేస్తారని వెల్లడించారు. సిగ్నలింగ్‌లో లోపాల కారణంగానే రైలు ప్రమాదం జరిగినట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ నేపథ్యంలో అసలు ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ అంటే ఏమిటన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ వ్యవస్థ ఎలా పని చేస్తుంది? దాని వల్ల రైళ్లు ఎంత భద్రం? అనేది తెలుసుకుందాం..

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టం భద్రతకు భరోసా



రైళ్ల భద్రతే లక్ష్యంగా...

ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ రైళ్ల భద్రతే లక్ష్యంగా పని చేస్తుంది. రైళ్ల రాకపోకలు, సిగ్నల్స్, ట్రాక్స్‌ను నియంత్రించడానికి ఈ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఒకప్పుడు మనుషులు చేసిన పనిని ఇప్పుడు కంప్యూటర్ల సాయంతో నిర్వర్తిస్తున్నారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో 45 శాతానికి పైగా స్టేషన్లు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో అనుసంధానమయ్యాయి. రైల్వేల ఆధునికీకరణలో భాగంగా ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తోంది. 2022-23లో కొత్తగా 347 స్టేషన్లలో ఈ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దేశంలో బ్రాడ్‌గేజ్(బీజీ) మార్గాల్లో 6,506 రైల్వే స్టేషన్లు ఉండగా, వీటిలో 6,396 స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ ఏర్పాటయ్యింది. ఒడిశాలో ప్రమాదం జరిగిన బహనాగ బజార్ రైల్వేస్టేషన్‌లోనూ ఈ వ్యవస్థ ఉంది.

ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత బాగా తగ్గిన రైలు ప్రమాదాలు

- రైళ్లకు ట్రాక్‌లను కేటాయించడంలో కీలకం
- ఒడిశా ప్రమాదానికి ఇతర పరిస్థితులు, మానవ తప్పిదాలే కారణమంటున్న నిపుణులు

ఏమిటీ లాకింగ్ సిస్టమ్?



- రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో ఇదొక అంతర్భాగం. నిర్దేశిత మార్గాల్లో రైళ్లు క్షేమంగా రాకపోకలు సాగించేలా ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ ద్వారా నియంత్రిస్తారు.
- గతంలో మెకానికల్, ఎలక్ట్రో-మెకానికల్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు ఉండేవి. వాటి ఆధునిక రూపమే ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్.
- సంప్రదాయ ప్యానెల్ ఇంటర్‌లాకింగ్, ఎలక్ట్రో-మెకానికల్ ఇంటర్‌లాకింగ్‌తో పోలిస్తే ఈ అధునాతన వ్యవస్థతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.
- సాఫ్ట్‌వేర్ ఆధారంగా పనిచేస్తుంది. సిగ్నలింగ్ వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేర్పులైనా సులభంగా చేసుకోవచ్చు.
- ఇది ప్రాసెసర్ ఆధారిత వ్యవస్థ అని నిపుణులు చెబుతున్నారు. విస్తృతమైన ప్రయోగ పరీక్షల తర్వాతే దీన్ని తీసుకొచ్చారు.
- ట్రైన్ డిటెక్షన్ సిస్టమ్, సిగ్నళ్లు, పాయింట్లు, ట్రాక్ సర్క్యూట్లు వంటి వాటితో అనుసంధానమై పనిచేస్తుంది. ఇందుకోసం కంప్యూటర్లు, ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సెన్సార్లు, ఫీడ్ బ్యాకింగ్ పరికరాలు ఉపయోగిస్తారు.
- రైళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రమాదాలు జరగకుండా నియంత్రించడానికి వీలుంటుంది.
- ఒకే ప్రాంతంలో ఒకే పట్టాల(ట్రాక్)పై ఏకకాలంలో రెండు రైళ్లు ఉండకుండా చూస్తుంది. రైళ్లకు ట్రాక్‌లను కేటాయించే వ్యవస్థ ఇది.
- ఒక మార్గంలో ప్రయాణం పూర్తి సురక్షితం అని తేలేదాకా రైలుకు సిగ్నల్ ఇవ్వకుండా ఆపేస్తుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక రైలు ప్రమాదాలు, పరస్పరం ఢీకొనడం వంటివి చాలావరకు తగ్గిపోయాయి

వైఫల్యాలు ఎందుకు?

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ సమర్థంగా పనిచేయడమే కాదు, మొరాయించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఈ వ్యవస్థలో ఏదైనా లోపం తలెత్తితే సిగ్నల్ వెంటనే ఎరుపు రంగులోకి మారిపోతుంది. తద్వారా రైలు నడిపించే లోకో పైలట్‌కు తక్షణమే సంకేతం అందుతుంది.

ఒకవేళ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ వైఫల్యం చెందితే అందుకు బహిర్గత పరిస్థితులు, మానవ చర్యలే చాలావరకు కారణమవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఒడిశా ఘటనలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌లో నార్మల్ లైన్‌పై పాయింట్ సెట్ చేయాల్సి ఉండగా, లూప్‌లైన్‌పై చేశారని, మానవ ప్రమేయం లేకుండా ఇది జరిగేది కాదని సిగ్నలింగ్ నిపుణుడొకరు చెప్పారు.

రైలు ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తవ్వకాలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. దానివల్ల అక్కడ సిగ్నలింగ్‌కు సంబంధించిన వైర్లు దెబ్బతినడం లేదా షార్ట్ సర్క్యూట్ జరగడం, ఫలితంగా రైలుకు సరైన సంకేతం ఇవ్వడంలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ వైఫల్యం చెంది ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పొడవాటి నాలుకతో జోయి గిన్నిస్ రికార్డు





అమెరికాలోని లూసియానాకు చెందిన ఈ కుక్క పేరు జోయి. దీని నాలుక పొడవు 12.7 సెంటీమీటర్లు. అత్యంత పొడవైన నాలుకతో జీవించి ఉన్న కుక్కగా ఇది గిన్నిస్ రికార్డుల్లోకెక్కింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 5 । జూన్ । 2023

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణం



తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణ స్థాయిలో కనిపించింది. దీంతో భక్తులకు కేవలం గంట వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభించింది. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకుని పాఠశాలలు తెరుచుకోనున్న క్రమంలో భక్తుల రద్దీ మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

పల్లవరం సరస్సు పునరుద్ధరణకు చర్యలు

– ఇండియన్ ఆర్మీ చొరవపై సర్వత్రా హర్షం



పలువురిని సత్కరిస్తున్న ఇండియన్ ఆర్మీ అధికారులు

కొరుక్కుపేట: చెన్నై పల్లవరం సరస్సును పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగా దక్షిణ్ భారత్ ఏరియా కింద ఇండియన్ ఆర్మీ, ఉడాన్ బృందం, ఎక్స్‌నోరా ఇంటర్నేషనల్ సహకారం ద్వారా ఓ ముఖ్యమైన ముందడుగు వేసింది. ఉమ్మడి ప్రయత్నంగా సరస్సును శుభ్రపరచడం, ప్రకృతి పరిరక్షణకు దోహదపడడం, స్థిరమైన పర్యావరణ పద్ధతుల గురించి అవగాహన పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం గత మూడు రోజుల పాటు వివిధ రకాల పనులు చేపట్టింది. అదే సమయంలో అడవుల పెంపకాన్ని ప్రోత్సహించడానికి, ఆ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి సరస్సు అంచున ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇక ఏకకాలంలో పర్యావరణ పరిరక్షణ, పునరుద్ధరణకు సంబంధించి రెజిమెంట్‌లు నిబద్ధతను దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అధికారులు ఈ సందర్భంగా కొనియాడారు.

యునానీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ డీజీగా జహీర్ అహ్మద్

కొరుక్కుపేట: కేంద్ర యునానీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్‌గా చెన్నై రాయపురానికి చెందిన జహీర్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ యునాని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి 40 ఏళ్ల చరిత్రలో ఈ పదవిని దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త పద్ధతులపై రైతులు దృష్టి సారించాలి

సాక్షి, చెన్నై: కొత్త వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి పెట్టాలని, ఇందుకు అనుగుణంగా తాము పనిముట్లు, పరికరాలను ఉత్పత్తి చేసి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇంటర్నేషనల్ ట్రాక్టర్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ తెలిపారు. మే నెలలో అత్యధికంగా చేపట్టిన 13,702 ట్రాక్టర్ల విక్రయాలు, సాధించిన వృద్ధి గురించి ఆదివారం స్థానికంగా ఆయన వివరించారు. రైతు శ్రేయస్సును నిర్ధారించడానికి , వ్యవసాయ రంగంలో ఆర్థిక ప్రగతే లక్ష్యంగా తమ వంతు సహకారం అందిస్తున్నామని వివరించారు. రైతుల ఉద్పాదకత, ఆదాయాన్ని మరో స్థాయికి చేరుస్తామని వివరించారు. ఎఫ్‌వై 24లో సోనాలికా తన హెవీ డ్యూటీ ట్రాక్టర్ల శ్రేణితో కొత్త విక్రయాల రికార్డు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

టపాసుల పేలుడు ఘటనలో మరో ఇద్దరి మృతి

తిరువొత్తియూరు: సేలం సమీపంలోని బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు తాజాగా మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. సేలం సమీపంలోని కొల్లపట్టి కందసామి టపాసుల తయారీ కర్మాగారం నడుపుతున్నారు. ఈ ఫ్యాక్టరీలో 1వ తేదీన పేలుడు సంభవించింది. కందస్వామి కుమారుడు సతీష్‌కుమార్, కూలీలు నటేశన్, భానుమతి అక్కడికక్కడే మృతి చెందారు. సర్కార్ కొల్లపట్టికి చెందిన ప్రభాకరన్ (31), మజ్రా కొల్లపట్టికి చెందిన మోహన్ (38), వసంత, మహేశ్వరి, మణిమేఘలై, బృంద తీవ్రంగా గాయపడ్డారు. వారిని సేలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం ప్రభాకరన్, మోహన్ మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తిరుచెందూర్‌లో వ్రతం పూర్తి చేసుకున్న భక్తులు

తిరువొత్తియూరు: వైకాశి విశాఖ నక్షత్ర ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా కాలినడకన తిరుచెందూరుకు వచ్చిన భక్తులు శనివారం ఆలయ ప్రాంగణంలో చేపలు వండి భుజించి వ్రతాన్ని పూర్తి చేసుకున్నారు. తిరుచెందూర్ సుబ్రమణ్య స్వామి ఆలయంలో 24వ తేదీన వైకాశి విశాఖ, వసంత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆరుపడై వీడులలో 2వదైన తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని రోజూ తెల్లవారుజామున తెరిచి పూజలు నిర్వహించారు. 10వ రోజు శుక్రవారం వైకాశి విశాఖ ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. నెల్లై, కుమరి, తూత్తుకుడి, అరుప్పుకొట్టై, సాత్తూర్, శివకాశి, రామనాథపురం నుంచి భక్తులు మాలలు ధరించి ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయానికి పాదయాత్రగా చేరుకుని సుబ్రహ్మణ్యస్వామిని దర్శనం చేసుకుని కానుకలు చెల్లించారు. శనివారం తెల్లవారుజామున విశ్వరూప దీపారాధన తరువాత ఆలయ ప్రాంగణంలో చేపలు వండుకుని భుజించి ఉపవాస దీక్షను ముగించారు.

175 లక్ష్యంగా శ్రమిద్దాం

"రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 175కు 175 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం శ్రమిద్దాం'' అని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సైనికులకు ఆ పార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ పిలుపు నిచ్చారు. ఇందుకోసం సామాజిక మాధ్యమాలనే అస్త్రాలుగా వాడుకుందామని సూచించారు. చెన్నైలోనూ త్వరలో పార్టీ సోషల్ మీడియా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఆదివారం ప్రకటించారు.

- సామాజిక మాధ్యమాలను అస్త్రాలుగా చేసుకోవాలి
- జగనన్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తెలియజేయాలి
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సైనికులకు సజ్జల భార్గవ్ పిలుపు
- త్వరలో 'చెన్నై కమిటీ' ఏర్పాటు
- సేవాదళ్‌పై ప్రశంసల జల్లు



మహానేత వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చల్లా మధుసూదన్, సజ్జల భార్గవ్, జకీర్ హుస్సేన్

సాక్షి, చెన్నై: చెన్నై ఓఎంఆర్‌లోని పార్క్ ప్లాజాలో ఆదివారం తమిళనాడు వైఎస్సార్ సీపీ సేవాదళ్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నేతృత్వంలో సోషల్ మీడియా సైనికుల ఆత్మీయ సమావేశం జరిగింది. సోషల్ మీడియా కో– ఆర్డినేటర్ సజ్జల భార్గవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా మధుసూదన్, సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్‌లు జ్యోతి ప్రజ్వలనతో ఈ సమావేశాన్ని ప్రారంభించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సమావేశానికి చెన్నై, శివారు జిల్లాల నుంచే కాకుండా పొరుగున ఉన్న నెల్లూరు, చిత్తూరు, బాలాజీ జిల్లాల నుంచి సైతం పెద్దసంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, చెన్నైలోని సోషల్ మీడియా, ఐటీ విభాగం ప్రతినిధులు, వివిధ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు, ఐటీ సంస్థల్లో పనిచేస్తున్న అభిమానులు, తెలుగు ప్రముఖులు వందలాదిగా తరలివచ్చారు.

పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దాం

ఈ సమావేశంలో సజ్జల భార్గవ్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలలోనూ పార్టీ కోసం సమయం కేటాయించి శ్రమిస్తున్న వారు అధికంగా ఉండడం ఆనందంగా ఉందని, ఇక్కడున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులు అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని వివరించారు. దీనిని చూసి ఓర్వ లేక ప్రత్యర్థులైన దుష్టశక్తులు వ్యవస్థలను, ఎల్లో మీడియాను మేనేజ్ చేస్తూ డేంజర్ గేమ్ ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ శక్తుల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు జగనన్న చెప్పినట్లుగా అందరూ సోషల్ మీడియాను ఆయుధంగా మలుచుకుందామని పిలుపు నిచ్చారు. అందరం కలిసికట్టుగా శ్రమిస్తే 2024లో జగనన్న ఆశించిన 175కు 175 సీట్ల లక్ష్య సాధన సులభతరం అవుతుందన్నారు. సోషల్ మీడియాకు ప్రత్యేక టీం ఉందని, భారీ వసతులు కల్పించారని, ఇక్కడున్న ప్రతి ఒక్కరూ విజయవాడకు వచ్చి వీటిని వీక్షించాలని కోరారు. 2019 ఎన్నికల సమయంలో మన సోషల్ మీడియా సత్తా ఏమిటో ఎల్లో మీడియాకు, అప్పటి టీడీపీ ప్రభుత్వానికి రుచి చూపించామని గుర్తు చేస్తూ, ఆ విధంగా ప్రత్యర్థులను మన సోషల్ మీడియా బెంబేలు ఎత్తించిందన్నారు. ఈ ఘనత వైఎస్సార్ సీపీ సైనికులకే దక్కుతుందన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పి కొడుదాం..

చల్లా మధుసూదన్ మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి రెండు కళ్లుగా భావించి పరిపాలన అందిస్తున్నారని వివరించారు. ఈ ప్రజా పరిపాలనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టే విధంగా ముందుకెళ్దామని, ఇది మనందరి బాధ్యత అని తెలిపారు. 2024లో మళ్లీ అధికారమే లక్ష్యంగా శ్రమిద్దామని, ఇందులో భాగంగా సోషల్ మీడియాను మరింత విస్తృతంగా ఉపయోగించుకునేందుకు అన్ని రాష్ట్రాల్లోని తెలుగు వారిని కలవడం జరుగుతోందన్నారు. కుప్పంతో సహా 175 స్థానాల్ని కైవసం చేసుకునే విధంగా శ్రమిద్దామని పిలుపు నిచ్చారు. జకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, వైఎస్ అనిల్‌రెడ్డి ప్రోత్సాహంతో తాము ఇక్కడ కార్యక్రమాలు చేస్తున్నామని, మున్ముందు మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు శరవణన్, డి. శరత్ కుమార్ రెడ్డి, మణి కండన్, నిరంజన్ రెడ్డి, మేడగం శ్రీనివాస రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, మహిళా విభాగం తమిళనాడు నాయకురాలు క్రితిక, సీనియర్ జర్నలిస్టు సూర్యప్రకాశ్ రావు తదితరులు ప్రసంగించారు.

98 శాతం హామీల అమలు

2014 ఎన్నికల్లో 600 అబద్ధాలను వల్లించిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని ధ్వజమెత్తారు. ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది పోగా, ప్రస్తుతం ఇతర పార్టీల మేనిఫెస్టోలను కాపీ కొట్టేశారని విమర్శించారు. దత్త పుత్రుడు పవన్ ప్యాకేజీ కోసం ఎదురు చూపుల్లో ఉన్నారని చమత్కరించారు. అధికారంలోకి వచ్చిన 4 ఏళ్లలో 98 శాతం హామీలను సీఎం జగనన్న అమలు చేశారని గుర్తు చేస్తూ, నవరత్నాలతో పాటు ప్రగతి పథకాలను రానున్న కాలంలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామని పిలుపు నిచ్చారు. రానున్న 9 నెలలు సోషల్ మీడియా సైనికులు కలిసి కట్టుగా, విస్తృతంగా పనిచేయాలని పిలుపు నిస్తూ, త్వరలో చెన్నైలోనూ సోషల్ మీడియాకు కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎల్లో మీడియా అసత్య ప్రచారాలకు.. దీటుగా సమాధానం ఇస్తూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సైనికులు ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. అనంతరం సోషల్ మీడియా లక్ష్యాలు, కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



జకీర్ హుస్సేన్‌కు సత్కారం



హాజరైన కార్యకర్తలు



చల్లా మధుసూదన్‌ను సత్కరిస్తున్న శరవణన్

చెన్నై – బెంగళూరు హైవేలో ఘోరం!

- అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఐదుగురు మృతి
- కారుటైరు పేలడమే ప్రమాదానికి కారణమని నిర్ధారణ



ప్రమాదంలో మృతి చెందిన కుటుంబం



నుజ్జు నుజ్జు అయిన కారు

సాక్షి, చెన్నై: చెన్నై – బెంగళూరు జాతీయ రహదారిలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ కారు టైర్ హఠాత్తుగా పేలింది. దీంతో అతివేగంగా ప్రయాణిస్తున్న ఈ కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొంది. కారు నుజ్జు నుజ్జుకావడంతో ఆ శిథిలాల కింద చిక్కుకుని నలుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మూడునెలల మగ బిడ్డను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లా సెంగం తాలుకా నాచ్చియార్ పట్టు గ్రామానికి చెందిన రామజయం (40) తన భార్య రత్న (35), కుమార్తెలు రాజలక్ష్మి(5), తేజశ్రీ(2), మూడు నెలల బిడ్డ, బంధువు రాజేష్(25)తో కలిసి రెండు రోజుల క్రితం చెన్నైకు వచ్చారు. భార్య రత్న తల్లిదండ్రుల ఇంట్లో ఉన్నారు. ఇక్కడి నుంచి రాత్రి సెంగానికి తిరుగుప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో చెన్నై – బెంగళూరు జాతీయ రహదారిలోని కాంచీపురం జిల్లా చిట్టేరి మేడు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు టైరు పేలింది. ఈ క్రమంలో అది రోడ్డు పక్కగా ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొంది. కారు నుజ్జు నుజ్జైంది. భారీ శబ్దం విన్న ఆ పరిసర వాసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాంచీపురం పోలీసులు కారు శిథిలాలలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు శ్రమించారు. ఈ ప్రమాదంలో రత్న, రాజలక్ష్మి, తేజశ్రీ, రాజేష్ ఘటనా స్థలంలోనే మరణించారు. తీవ్రంగా గాయపడ్డ మూడు నెలల మగ బిడ్డ, రామజయంను ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలో ఆ బిడ్డ కూడా మరణించింది. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మృతదేహాలను పోస్టుమార్టానికి పోలీసులు తరలించారు. కారులో ఉన్నసెల్ ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా చెన్నై, తిరువణ్ణామలైలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. కాంచీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న భానుడి ప్రతాపం

- 7వ తేదీన పాఠశాలల పునఃప్రారంభంపై సందిగ్ధం



సాక్షి, చెన్నై: కత్తిరి నెల ముగిసినా భానుడి ప్రతాపం తగ్గడం లేదు. ముఖ్యంగా ఉత్తర తమిళనాడులో ఆదివారం కూడా సూర్యుడు బెంబేలెత్తించాడు. మరో వైపు దక్షిణ తమిళనాడులో క్రమంగా వాతావరణం మారుతోంది. మరో మూడు రోజులు ఇక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పశ్చిమ పర్వత శ్రేణుల వెంబడి ఉన్న జిల్లాల్లో సైతం 105 ఫారిన్ హీట్ డిగ్రీల మేరకు ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం ఈ జిల్లాలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నైరుతి రుతు పవనాల ఆహ్వానానికి శుభ సూచకంగా.. ఆదివారం నుంచి పశ్చిమ కనుమల్లోని నీలగిరి, కోయంబత్తూరు, తేని, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి జిల్లాలో వాతావరణం పూర్తిగా మారింది. ఈ జిల్లాలలో మూడు రోజుల పాటుగా వర్షాలు పడనున్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇక, ఉత్తర తమిళనాడులో ఏ మాత్రం భానుడి సెగ తగ్గడం లేదు. ఆదివారం చెన్నై, శివారు జిల్లాలలో 108 ఫారిన్ హీట్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో మూడు రోజులు ఇదే విధంగా ప్రభావం ఉంటుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ దృష్ట్యా, వేసవి సెలవుల అనంతరం ఈనెల 7వ తేదీన పాఠశాలలు ప్రారంభమయ్యేనా లేదా, సెలవులు పొడిగిస్తారనే చర్చ సాగుతోంది.

తమిళులందరూ సురక్షితం

ఒడిశా రైలు ప్రమాదం నుంచి తమిళులందరూ సురక్షితంగా బయటపడినట్లు తమిళనాడు ప్రభుత్వం ఆదివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు 200 మంది స్వస్థలాలకు చేరినట్లు ప్రకటించింది. ఇందులో ఒకరు మాత్రమే రాజీవ్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. దీంతో మంత్రులు ఉదయ నిధి స్టాలిన్, శివశంకర్ నేతృత్వంలోని అధికారుల బృందం చెన్నైకి తిరుగు ప్రయాణమైనట్లు అధికారులు ప్రకటించారు.

- స్వస్థలాలకు 200 మంది రాక
- ఆస్పత్రిలో ఒకరికి చికిత్స
- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒడిశా నుంచి తిరుగుప్రయాణమైన మంత్రుల బృందం



ఒడిశాలో బాధితులను పరామర్శిస్తున్న ఉదయనిధి స్టాలిన్ తదితరులు



ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో చర్చిస్తూ..

సాక్షి, చెన్నై: ఒడిశా రాష్ట్రంలో మూడు రైళ్లు ఢీకొన్న ఘోర ప్రమాదం.. దేశ ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిన సంగతి తెలసిందే. ప్రమాదానికి గురైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో తమిళనాడుకు చెందిన వారు అధికంగా ప్రయాణించారనే సమాచారంతో ఇక్కడున్న వారి బంధువుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ వారి జాడ కోసం హెల్ప్‌లైన్లను ఆశ్రయించారు. దీంతో మంత్రులు ఉదయ నిధి స్టాలిన్, శివశంకర్ నేతృత్వంలో ఐఏఎస్,ఐపీఎస్ అధికారుల బృందం ఒడిశాకు చేరుకుని తమిళుల జాడ కోసం అన్వేషణ మొదలెట్టింది. వారికి కావాల్సిన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పరిస్థితులో ఈ ప్రమాదం నుంచి బయట పడ్డ తమిళనాడుకు చెందిన వారు 55 మంది శనివారం రాత్రి సమయానికి చెన్నైకు విమానాల్లో చేరుకున్నారు. ఒడిశా నుంచి వచ్చిన ప్రత్యేక రైలులో ఆదివారం వేకువ జామున 137 మంది వచ్చారు. వీరి కోసం రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 29 మందికి వైద్య చికిత్సలు నిర్వహించారు. ముగ్గురిని మాత్రం రాజీవ్ గాంధీ జీహెచ్‌కు అంబులెన్స్‌లలో తరలించారు. వీరిలో ఒకరు మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారు. చెన్నైకు చేరుకున్న ప్రయాణికులను వారి వారి స్వస్థలాలకు ప్రత్యేక వాహనాలలో అధికారులు తరలించారు. మంత్రులు కేకేఎస్ఎస్ ఆర్ రామచంద్రన్, ఎం. సుబ్రమణియన్ దగ్గరుండి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను పరామర్శించి, వివరాలను సేకరించారు.

ఫలించిన ప్రయత్నాలు కోర మండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం నిమిత్తం తత్కల్ ద్వారా టికెట్ బుక్ చేసిన వారిలో 8 మంది తమిళనాడు వాసుల సమాచారం మొదట లభించ లేదు. దీంతో వీరికోసం టెన్షన్ మొదలైంది. అయితే సాయంత్రం వీరందరి జాడను అధికారులు గుర్తించారు. వీరంతా ఇప్పటికే సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకున్నట్లు తేలింది. దీంతో మంత్రులు, అధికారుల బృందం రాష్ట్రానికి తిరుగు ప్రయాణమైంది.

దేవుడి దయతో బయట పడ్డాం..

చెన్నైకు చేరుకున్న ప్రయామికులు పలువురు మీడియాతో మాట్లాడుతూ దేవుడు దయతో అందరం బయట పడ్డామని ఉద్వేగానికి లోనయ్యారు.

ఉదయ నిధి ఆవేదన..

ఒడిశాలో మంత్రి ఉదయ నిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ, తమిళులను సురక్షితంగా రాష్ట్రానికి పంపించడమే లక్ష్యంగా తాము చేపట్టిన చర్యలకు ఒడిశా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించిందని తెలిపారు. అన్ని ఆసుపత్రులకూ తమను తీసుకెళ్లారని, మార్చురీలలో ఉంచిన మృతదేహాలను సైతం పరిశీలించామని వివరించారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను చూసి హృదయం బరువెక్కిందన్నారు. బీ3, బీ4, ఎస్–2 బోగీల్లో ప్రయాణించిన వారు సురక్షితంగా తమిళనాడుకు చేరుకున్న దృష్ట్యా, ఈ ఆరుగురు సురక్షితంగా ఉండే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయన్నారు. ఒడిశా హెల్ప్‌లైన్‌లో సాయం కోసం తమిళులు ఎవరూ ఇంత వరకు అభ్యర్థించలేదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం ఇకనైనా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.



చెన్నై చేరుకున్న ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణియన్

తిరుపూత్తరుకు చెందిన లారీ డ్రైవర్‌గాంధీ(45) జీహెచ్‌లో చికిత్స పొందుతూ, మీడియాతో మాట్లాడారు. తన సంస్థ పని మీద ఒడిశాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం బారిన పడ్డట్టు పేర్కొన్నాడు. తాను రైలు కిటికీలను గట్టిగా తాను పట్టుకోవడంతో స్వల్ప గాయాలతో బయట పడినట్లు వివరించాడు. పూందమల్లికి చెందిన ఇంజినీరు మురుగన్ పేర్కొంటూ, వీసా పని నిమిత్తం తాను కోల్‌కతాకు వెళ్లి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని, అదృష్టవశాత్తూ బయట పడ్డట్టు తెలిపారు. కాశిమేడుకు చెందిన ధరణి మాట్లాడుతూ తన జీవిత కాలంలో ఇలాంటి ప్రమాదాలు టీవీల్లో కూడా చూడలేదని, ప్రత్యక్షంగా ఎదుర్కొన్నానని కన్నీటి పర్యంతమయ్యారు. తాంబరానికి చెందిన శివరంజని పేర్కొంటూ, తన భర్త సతీష్‌కుమార్ సీఆర్‌పీఎఫ్ జవానుగా కోల్‌కతలో పనిచేస్తున్నారని, వేసవి సెలవుల దృష్ట్యా, చెన్నై నుంచి పిల్లలు, స్నేహితుల కుటుంబంతో కలిసి నెల రోజులు అక్కడే ఉన్నామన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగిందని, ప్రాణాలతో తాము బయట పడ్డామని, అతి కష్టం మీద రైలు నుంచి కిందికి దిగాల్సి వచ్చిందన్నారు. బయట చూస్తే ఘోరాతి.. ఘోరంగా పరిస్థితి ఉండడం మనసును కలచి వేసిందన్నారు.

క్లుప్తంగా

అతిగా మద్యం తాగి పూజారి మృతి

• మరొకరి పరిస్థితి విషమం

తిరువొత్తియూరు: మదురై జిల్లాలో అతిగా మద్యం తాగిన పూజారి స్పృహ తప్పి మృతి చెందారు. మరొకరికి అత్యవసర చికిత్స చేస్తున్నారు. వివరాలు.. మదురై జిల్లా దారిపట్టికి చెందిన పనయన్ (45). ఇతను పెరియ నాచియమ్మన్ ఆలయంలో పూజారి. అదే ఊరికి చెందిన కరుత్తమొండి (43)తో కలుసుకుని శనివారం మధ్యాహ్నం కిటారిపట్టిలోని టాస్మాక్ దుకాణంలో ఇద్దరూ మద్యం కొని తాగారు. కొద్దిసేపటికే ఇద్దరూ స్పృహతప్పి పడిపోయారు. ఇరుగుపొరుగు వారిద్దరినీ రక్షించి చికిత్స నిమిత్తం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పనయన్‌ మృతి చెందాడు. కరుత్తమొండి అత్యవసర విభాగంలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు బాధితులు మద్యం కొనుగోలు చేసిన టాస్మాక్ దుకాణంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శవపరీక్ష నివేదిక వచ్చిన తర్వాతే పనయన్ మృతికి గల కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

చెన్నై టూ కాశి సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్ర చేపట్టిన ముత్తుకుమార్

తిరుత్తణి: మనశ్శాంతి కోసం చెన్నై టూ కాశి సైకిల్‌యాత్ర చేపట్టినట్లు కూరగాయల వ్యాపారి ముత్తుకుమార్ తెలిపారు. వివరాలు.. బెంగళూరుకు చెందిన ముత్తుకుమార్ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ భార్య, ఇద్దరు ఆడబిడ్డలతో కలిసి జీవనం సాగించేవారు. పాతికేళ్ల నుంచి కూరగాయల వ్యాపారానికే కాలం సరిపోవడంతో మనశ్శాంతి కోసం చెన్నై నుంచి కాశికి సైకిల్‌యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి తిరుపతి జాతీయ రహదారి మార్గంలో ఆదివారం తిరుత్తణికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ముత్తుకుమార్ మాట్లాడుతూ.. కాశీ యాత్రకు వెళ్లాలన్నది తన ఆశయమని అందుకోసమే సైకిల్ యాత్ర ప్రారంభించానని వెల్లడించాడు.

తాగునీటిని కలుషితం చేస్తే కఠిన చర్యలు

• హెచ్చరించిన శివ్‌దాస్‌మీనా
• పూండీ రిజర్వాయర్‌ను పరిశీలించిన అధికారుల బృందం



పూండీ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి శివ్‌దాస్‌మీనా నేతృత్వంలోని అధికారుల బృందం

తిరువళ్లూరు: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే పూండీ సత్యమూర్తీ సాగర్ రిజర్వాయర్, కృష్ణా కాలువ, లింక్‌కాలువల్లో మురుగు నీటిని వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి శివ్‌దాస్‌మీనా హెచ్చరించారు. చెన్నైకు తాగునీటిని అందించే పూండీ సత్యమూర్తీ సాగర్ రిజర్వాయర్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి శివ్‌దాస్‌మీనా, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తదితరులు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌లోని నీటి నిల్వం శాతంపై ఆరా తీశారు. ప్రస్తుతం పూండీ, చెమరంబాక్కం, రెడ్‌హిల్స్, చోళవరం, కన్నన్‌కోట్టైతేరువాయి కండ్రిగ తదితర ప్రధాన రిజర్వాయర్‌ల నీటి మట్టంపై ఆరా తీశారు. రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు వచ్చే ఆరు నెలలకు సరిపోతుందని, తాగునీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అనంతరం 8, 9 షట్టర్‌ల నుంచి తరచూ నీరు లీకేజీ అవుతున్న నేపథ్యంలో మర్మమతులు చేయడానికి ఉన్న అవకాశంపై ఆరా తీశారు. ప్రస్తుతం పూండీలో 1222 మిలియన్ ఘనపుటడుగుల నీరు నిల్వ ఉంది. దీంతో షట్టర్‌లను మర్మమతులు చేయడానికి అవకాశం లేదని పీడబ్ల్యూడీ అధికారులు వివరించగా, వచ్చే ఏడాదిలోపు నీరు తగ్గితే వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పాటు పూండీ రిజర్వాయర్‌లో పేరుకపోయిన చెత్తకుప్పలు, ప్లాస్టిక్ వస్తువులు, ముళ్లపొదలను తొలగించాలని కూడా ఆదేశించారు. తాగునీరు వెళ్లే కాలువల్లో చెత్త వేయకుండా అక్కడక్కడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి తరచూ పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కాలువ ఇరువైపులా దెబ్బతిన్న ప్రాంతాలను సైతం గుర్తించి మర్మమతు పనులు చేపట్టాలన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముత్తయ్య, పాదుపనితిలగం, రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైలో భక్తుల రాస్తారోకో



గిరివలయానికి వస్తున్న భక్తులు

• అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్

వేలూరు: తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయంలో వైగాసి మాస పౌర్ణమిని పురస్కరించుకొని అన్నామలైయార్ ఆలయంలో శనివారం రాత్రి స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా రాత్రి పూర్తిగా భక్తులు ఆలయం వెనుక వైపున ఉన్న మహా కొండ చుట్టూ సుమారు 14 కిలో మీటరు దూరం కాలినడకన వచ్చి ఆలయానికి చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ఆలయ క్యూలలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో గిరివలయం వచ్చారు. రెండవ రోజైన ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు సుమారు లక్షల సంఖ్యలో గిరివలయం వచ్చారు. ఈ నేపథ్యంలో గిరివలయం ముగించుకున్న భక్తులు వారి గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. అయితే సరైన బస్సు సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా దిండివనం, పుదుచ్చేరి వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్టాండ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అదనపు బస్సులు లేక పోవడంతో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు ఉన్న ఫలంగా దిండివనం రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న అధికారులు భక్తులతో చర్చించి రాస్తారోకోను విరమింప జేశారు. అదే విధంగా తిరువణ్ణామలై రైల్వే స్టేషన్‌లోనూ భక్తులతో కిటకిటలాడింది.

సస్పెండ్ అయిన పోలీసు ఆత్మహత్య

కొరుక్కుపేట: అరియలూరు జిల్లా అనంతవాడి ప్రాంతానికి చెందిన అన్బు(30) నాలుగేళ్ల క్రితం తమిళనాడు పోలీసు శాఖలో శిక్షణ పొందాడు. అయితే అప్పటికే అతడిపై కేసు ఉందనే విషయాన్ని దాచిపెట్టినందున.. శిక్షణ కాలంలోనే పోలీస్ హెడ్ క్వార్టర్స్ అతడిని సస్పెండ్ చేసింది. దీంతో అప్పటి నుంచి విల్లుపురం జిల్లా వానూర్ తాలూకా పుతురైలో లారీ బుకింగ్ కార్యాలయంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో తాను ఉంటున్న లారీ బుకింగ్ ఆఫీస్ ఫ్లోర్ పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కదిర్గామం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకున్న అన్బుకు ఇంకా పెళ్లి కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరోవిల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మందలించాడని..

• మూడేళ్ల కుమార్తె సహా మహిళా ఇంజినీర్ ఆత్మహత్య



శరణ్య, జిష్ణు (ఫైల్)

తిరువొత్తియూరు: ఉద్యోగం చేయడానికి వెళ్లొద్దని భర్త మందలించడంతో ఓ మహిళా ఇంజినీర్ తన మూడేళ్ల చిన్నారితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. కాంచీపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెట్టికులం ఎన్జీవో కాలానికి చెందిన మదన్ కుమార్ (30). ఇతను సొంతంగా కారు కలిగి నడుపుతున్నాడు. ఇతని భార్య శరణ్య (24). వీరి కుమార్తె జిష్ణు(3). శరణ్య ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. కొద్ది రోజుల క్రితం జ్ఞాపకశక్తి సామర్థ్యం కలిగించే శిక్షణ కేంద్రంలో పనికి వెళుతున్నారు. అయితే పనికి వెళ్లే బిడ్డను చూసుకునే వారు లేకపోవడంతో మదన్ కుమార్, అతను భార్య శరణ్యను పనికి వెళ్లవద్దని చెప్పాడు. ఈ కారణంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో విరక్తి చెందిన శరణ్య తన చిన్నారి జిష్ణును ఉరి వేసి.. తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శివకంచి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శరణ్య, జిష్ణు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు ఆమె కుటుంబం సభ్యులతో పాటు అతని బంధువులను ప్రశ్నిస్తున్నారు.

బస్సు ఢీ కొని వృద్ధురాలి మృతి

అన్నానగర్: చెన్నై పొన్నియమ్మన్‌మేడు పార్క్ ఫారెస్ట్ ఎస్టేట్‌కు చెందిన పచ్చయమ్మాళ్ (60). ఈమె ఆదివారం ఉదయం పొన్నియమ్మన్ మేడు నుంచి బస్సులో మింట్ బస్టేషన్‌కు మాత్రలు, మందుల కొనుగోలు చేసేందుకు వచ్చింది. అనంతరం మింట్ ప్రాంతం నుంచి స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి వెళ్లేందుకు అక్కడి బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా.. అక్కడికి వచ్చిన సిటీ బస్సు (నెం.57)ఒక్కసారిగా పచ్చయమ్మాళ్‌ను ఢీ కొట్టింది. ఆంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ప్రమాదానికి కారణమైన అదే బస్సులో పచ్చయమ్మాల్‌ను రక్షించి స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చెరువులో మునిగి బాలిక మృతి

తిరువొత్తియూరు: ధర్మపురి జిల్లాలో చేపలు పట్టేందుకు చెరువులో దిగిన ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు.. ధర్మపురి జిల్లా మెణసికి చెందిన తీర్థగిరి (41). ఇతని భార్య సంగీత (40). వారికి పిల్లలు లేరు. దీంతో కెలవల్లి గ్రామానికి చెందిన సంగీత సోదరుడు సెంథిల్‌కు పుట్టిన ఆడబిడ్డను 12 సంవత్సరాలు క్రితం తీర్థగిరి–సంగీత దంపతులు దత్తత తీసుకుని దివ్యదర్శిని అని పేరు పెట్టారు. దివ్యదర్శిని (12) ప్రస్తుతం 6వ తరగతి పూర్తి చేసింది. వేసవి సెలవులు కావడంతో శనివారం ఉదయం దివ్యదర్శిని తన స్నేహితులతో కలిసి సమీపంలోని పులియంగుట్టాయి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లింది. అయితే అనూహ్యంగా విద్యార్థిని లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీట మునిగి మృతి చెందింది.

వృద్ధుడి ఆత్మహత్య

అన్నానగర్: చెన్నైలోని పెరంబూర్ ప్రాంతంలో మదురైస్వామి మేడం వీధికి చెందిన సుధాకరన్ (65). కొడుకు రమేష్‌తో కలిసి ఉంటున్నాడు. ఇతని భార్య కొన్ని నెలల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో సుధాకరన్ కొన్ని నెలలుగా తీవ్ర డిప్రెషన్‌లో ఉన్నాడు. శనివారం రాత్రి ఇంటి వద్ద వాటర్ ట్యాంక్ ఇనుప నిచ్చెనకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మంటలు వ్యాపించి కారు దగ్ధం

• దెబ్బతిన్న ఐదు ద్విచక్ర వాహనాలు

తిరువొత్తియూరు: చెన్నై అడయారు వద్ద రోడ్డుపై వెళుతున్న సమయంలో కారులో హఠాత్తుగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. వివరాలు.. చెన్నై సమీపంలోని కోవిలంబాక్కం ప్రాంతానికి చెందిన సురేష్ కుమార్ (44) దివ్యాంగుడు. చెన్నైలోని తేనాంపేటైలో స్నేహితుడి వద్దకు వెళ్లేందుకు తన సోదరుడి కారును తీసుకున్నారు. కారును సురేష్ కుమార్ మరో స్నేహితుడు బాబు నడుపుతున్నాడు. వారు శనివారం మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో అడయార్ ఎల్బీ రోడ్డు చేరుకున్నారు. ఆ సమయంలో కారులోంచి పొగ బయటకు వచ్చింది. వెంటనే కారులోని వారు కిందికి దిగేశారు. తర్వాత కొద్దిసేపటికే మంటలు చెలరేగాయి. అనంతరం మంటలు కారు మొత్తం వ్యాపించాయి. ఈ క్రమంలో ఫ్లైఓవర్ కింద పార్క్ చేసి ఉన్న ఐదు ద్విచక్రవాహనాలకు కూడా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న మైలాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. మోటార్ సైకిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. సకాలంలో కారులోంచి కిందకు దిగడం వల్ల సురేష్‌కుమార్, అతని స్నేహితుడు బాబు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

కోలీవుడ్ టాక్స్

అజిత్ 62వ చిత్రం ఎప్పుడో..?



దర్శకుడు మగిళ్ తిరుమేణి, అజిత్

తమిళసినిమా: నటుడు అజిత్ కథానాయకుడిగా నటించిన తుణివు చిత్రం విడుదలై ఏడాదిన్నర కాబోతోంది. ఈ చిత్రంతో పాటు నటుడు విజయ్ నటించిన వారీసు చిత్రం విడుదలైంది. కాగా విజయ్ తదుపరి చిత్రం ప్రారంభం కావడడంతో పాటు షూటింగ్‌కూడా పూర్తి చేసుకోబోతోంది. అయితే అజిత్ తాజా చిత్రం ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఆయన 62వ చిత్రాన్ని ఏ ముహూర్తాన ప్రకటించారో గానీ పలు సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ చిత్రానికి నయనతార భర్త దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించాల్సి ఉంది. కథ సిద్ధమైంది. ఇక సెట్‌పైకి వెళ్లటమే తరువాయి అనుకుంటున్న తరుణంలో అనూహ్యంగా ఈ చిత్రం నుంచి విఘ్నేష్ శివన్ వైదొలిగారు. ఆయన స్క్రీన్‌ప్లే లైకా ప్రొడక్షన్స్ అధినేతకు, అజిత్‌కు సంతృప్తిని కలిగించకపోవడం కారణమని తెలిసింది. ఆ తరువాత చిత్ర కథ మారింది. దర్శకుడు మారారు. అనూహ్యంగా దర్శకుడు మగిళ్ తిరుమేణి తెరపైకి వచ్చారు. ఈయన చెప్పిన కథ నచ్చడంతో లైకా ప్రొడక్షన్స్ చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమైంది. అజిత్ పుట్టినరోజు సందర్భంగా మే 1వ తేదీన విడాముయర్చి అని చిత్ర టైటిల్ వెల్లడించారు. దీంతో షూటింగ్ ప్రారంభం అవుతుందని అందరూ భావించారు. అలాంటి సమయంలో విదేశీ బైక్ ప్రయాణానికి వెళ్లిపోయారు. ఇటీవలే ఆయన తిరిగి రావడంతో జూన్ తొలి వారంలో విరామం వీడి చిత్ర షూటింగ్ మొదలవుతుందని ప్రచారం జరిగింది. ఇందులో నటి త్రిష నాయకిగా నటించబోతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే అలా జరగలేదు. తాజా సమాచారం ప్రకారం అజిత్, దర్శకుడు మగిళ్ తిరుమేణి ప్రస్తుతం లండన్‌లో మకాం పెట్టినట్లు తెలిసింది. విడాముయర్చి చిత్ర షూటింగ్ గురించి చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ చిత్ర షూటింగ్‌ను పలు దేశాల్లో నిర్వహించనున్నట్లు, ఈ నెల చివరిలో షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో నటుడు అజిత్ రెండు విభిన్న గెటప్‌లలో కనిపిస్తున్నట్లు సమాచారం.

లాస్ ఏంజిల్స్‌లో..



తమిళసినిమా: విశ్వ నటుడు కమలహాసన్ కథానాయకుడిగా నటించి తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించిన విక్రమ్ చిత్రం సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. కాగా ఈ చిత్రం విడుదలై ఏడాది అయ్యింది. కమల్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో ఇండియన్–2 చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. 1996లో విడుదలై సూపర్ హిట్ అయిన ఇండియన్ చిత్రానికి సీక్వెల్ ఇది. అంటే సుమారు 27 సంవత్సరాల తరువాత సేనాపతి (ఇండియన్ చిత్రంలో కమలహాసన్ పాత్ర పేరు) మళ్లీ అవినీతి, అక్రమాలపై పోరాటానికి సిద్ధమయ్యారన్నమాట. ఈ చిత్రంలో సేనాపతిగా మారడానికి కమలహాసన్ మేకప్ కోసమే కనీసం ఐదారు గంటలు పడుతుందని సమాచారం. కాగా ఇంతకుముందు విడుదలైన ఇండియన్ చిత్రం ఘన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఇండియన్–2 చిత్రంపై అంచనాలు భారీగానే ఉంటాయి. వాటిని రీచ్ అవ్వాలంటే ఈ చిత్రం మరింత బ్రహ్మాండంగా ఉండాలి. కాగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ కొన్ని అవాంతరాలను అధిగమించి ఇప్పుడు శరవేగంగా జరుపుకుంటోంది. కాగా చెన్నైలో నిర్వహిస్తున్న షూటింగ్ షెడ్యూల్ ఇటీవలే పూర్తి చేసుకుంది. కాగా మరో 10 రోజులు షూటింగ్‌తో మొత్తం పూర్తి అవుతుందని సమాచారం. కాగా ఇండియన్–2 చిత్రానికి సంబంధించిన మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజిల్స్‌లో నిర్వహించతలపెట్టినట్లు తెలిసింది. దీంతో ఈ చిత్ర యూనిట్ త్వరలో లాస్ ఏంజిల్స్‌కు బయలుదేరనున్నట్లు సమాచారం.

డెన్మార్క్‌లో సూర్య, జ్యోతిక



డెన్మార్క్‌లో అభిమానులతో సూర్య, జ్యోతిక దంపతులు

తమిళసినిమా: కోలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ సినీ దంపతులు సూర్య, జ్యోతిక. సూర్య ప్రస్తుతం కంగువా అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. టి.శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు భారీ ఎత్తున చిత్రం ఇది. త్రీడీ ఫార్మెట్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో సూర్య పలు గెటప్పుల్లో కనిపించనున్నారు. చారిత్రక కథాంశంతో బహు భాష చిత్రంగా తెరకెక్కుతున్న దీనికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే చాలా వరకు షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన కంగువా చిత్ర టైటిల్‌కు, మోహన్ పోస్టర్స్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో ఇప్పటి నుంచి ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా నటుడు సూర్య, జ్యోతిక జంట తాజాగా వేసవి విడిది కోసం డెన్మార్క్‌కు వెళ్లారు. అయితే అక్కడ కూడా వారిని అభిమానులు వదలలేదు. సూర్య, జ్యోతిక తమ అభిమానులతో దిగిన ఫోటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా డెన్మార్క్ విహార పర్యటనను పూర్తి చేసుకుని చెన్నైకి తిరిగి వచ్చిన తరువాత నటుడు సూర్య కంగువా చిత్రం తదుపరి షెడ్యూల్ షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం.

శివాజీ గణేషన్ తొలి అభిమాని కలైంజ్ఞర్



దయానిధి మారన్, ప్రభు, కనిమొళి

తమిళసినిమా: దివంగత మహానటుడు శివాజీ గణేషన్ తొలి అభిమాని కలైంజ్ఞర్ కరుణానిధి అని డీఎంకే పార్టీ ఉప కార్యదర్శి, పార్లమెంటు సభ్యురాలు కనిమొళి పేర్కొన్నారు. కరుణానిధి శత జయంతి సందర్భంగా డీఎంకే పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం శివాజీ గణేషన్ కథానాయకుడిగా నటించిన పరాశక్తి చిత్రాన్ని స్థానిక రాయపేటలోని ఉడ్‌ల్యాండ్ థియేటర్లో ప్రదర్శించారు. ఈ చిత్రానికి కరుణానిధి సంభాషణలు అందించడం గమనార్హం. కాగా ఈ చిత్ర ప్రదర్శనకు కనిమొళి, దయానిధి మారన్, పూచి మురుగన్ మొదలగు పలువురు సినీ రాజకీయ ప్రముఖులు విచ్చేశారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ శివాజీ గణేషన్‌కు తొలి అభిమాని కలైంజ్ఞర్ అని చెప్పవచ్చును. శివాజీ గణేషన్ ఎలా నటిస్తున్నారో చూడు అంటూ ఇంటిలో టీవీ చూస్తూ వెళ్లి అమాంతం టీవీకి ముద్దుపెట్టేవారని చెప్పారు. అలాంటప్పుడు తన తల్లి కూడా పరిహాసం ఆడేవారని అయినా శివాజీ గణేషన్ నటన చూసి కరుణానిధి నిగ్రహించుకునేవారు కాదన్నారు. కథానాయకులకు బహు తెలివిని, మార్గదర్శకాన్ని చూపిన చిత్రం పరాశక్తి అని పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పటికీ పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేసే వారిగానే కథానాయకిలు ఉన్నారని, అయితే అప్పటి కథానాయకి పాత్రలు ఆలోచింపచేసేవిగానూ, సామాజిక సందేశాన్ని ఇచ్చేవి గానూ ఉండేవని అభిప్రాయపడ్డారు.

అలాంటి చిత్రాలపై నమ్మకం లేదు

తమిళసినిమా: కట్టా కుస్తీ చిత్రంతో తమిళంలో పాపులర్ అయిన మలయాళీ నటి ఐశ్వర్య లక్ష్మి. ఇటీవల పొన్నియిన్ సెల్వన్ చిత్రంలోనే మెరిసిన ఈమె మాతృభాషలో నిర్మాతగానూ కొనసాగుతున్నారన్నది గమనార్హం. అక్కడ గార్గి వంటి పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. ఈమె ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాలపై తనకు పెద్దగా నమ్మకం లేదన్నారు. కారణం స్త్రీల జీవితంలో పురుషులకు ప్రాముఖ్యత ఉంటుందన్నారు. కాబట్టి స్త్రీ పురుషులకు మానత్వం కలిగిన కథలతో కూడినదే మంచి చిత్రాలన్నది తన భావన అన్నారు. అలా కాని చిత్రాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. సినిమా అనేది మన జీవితాలను, సమాజాన్ని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. కాబట్టి సినిమాల్లోనైనా, మన జీవితాల్లో నైనా సమానత్వం ఉండాలన్నారు. మరో విషయం ఏమిటంటే తాను ఈ రంగంలోకి ప్రవేశిస్తాననే ఊహించలేదన్నారు. వైద్య విద్యను పూర్తి చేసిన తాను సినిమాల్లో రావడం అన్నది దైవ నిర్ణయమే అన్నారు. కారణం తాను నటి నవుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. తాను చదువుకు ప్రాముఖ్యత వచ్చే కుటుంబంలో పుట్టానన్నారు. వారికి సంబంధించినంత వరకు చదువు పూర్తి చేసి మంచి ఉద్యోగం చేయడమే సమాజంలో ఉన్నతస్థాయి అని పేర్కొన్నారు. సినిమా అలాంటి గౌరవాన్ని ఇచ్చేదిగా వారు భావించలేదన్నారు. నిజం చెప్పాలంటే సినిమాలో కొనసాగడం అనేది ప్రతినిత్యం పోరాటమేనని నటి ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు.



నటి ఐశ్వర్య లక్ష్మి

క్లుప్తంగా

నర్సింగ్ విద్యార్థిని ఆత్మాహుతి

తిరువొత్తియూరు: ప్రేమకు తల్లిదండ్రులు తిరస్కరించడంతో నర్సింగ్ కళాశాల విద్యార్థిని శరీరానికి నిప్పు అంటించుకుని ఆత్మాహుతి చేసుకుంది. కరూర్ పశుపతిపాలెం, సెల్వ నగర్‌లో నివాసం ఉంటున్న కార్తీక్ కుమార్తె గాయత్రి (22) కరూర్‌లో నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. గాయత్రి రెండు సంవత్సరాలుగా ఓ యువకుడిని ప్రేమిస్తోంది. ఇందుకు తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో మనస్తాపానికి గురైన గాయత్రి కిరోసిన్ పోసుకుని అంటించుకుంది. అక్కడున్న వారు ఆమెను రక్షించి కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆమె శనివారం మృతి చెందింది.

కరుణ శతజయంతి ఉత్సవాలు



అమ్మయార్‌కుప్పంలో స్వీట్లు పంచుతున్న డీఎంకే శ్రేణులు

పళ్లిపట్టు: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాలను డీఎంకే శ్రేణులు ఆదివారం కోలాహలంగా జరుపుకున్నారు. ఆర్కేపేట వెస్ట్ యూనియన్ డీఎంకే కార్యదర్శి షణ్ముగం అధ్యక్షతన అమ్మయార్‌కుప్పం బస్టాండులో నిర్వహించిన వేడుకల్లో అన్నాదురై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అలంకరించిన కరుణానిధి చిత్రపటానికి డీఎంకే శ్రేణులు నివాళులర్పించి స్వీట్లు పంచిపెట్టారు. పంచాయతీ సర్పంచ్ ఆనంది, మండల డీఎంకే నాయకులు సెంగుట్టువన్, పెరుమాళ్, శ్రీనివాసన్, రవి పాల్గొన్నారు.

వైభవంగా పున్నమి గరుడ సేవ



గరుడుడిపై ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పున్నమి గరుడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. ఉదయం కల్యాణ మండపంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ చేశారు. రాత్రి పౌర్ణమి సందర్భంగా స్వామి వారు ఉభయదేవేరులతో కలిసి గరుడుడిపై కొలువై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

సనాతన ధర్మ పరిరక్షణే వైశ్య యూత్ పరిషత్ లక్ష్యం

తిరుపతి కల్చరల్: సనాతన ధర్మాన్ని కాపాడడంతో పాటు గోసేవను మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ పనిచేస్తోందని పరిషత్ తిరుపతి శాఖ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఆయన ఆదివారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ రాష్ట్ర శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లోని వైశ్యుల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు మురం శెట్టి రాములు ఫౌండర్ చైర్మన్‌గా ప్రారంభమైన ఈ సంస్థకు ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా రాచపల్లి బాలాజీ, కార్యదర్శిగా పెడబల్లె వికాస్, కోశాధికారిగా పుట్టా శివప్రసాద్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కర్ణాటక శాఖ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సభ్యులు ప్రసన్న, కార్తీక్, ఈశ్వర్, రాజు, మనోహర్, రాజేష్, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోషకాహార భద్రతపై జాతీయ సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజులు వ్యవసాయ పరిశోధన–పోషకాహార భద్రత అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరగనుంది. ఈ మేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పీజీ డీన్ గుత్తా రామారావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అలాగే దేశంలోని వివిధ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు, రాష్ట్రాల వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులు సుమారు 500 మందికి పైగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో భాగంగా పరిశోధక విద్యార్థులు ఆహార భద్రత–పోషకాహారంకై వివిధ పంటల్లో నూతన రకాల రూపకల్పన, ఆధునిక సాగు పద్ధతులు, పంటల ఆరోగ్య సంరక్షణలో వినూత్న మెళకువలు, వాతావరణ మార్పులపై పరిశోధన, వాతావరణ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతిక అభివృద్ధి, పశుపోషణలో మెళకువలు, రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

సంగీత ప్రపంచంలో రారాజు ఎస్పీబీ





బాలుకు నివాళులర్పిస్తున్న కెఎం కొండయ్య, విలియమ్స్, బాలాజీ రావు, రచయిత బొందల నాగేశ్వరరావుకు ఎస్పీబీ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

- జయంతి వేడుకల్లో వక్తలు వ్యాఖ్య
- పేదలకు, విద్యార్థులకు సహాయకాలు
- ఎస్పీబీ పాటలతో అలరించిన సంగీత కచేరి

కొరుక్కుపేట: సినీ సంగీత ప్రపంచంలో రారాజు ఎస్పీ బాలసుబ్రమణ్యం అని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్పీ బాల సుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎస్పీ బాలసుబ్రమణ్యం 77వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాల ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ వేడుకలకు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేఎం కొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎస్పీ బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ తరపున పేద మహిళలకు నూతన వస్త్రాలు, పేద తెలుగు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కేఎం కొండయ్య మాట్లాడుతూ మధుర గాయకుడు ఎస్పీబీ పాట భూమిమీద సంగీతం ఉన్నంతకాలం సజీవంగా నిలిచే ఉంటుందన్నారు. అన్ని భాషల్లో 50 వేలకు పైగా పాడిన బాలు తెలుగు వారు కావడం గర్వకారణమన్నారు. ఇందులో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు పిఆర్ కేశవులు, సినీ దర్శకులు, నిర్మాత జిస్పి రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీతం, విద్య, సామాజిక సేవలో రాణిస్తున్న ప్రముఖులు 250కి పైగా రచనలు చేసిన రచయిత బొందల నాగేశ్వర రావుకు, గాయకులు ఈ.పెంచలయ్య తదితరులకు ఎస్పీబీ పురస్కారాలతో సత్కరించారు. పిఆర్ కేశవులు మాట్లాడుతూ ఎస్పీబీ గురించి ఎంత చెప్పినా తక్కువే అని సంగీతాన్ని నేర్చుకోక పోయినా విశ్వ విఖ్యాతి గాంచిన గాయకుడుగా ఎదిగారని అన్నారు. ఎస్పీబీ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి కళా సేవతో పాటు సామాజిక సేవ చేయడం అభినందనీయం. ఈ సందర్భంగా సంఘానికి రూ.5 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. కార్యక్రమంలో ఉత్తమ కవి, పండిట్ జయరామ్, రచయిత చల్లగాలి బాబు రావులు ఎస్పీబీపై కవితలను చదివి వినిపించి ఆకట్టుకున్నారు. అలాగే లయా ఆర్కెస్ట్రా నిర్వాహకులు, సంఘం కార్యదర్శి వై ఏ విలియమ్స్ నేతృత్వంలో ఎస్పీబీ పాటల విభావరి నిర్వహించారు. గాయకులు ఎంఆర్ సుబ్రమణ్యం తదితరులు బాలు పాటలు పాడి అలరించారు. సంఘం అధ్యక్షుడు సిసిహెచ్ మోహన్ రావు, కోశాధికారి బాలాజీ రావు, జాయింట్ సెక్రటరీ దుర్గా ప్రసాద్, గాయకులు పెంచలయ్య, పెద్ద సంఖ్యలో ఎస్పీబీ అభిమానులు పాల్గొన్నారు.

బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు

వేలూరు: నాట్రంబల్లి సమీపంలో బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు అన్ని జిల్లాల్లోను చైల్డ్ హెల్ప్‌లైన్లను అధికారులు ప్రారంభించారు. వీరు బాల్య వివాహాల గురించి సమాచారం వస్తే అధికారులు వెంటనే సంబంధిత ప్రాంతానికి వెళ్లి వివాహాలను నిలుపుదల చేస్తారు. తిరుపత్తూరు జిల్లా నాట్రంబల్లి సమీపంలోని కొత్తూరుకు చెందిన వీరమణి(32)కి వాణియంబాడి సమీపంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక(14)కు వివాహం జరగనున్నట్లు గతనెల 31వ తేదీన చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. తహసీల్దార్ కుమార్ అధ్యక్షతన అధికారుల బృందం, నాట్రంబల్లి పోలీసులు నాట్రంబల్లి గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. ఆ సమయంలో అక్కడ వివాహం జరగలేదని, గృహ ప్రవేశం జరుగుతుందని అధికారులకు తెలిపారు. మరుసటి రోజున వీరమణితో పాటు 14 సంవత్సరాల చిన్నారికి అదే ప్రాంతంలోని ఆలయంలో వివాహం జరిగింది. దీనిపై తాలూకా కార్యాలయానికి శనివారం సాయంత్రం సమాచారం వచ్చింది. తహసీల్దార్ కుమార్ అధ్యక్షతన అధికారుల బృందం విచారణ జరపగా బాల్య వివాహం చేసినట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి పెళ్లి కొడుకు వీరమణిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

నకిలీ ఆభరణాలతో రూ.1.66 లక్షల మోసం

అన్నానగర్: చెన్నైలోని వ్యాసర్‌పాడి ప్రాంతంలో ప్రైవేటు యాజమాన్యంలోని బంగారు ఆభరణాల తాకట్టు బ్రాంచ్‌లో బంగారు పూత పూసిన నగలు తాకట్టుపెట్టి రూ.1.66 లక్షలు మోసం చేసినట్టు గుర్తించారు. ఈ బ్రాంచ్‌లో సుకన్య (32) మేనేజర్‌గా పని చేస్తోంది. గత నెల 3వ తేదీన వ్యాసర్‌పాడి సామియార్ తోటం ప్రాంతానికి చెందిన రాధాకృష్ణన్ 40 గ్రాముల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.1.66 లక్షల రుణం తీసుకున్నాడు. గత నెల 2వ తేదీన బంగారు ఆభరణాల వాల్యుయార్ ఆభరణాలను తనిఖీ చేయగా ఆ నగలన్నీ బంగారు పూతపూసిన ఇత్తడి ఆభరణాలుగా గుర్తించి అవాక్కయ్యారు. అనంతరం సదరు వ్యక్తి చెప్పిన చిరునామాకు వెళ్లి పరిశీలించగా అది ఫేక్ అడ్రస్ అని గుర్తించి షాక్‌కు గురయ్యారు. ఫిర్యాదు మేరకు వ్యాసర్‌పాడి క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వానమామలై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై తనిఖీలు



కన్నూర్ వద్ద విచారణ చేపట్టిన తహసీల్దార్ మదియగళన్, ఎస్ఐ శక్తివేల్ తదితరులు

తిరువళ్లూరు: అనుమతి ఇచ్చిన ప్రాంతంలో మట్టితవ్వకాల ముసుగులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వచ్చిన సమాచారం ఆదివారం ఉదయం తహసీల్దార్ మదియళన్ నేతృత్వంలోని అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ కన్నూర్‌లోని పట్టా భూమిలో మట్టి తవ్వకాలకు ప్రభుత్వం మూడు నెలల క్రితం అనుమతి ఇచ్చింది. మట్టి తవ్వకాల ముసుగులో సమీపంలోని కూవం నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు వున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు రోజు కూడా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్టు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు ఫిర్యాదు అందింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ మదియగళన్, మప్పేడు ఎస్ఐ శక్తివేల్ తదితరులు కన్నూర్ వెళ్లి మట్టి తవ్వకాలను నిలిపి వేయాలని ఆదేశించారు. సోమవారం ఉదయం ముగ్గురు సర్వేయర్లలో కూడిన బృందం సంబంధిత ప్రాంతాన్ని సర్వే చేయనున్నట్టు వివరించారు. నిబంధనలకు అనుగుణంగా తవ్వకాలు చేసి వుంటే అనుమతి ఇస్తామని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

యువతి ఆత్మహత్య

అన్నానగర్: ప్రేమించిన వ్యక్తితోకాకుండా మరొకరితో పెళ్లి చేయాలని తల్లిదండ్రులు చూడడంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. పుదువన్నార్‌పేటలోని నాగూరార్ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన రాము కూతురు సంధ్య (18) వన్నార్‌పేటలోని ఎంసీ రోడ్డులో ఓ బట్టల దుకాణంలో పని చేస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి ఏర్పాట్లు చేశారు. దీనిపై సంధ్య అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీనిపై సమాచారం అందుకున్న కాశిమేడు షిప్పింగ్ హార్బర్ పోలీసు అధికారి సంఘటనా స్థలానికి చేరుకుని సంధ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దర్యాప్తులో సంధ్య రెండేళ్లుగా తిరువొత్తియూరు రాజా దుకాణానికి చెందిన వ్యక్తిని ప్రేమిస్తున్నట్టు తేలింది. ఈ సందర్భంలో ఆమె తల్లిదండ్రులు పెళ్లికి ఏర్పాట్లు చేయడంతో సంధ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు.

డీబీసీ కేంద్రానికి తాళం వేయడంపై రైతుల నిరసన



తాళం వేసిన వేలంజేరి డీబీసీ కేంద్రం

తిరుత్తణి: తిరుత్తణిలో డీబీసీ కేంద్రానికి డీఎంకే నాయకుడు తాళం వేయడంపై రైతులు నిరసనకు దిగారు. తిరుత్తణి శివారులోని వేలంజేరిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం విక్రయిస్తున్నారు. అక్కడ డీఎంకే శ్రేణులు రైతుల నుంచి బస్తాకు రూ. 50 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సీజన్ పూర్తికావడంతో ధాన్యం బస్తాలను లారీల ద్వారా గిడ్డంగికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. డీఎంకే మండల కార్యదర్శి ఆర్తిరవి అక్కడికి చేరుకుని రైతుల నుంచి బస్తాకు రూ.50 చొప్పున వసూలు చేసిన కమీషన్ మొత్తం రూ.40 వేలు తనకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో డీబీసీ కేంద్రానికి తాళం వేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. తాము ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యంపై బస్తాకు రూ.50 ఇవ్వాలని డీఎంకే శ్రేణులు డిమాండ్ చేయడం దారుణమన్నారు. కమీషన్ ఇవ్వలేదని డీబీసీ కేంద్రానికి డీఎంకే మండల కార్యదర్శి ఆర్తిరవి తాళం వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సమస్యలు సృష్టిస్తున్న డీఎంకే శ్రేణులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

తండ్రి మద్యం మానలేదని కుమార్తె ఆత్మహత్య

తిరువొత్తియూరు: వేలూరు జిల్లాలో తండ్రి మద్యం తాగుడు మానకపోవడంతో విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వేలూరు జిల్లా చిన్న రాజకుప్పం గ్రామానికి చెందిన ప్రభుకు భార్య కర్పగం, కొడుకు ప్రకాష్, కుమార్తె విష్ణుప్రియ (16) ఉన్నారు. విష్ణుప్రియ ప్రస్తుతం పదవ తరగతి చదివింది. తండ్రి ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడు. శనివారం ఉదయం ప్రభు కూలి పనులకు వెళ్లాడు. కర్పగం ఉపాధి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో విష్ణుప్రియ ఇంటిలో ఉరివేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కర్పగం ఆమెను చూసి ఇరుగుపొరుగు వారి సాయంతో ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు బాలిక అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. గుడియాత్తం తాలూకా పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

బాలుడిపై లైంగిక వేధింపు

- బీజేపీ నాయకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై విల్లివాకంలో లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన విద్యార్థిపై లైగింక వేధింపులకు పాల్పడిన బీజేపీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని విల్లివాక్కం శివాలయం ప్రాంతంలో శనివారం రాత్రి ఓ బాలుడు ఏడుస్తున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని ప్రశ్నించారు. తాను విల్లివాక్కంలో వున్న పాఠశాలలో చదువుకుంటున్నానని, లిఫ్ట్ అడిగి ఒకరి బైక్ ఎక్కినట్టు తెలిపాడు. అతను తనపై లైంగికంగా వేధించినట్టు పేర్కొన్నాడు. కొందరు బాలుడు చెప్పిన విషయాలను సెల్ ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది వైరల్ అయింది. ఈ విషయం తెలుసుకున్న విల్లివాక్కం పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బాలుడిని వేధించిన అంబత్తూరు పశ్చిమ బీజేపీ బూత్ కమిటీ సభ్యుడు బాలచందర్ (47)ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కందిరీగ కుట్టడంతో విద్యార్థి మృతి

అన్నానగర్: కందిరీగ కుట్టడంతో చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాల్ కోవిల్ సమీపం హనుమంతపురం చట్రాస్ ప్రాంతానికి చెందిన మోహన్ రైతు కుమారుడు కార్తికేయ (16) మృతిచెందాడు. బాలుడు అదే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇతను ఆదివారం హనుమంతపురం చట్రాస్ ప్రాంతంలోని సరస్సు పక్కనే వున్న తాటిచెట్టు ఎక్కాడు. ఆ సమయంలో విషపూరిత మూన కందిరీగ కుట్టింది. నొప్పిని తట్టుకోలేక బాలుడు కేకలు వేశాడు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక కార్తికేయ మృతి చెందాడు. మరైమలై నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విధుల నుంచి ఇద్దరు పోలీసుల తొలగింపు

తిరువొత్తియూరు: తిరువారూర్ జిల్లాలో డ్యూటీలో వున్న సమయంలో రికార్డ్ డ్యాన్స్ చేసిన ఇద్దరు పోలీసులను డిస్మిస్ చేశారు. తిరువారూర్ జిల్లాలో ఇద్దరు పోలీసులు సహా ఐదుగురు సినిమా పాటకు డ్యాన్స్ చేసిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. దీనికి సంబంధించి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశం మేరకు జరిపిన విచారణలో పేరలం పోలీస్‌స్టేషన్‌లో ఫస్ట్ గ్రేడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న మణికండన్, ప్రభు పనివేళల్లో స్నేహితురాలి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని డ్యాన్స్ చేసినట్లు తేలింది. ఇద్దరు పోలీసులను పని నుంచి తొలగిస్తూ ఎస్పీ సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

కోర్టు ప్రాంగణంలో యువకుడిపై కత్తితో దాడి

తిరువొత్తియూరు: కోర్టులో విచారణ గదిలో సంతకం పెట్టడానికి వచ్చిన యువకుడిపై కత్తితో దాడి చేసిన దుండగుడిని పోలీసులు వెంటాడి అరెస్టు చేశారు. రామనాథపురం సమీపంలోని ఆర్.ఎస్ మడై ప్రాంతానికి చెందిన గోవిందరాజు కుమారుడు చంద్రు (23) 13వ తేదీన దుకాణంలో వుండగా శివం జ్ఞానపురం అశోక్ కుమార్ (29) తన ముగ్గురు అనుచరులతో కలిసి దాడి చేశాడు. దీనిపై చంద్రు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అశోక్ కుమార్‌ను అరెస్టు చేశారు. రామనాథపురం కోర్టులో హాజరై రోజూ సంతకం చేయాలనే నిబంధనపై అతనికి బెయిలు వచ్చింది. చంద్రుపై దాడి చేసిన విషయం తెలుసుకున్న బంధువు ఆర్.ఎస్ మడం ప్రాంతానికి చెందిన కుమార్ అలియాస్ కొక్కికుమార్ (26) ఆగ్రహం చెంది అశోక్ కుమార్‌పై దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు. గతంలో వారి మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం కోర్టులో సంతకం పెట్టడానికి వచ్చిన అశోక్ కుమార్‌పై కొక్కికుమార్ కత్తితో దాడి చేశాడు. గమనించిన పోలీసులు వెంటనే కొక్కి కుమార్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించారు. అప్పటికే అతను అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన అశోక్ కుమార్‌ను ఆసుపత్రిలో చేర్చారు. రామనాథపురం ఎస్పీ తంగదురై విచారణ చేశారు. నిందితుడిని పట్టుకోడానికి ప్రత్యేక బృందం పోలీసులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొక్కి కుమార్ సెల్ ఫోన్ నంబర్ ఆధారంగా అతన్ని వెంబడించారు. ఉచ్చిపులి పరప్పన వలసు వద్ద పట్టుకోడానికి ప్రయత్నించగా పోలీసులపై దాడి చేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ వేలు తుపాకీతో కొక్కి కుమార్ కాలిపై కాల్చి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి కొక్కికుమార్ అనుచరుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచారం కేసులో నిందితుడి అరెస్ట్

తిరువొత్తియూరు: ఉత్తరాది రాష్ట్రానికి చెందిన మోడల్‌ను చెన్నైలోని వ్యభిచార బ్రోకర్లకు విక్రయించేందుకు కారులో తీసుకొచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి కారు, 10 సెల్ ఫోన్లు, 2 స్వైపింగ్ మెషిన్లు, 37 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ వి.శంకర్ జివాల్ వ్యభిచార నిరోధక విభాగం పోలీసులను ఆదేశించారు. ఆ మేరకు రహస్య సమాచారం మేరకు వ్యభిచార నిరోధక విభాగం–2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ నేతృత్వంలో పోలీసులు శనివారం మడిప్పాక్కమ్ మెయిన్ రోడ్డులోని శాస్త్రి నగర్‌లో నిఘా పెట్టారు. ఆ సమయంలో చాలా సేపటి నుంచి ఆగి ఉన్న కారును పరిశీలించారు. అందులో ఉన్న యువతిని విచారించగా ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పింది. కారులో ఉన్న వ్యక్తి, మోడల్ గర్ల్‌ను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి చెన్నైలోని వ్యభిచార బ్రోకర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైంది. అదేవిధంగా ఆ కారులో ఉన్న వ్యక్తి బెంగుళూరు శ్రీనివాసపురానికి చెందిన బ్రోకర్ షేక్ సోమన్ (ఎ) సాల్మన్ (42)గా గుర్తించారు. అతను ఉద్యోగం కోసం వెతుకుతున్న ఏడుగురు యువతులకు ఎక్కువ డబ్బులు ఇస్తానని చెప్పి ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి చెన్నైలోని ఐదుగురు వ్యభిచార బ్రోకర్లకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు విక్రయించినట్లు వెల్లడైంది. ఈ విధంగా సాల్మన్ చెన్నైలోని సెక్స్ బ్రోకర్లకు 100 మందికి పైగా యువతులను విక్రయించినట్టు తెలిసింది. చెన్నైలో అతడిపై పలు రకాల లైంగిక వేధింపులకు సంబంధించి కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వ్యభిచార నిరోధక విభాగం పోలీసులు బ్రోకర్ షేక్ సోమన్ (ఎ) సాల్మన్‌ను అరెస్ట్ చేశారు. మోడలింగ్ యువతిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే సెక్స్ వర్క్ కోసం వినియోగించిన లగ్జరీ కారు, 10 సెల్ ఫోన్లు, 2 స్వైపింగ్ మెషిన్లు, 37 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. యువతిని కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ మహిళా ఆశ్రమానికి అప్పగించారు.

ప్రత్యేక రిజర్వేషన్ కోసం 12న చెన్నైలో మహా ధర్నా



విలేకరులతో మాట్లాడుతున్న రత్న సభాపతి

వేలూరు: వెనుకబడిన తరగతులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఈ నెల 12న చెన్నై వల్లువర్ కోట్టం వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల కూటమి ఆర్గనైజర్ రత్న సభాపతి అన్నారు. వేలూరులో ఈ కూటమి సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు వెనుకబడిన తరగతుల జాబితాలో 255 కులాలకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గతంలో 27 శాతం రిజర్వేషన్ ఉండేదని, కొందరు రాజకీయ లబ్ధికోసం వాటిని 11 శాతానికి చేశారన్నారు. దీంతో ఎస్సీ, బీసీ, ఓబీసీలకు చెందిన వారు విద్య, ఉద్యోగం, తదితర సమాన అవకాశాలు పొందలేకపోతున్నారని తెలిపారు. 1989లో అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఓబీసీల కోసం ప్రత్యేక మండల కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నత పదవుల్లో ఓబీసీలు సుమారు నాలుగు శాతం మాత్రమే ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా 76 శాతం జనాభా ఉన్న ఓబీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నట్టు ఆరోపించారు. వీటిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ కూటమి ఓబీసీలకు ప్రత్యేక రిజర్వేషన్‌ను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వివరించారు. అనంతరం సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు చర్చించి పలు తీర్మానాలను చేశారు. ఈ సమావేశంలో ముత్తరాయర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజమాణిక్యం, నాయుడు సంఘం అధ్యక్షులు గుణశేఖర్, వేలూరు జిల్లా అధ్యక్షులు శడగోపన్, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యంలో టిన్నర్ కలిపి తాగిన వ్యక్తి మృతి

తిరువొత్తియూరు: మేలూరు సమీపంలో మద్యంలో నీరు అనుకుని టిన్నర్‌ను కలిపిన తాగిన వ్యక్తి మృతి చెందాడు. మరొకరు ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారు. మదురై జిల్లా మేలూరు సమీపంలోని కిటారిపట్టికి చెందిన పన్నైయన్ (40) శనివారం రాత్రి మద్యం తాగాడు. ఆ సమయంలో నీరు అనుకుని అక్కడున్న టిన్నర్‌ను కలుపుకుని తాగాడు. కొంత సేపటికి అతను కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల వారు అతడిని మేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ స్థితిలో సంఘటనా స్థలానికి వచ్చిన మరో వ్యక్తి కూడా పన్నైయన్ తాగిన మద్యం తాగి స్పృహ కోల్పోయారు. పన్నైయన్ మృతి చెందగా, అతని స్నేహితుడు మదురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తిరువళ్లూరు: పర్యావరణ పరిరక్షణపై యువతకు అవగాహన అవసరమని సెవ్వాపేట ఇన్‌స్పెక్టర్ భాస్కరన్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా సెవ్వాపేటలో వేళమ్మాల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిద్ధార్థ మెట్రిక్ పాఠశాలలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ భాస్కరన్ హాజరై సుమారు వంద మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో యువత స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెట్లను నరికి వేయడం వల్ల కలిగే ఇబ్బందులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఏలుమలై, శరత్ బాబు, రాఘవన్, పాఠశాల మేనేజర్ సతీష్, విద్యార్థులు తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకు యువకులు ముందుకు రావాలి

- డయల్ యువర్ ఈవోలో ఎవి.ధర్మారెడ్డి



డయల్ యువర్ ఈవోలో మాట్లాడుతున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి సేవకు యువకులు ముందుకు రావాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం తిరుమల అన్నమయ్య భవన్‌లో డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధాలు ఇచ్చారు.

ప్రశ్న : శ్రీవారి సేవకు మూడు నెలల ముందు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా సేవ దొరకడం లేదు. నిలిచిపోయిన వారి స్థానంలో మిగిలిన వారికి సేవా భాగ్యం కల్పించండి. – నామాల స్వామి, కాకినాడ

ఈవో : పరిశీలిస్తాం.

ప్రశ్న: శ్రీవారి ఆలయంలో తోసేస్తున్నారు. – అశోక్, తిరుపతి

ఈవో : వేసవిలో రద్దీ అధికంగా ఉంది. దర్శనం కోసం భక్తులు 40 నుంచి 50 గంటలు వేచి ఉంటున్నారు. త్వరగా దర్శనం చేసుకుని తర్వాతి భక్తులకు అవకాశం ఇవ్వాలి.

ప్రశ్న: గాలిగోపురం వద్ద దివ్యదర్శనం టోకెన్లు ఇవ్వండి. కింద ఇవ్వడం వల్ల అధిక సమయం వేచి ఉండాల్సి వస్తోంది. – రాజేశ్వరి, ప్రొద్దుటూరు

ఈవో: గాలిగోపురం వద్ద స్థలాభావం, తోపులాట, భక్తుల మధ్య గొడవలు జరగడం వల్ల అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌కు మార్చాము.

ప్రశ్న : లక్కీ డిప్ బయోమెట్రిక్ స్థానంలో మెషిన్ పెడితే అధిక సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. మొబైల్ ఓటీపీ ద్వారా టికెట్లు పొందే అవకాశాన్ని పరిశీలించండి. – దినేష్, హైదరాబాద్

ఈవో: లక్కీ డిప్ మెషిన్ ఏర్పాటును పరిశీలిస్తాం.

ప్రశ్న : కోవిడ్ సమయంలో అలిపిరి వద్ద టికెట్లు స్కాన్ చేయడం వల్ల, తిరుమలకు వచ్చేటప్పటికి గదులు దొరికేవి. అదే విధానాన్ని ప్రవేశపెట్టండి. –నాద విలాస్, ఒంగోలు

ఈవో: దీనిపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం.

ప్రశ్న : చక్కెర పొంగలి, పులిహోరా, మిర్యాల పొంగలి వంటి అన్నప్రసాదాలను భక్తులకు విక్రయించండి. –శ్రీనివాస్, హైదరాబాద్

ఈవో: అన్నప్రసాదాల విక్రయం సాధ్యం కాదు.

క్లుప్తంగా...

జెడ్పీటీసీలకు పాలన, విధులపై శిక్షణ

- మూడు రోజులు చొప్పున 15 బ్యాచ్‌లకు శిక్షణ
- మూడు ప్రాంతాల్లో 24వ తేదీ వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జెడ్పీటీసీ సభ్యులకు తమ విధులు, పరిపాలనపై అవగాహన కల్పించేందుకు స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎస్ఐఆర్‌డీ) ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున 15 బ్యాచ్‌లకు మూడు ప్రాంతాల్లో ఈ నెల 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయి. జిల్లా పరిషత్ పరిపాలన-జెడ్పీటీసీల విధులు, పంచాయతీరాజ్ చట్టంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందని ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని 222 మంది జెడ్పీటీసీ సభ్యులకు ఆరు విడతల్లో సామర్లకోటలోని ఈటీసీ కార్యాలయంలో శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పరిధిలోని 200 మంది జెడ్పీటీసీ సభ్యులకు నాలుగు విడతల్లో బాపట్ల ఈటీసీ కేంద్రంలో, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో ఉన్న 227 మంది జెడ్పీటీసీ సభ్యులకు ఐదు విడతల్లో శ్రీకాళహస్తి ఈటీసీ కేంద్రంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. సామర్లకోట ఈటీసీ కేంద్రంలో మొదటి బ్యాచ్‌కి ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు శిక్షణ పూర్తయిందని మురళి తెలిపారు. సోమవారం నుంచి సామర్లకోటలో రెండో బ్యాచ్‌కి, బాపట్ల, శ్రీకాళహస్తిలో మొదటి బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై ఎస్ఐఆర్‌డీ రూపొందించిన రెండు పుస్తకాలను శిక్షణకు హాజరయ్యే సభ్యులకు అందజేస్తామన్నారు. కాగా, సర్పంచి, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, ఎంపీపీలకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి.

హజ్ యాత్ర ఏర్పాట్లలో రాజీ పడొద్దు

ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా



ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా

సాక్షి, అమరావతి: హజ్ యాత్ర ఏర్పాట్లలో రాజీ పడొద్దని, హాజీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అధికారులను ఆదేశించారు. నంబూరులోని సిరాజుల్ ఉలూం మదరసాలో తాత్కాలిక హజ్ యాత్రికుల బస కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించి హాజీల బస ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ-గుంటూరు ఎన్‌హెచ్ నుంచి హాజీల బస కేంద్రానికి వచ్చేలా సర్వీసు రోడ్డులో ప్రత్యేక ఎంట్రన్స్ తయారవుతోందన్నారు. విశాలంగా ఉన్న మదరసా ప్రాంగణంలో హాజీలకు అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఈ నెల 6న సాయంత్రం మదరసాకు వచ్చి హాజీలను కలుస్తారని తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్ హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రుహుల్లా, హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజామ్, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు ఎస్ఎం జియాఉద్దీన్, హబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

టీడీపీతో బీజేపీ పొత్తు ఊహాజనితమే

- ఆ వార్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు భేటీ అయితే తప్పేంటి?
- బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో టీడీపీతో బీజేపీ పొత్తు ఉంటుందంటూ వస్తున్నవి ఊహాగానాలేనని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆదివారం వివిధ జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సంజయ్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలను టీడీపీ అధినేత చంద్రబాబు కలిస్తే తప్పేముందని ప్రశ్నించారు. గతంలో మమతా బెనర్జీ, స్టాలిన్, నితీశ్ కుమార్ వంటి ప్రతిపక్ష నేతలను కూడా ప్రధాని మోదీ, అమిత్ షా కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను కలవకుండా ప్రగతి భవన్‌కే పరిమితమై తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే నైజం బీజేపీది కాదు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని, పార్టీని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా మరికొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిసే పోటీ చేయబోతున్నాయని సంజయ్ చెప్పారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలనపట్ల విసిగిపోయారని, బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

ఏపీ స్థానం వెరీ‘గుడ్డు’

కోడిగుడ్ల లభ్యత, ఉత్పత్తిలో దేశంలోనే ఏపీది అగ్రస్థానం

- రాష్ట్రంలో ఏటా తలసరి గుడ్ల లభ్యత 501
- ఏటా 442 గుడ్ల లభ్యతతో రెండో స్థానంలో తెలంగాణ
- జాతీయ సగటు గుడ్ల లభ్యత 95 మాత్రమే
- రాష్ట్రంలో రెండేళ్లుగా పెరుగుతున్న పెరటి కోళ్ల సంఖ్య
- కేంద్ర పశు సంవర్థక మంత్రిత్వ శాఖ సర్వే-2022 వెల్లడి



సాక్షి, అమరావతి: కోడిగుడ్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత దేశంలో మూడో స్థానంలో ఉంది. మన దేశంలో కోడిగుడ్ల లభ్యత, ఉత్పత్తిలో మాత్రం ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పశు సంవర్థక మంత్రిత్వ శాఖ సర్వే-2022 వెల్లడించింది. దేశంలో మిగతా రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్‌లో తలసరి గుడ్ల లభ్యత అత్యధికంగా ఉందని.. ఏపీలో ఆంధ్రప్రదేశ్ ఏడాదికి తలసరి 501 గుడ్ల లభ్యతతో నంబర్-1 స్థానంలో ఉందని సర్వే వెల్లడించింది. గుడ్ల లభ్యతలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని సర్వే పేర్కొంది. తెలంగాణలో తలసరి గుడ్ల లభ్యత 442 కాగా.. దేశవ్యాప్తంగా ఏడాదికి సగటు తలసరి గుడ్ల లభ్యత కేవలం 95 మాత్రమే ఉందని సర్వే పేర్కొంది.

1950లో ఏడాదికి 5 గుడ్లే

1950-51 కాలంలో ఏడాదికి తలసరి కోడిగుడ్ల లభ్యత మన దేశంలో కేవలం ఐదు మాత్రమే ఉండగా.. 1960-61లో కేవలం 7 మాత్రమే ఉంది. తొలిసారిగా 1968-69లో జాతీయ స్థాయిలో సగటు తలసరి గుడ్ల లభ్యత 10కి చేరిందని సర్వే పేర్కొంది. 2020-21లో జాతీయ స్థాయిలో ఏడాదికి తలసరి గుడ్ల లభ్యత 90 ఉండగా 2021-22లో 95కు చేరినట్టు వెల్లడించింది.

మొదటి 5 స్థానాలు ఈ రాష్ట్రాలవే

కాగా.. కోడిగుడ్ల ఉత్పత్తి విషయంలోనూ దేశవ్యాప్తంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కోడిగుడ్ల లభ్యతలో నాలుగో స్థానంలో ఉన్న తమిళనాడు గుడ్ల ఉత్పత్తిలో మాత్రం రెండో స్థానంలోను.. గుడ్ల లభ్యతలో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ ఉత్పత్తిలో మాత్రం మూడో స్థానంలోనూ ఉన్నాయని సర్వే విశ్లేషించింది. దేశంలో కోడిగుడ్ల ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లోనే 64.56 శాతం గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని సర్వే వెల్లడించింది. దేశంలో 2021-22లో 129.60 బిలియన్ కోడిగుడ్లు ఉత్పత్తి కాగా.. వాణిజ్య పౌల్ట్రీల ద్వారా 109.93 బిలియన్ గుడ్లు ఉత్పత్తి అయినట్టు, పెరటి పౌల్ట్రీల ద్వారా 19.67 బిలియన్ గుడ్లు ఉత్పత్తి అయినట్టు సర్వే పేర్కొంది. రాష్ట్రంలో మూడేళ్లుగా (2019-20 నుంచి 2021-22) వరకు కోడిగుడ్ల ఉత్పత్తి పెరుగుతోందని సర్వే వెల్లడించింది. అలాగే రాష్ట్రంలో పెరటి కోళ్ల సంఖ్య కూడా రెండేళ్లుగా పెరిగిందని సర్వే వెల్లడించింది. రాష్ట్రంలో 2020-21లో పెరటి కోళ్ల సంఖ్య 1,23,70,740 ఉండగా.. 2021-22లో 1,31,69,200కు పెరిగినట్టు సర్వే స్పష్టం చేసింది.

2021-22లో కోడిగుడ్లు ఉత్పత్తిలో టాప్ ఐదు రాష్ట్రాల వాటా శాతం ఇలా

రాష్ట్రం	గుడ్ల ఉత్పత్తి వాటా (శాతం)
ఆంధ్రప్రదేశ్	20.41
తమిళనాడు	16.08
తెలంగాణ	12.86
పశ్చిమ బెంగాల్	8.84
కర్ణాటక	6.38

వివిధ రాష్ట్రాలు, యూటీల్లో ఏడాదికి తలసరి గుడ్ల లభ్యత ఇలా

రాష్ట్రం	తలసరి గుడ్లు లభ్యత
ఆంధ్రప్రదేశ్	501
తెలంగాణ	442
అండమాన్ నికోబార్	290
తమిళనాడు	273
హరియాణ	263
పంజాబ్	200
కర్ణాటక	124
పశ్చిమ బెంగాల్	117
లక్షద్వీప్	106

ఏపీలో మూడేళ్లలో గుడ్ల ఉత్పత్తి పెరుగుదల ఇలా

ఆర్థిక ఏడాది	గుడ్ల ఉత్పత్తి (కోట్లలో)
2019-20	2,192.75
2020-21	2,496.39
2021-22	2,645.02

ఇల్లు కొనుకున్నా.. పట్టా వెనక్కి తీసుకోండి

రెవెన్యూ అధికారులకు వివాహిత లేఖ



కనకదుర్గ

మంగళగిరి: రాష్ట్రంలో ఇల్లులేని పేదవారు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం పట్టాలు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా యర్రబాలెంకు చెందిన దండిభొట్ల నాగసీత కనకదుర్గను అధికారులు అర్హురాలిగా గుర్తించి ఇటీవల ఆమెకు పట్టాను అందజేశారు. నిజానికి.. 2019లో తనకు సొంతిల్లు లేకపోవడంతో కనకదుర్గ అందుకోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం తాజాగా అర్హురాలిగా గుర్తించింది. కానీ, 2019 అనంతరం తన భర్త దండిభొట్ల సుబ్రహ్మణ్య శర్మ పేరుతో వున్న వంద చదరపు గజాల స్థలాన్ని విక్రయించి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ను కొనుగోలు చేసి ఈ ఏడాది మార్చి 23న రిజిస్ట్రేషన్ చేయించుకుని అందులో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో.. అప్పటికే ఇంటి స్థలానికి అర్హురాలిగా కనకదుర్గను ఎంపిక చేసిన అధికారులు ఆమె పేరున పట్టాను మంజూరుచేసి ఇటీవల అందరితో పాటు అందజేశారు. కానీ, తనకు సొంతిల్లు ఉండగా పేదలకు చెందాల్సిన సెంటు స్థలాన్ని తాను పొందకూడదని కనకదుర్గ గ్రహించి ప్రభుత్వం తనకు కేటాయించిన ఇంటి స్థలాన్ని రద్దుచేసి వేరొక అర్హురాలికి ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులకు ఆదివారం ఆమె లేఖ రాశారు.

ఈసారైనా కొలిక్కివచ్చేనా!?

- శ్రీశైలం, సాగర్ రూల్ కర్వ్స్, జలవిద్యుదుత్పత్తి, వరద జలాల మళ్లింపుపైనే వివాదాలు
- వాటిని పరిష్కరిస్తే రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు చరమగీతం పాడినట్లే
- ఆ మూడు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్ఎంసీని పునరుద్ధరించిన కృష్ణాబోర్డు
- గతంలో వాటి పరిష్కారానికి అంగీకరించి, తర్వాత అడ్డంతిరిగిన తెలంగాణ
- దీంతో బోర్డు సభ్యులు, ఏపీ అధికారుల సంతకాలతోనే బోర్డుకు నివేదిక ఇచ్చిన ఆర్ఎంసీ
- ఆ తర్వాత ఆర్ఎంసీని రద్దుచేసిన బోర్డు
- గత నెల 10న జరిగిన బోర్డు సమావేశంలో రెండు రాష్ట్రాల సమ్మతితో ఆర్ఎంసీ పునరుద్ధరణ
- ఆ మూడు అంశాలపై నెలరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆర్ఎంసీని ఆదేశించిన బోర్డు

సాక్షి, అమరావతి: కృష్ణాజలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచు విభేదాలు తలెత్తడానికి దారితీస్తున్న మూడు అంశాలను ఈసారైనా రిజర్వాయర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) కొలిక్కి తెస్తుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. కృష్ణాబోర్డు 16వ సర్వసభ్య సమావేశంలో తీర్మానించిన మేరకు మూడు అంశాలపై ఆర్ఎంసీ చర్చించి, పరిష్కారానికి రూపొందించిన నివేదికపై సంతకాలు చేయడానికి తొలుత అంగీకరించిన తెలంగాణ అధికారులు తర్వాత అడ్డంతిరిగారు. దీంతో కృష్ణాబోర్డు సభ్యులు, ఏపీ అధికారులు సంతకాలు చేసిన నివేదికనే బోర్డుకు ఆర్ఎంసీ అందజేసింది. ఆ తర్వాత కృష్ణాబోర్డు ఆర్ఎంసీని రద్దుచేసింది. గత నెల 10న నిర్వహించిన 17వ సర్వసభ్య సమావేశంలో ఇదే అంశంపై చర్చించిన కృష్ణాబోర్డు.. రెండు రాష్ట్రాల అధికారుల సమ్మతి మేరకు ఆర్ఎంసీని పునర్ధురించింది. ఆ మూడు అంశాలపై నెల రోజుల్లోగా మళ్లీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆర్ఎంసీని కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ ఆదేశించారు. దిగువ కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టులు. ఇందులో శ్రీశైలం ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం ఆధీనంలోను, నాగార్జునసాగర్ తెలంగాణ సర్కార్ ఆధీనంలోను ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల నిర్వహణలో.. అంటే వాటి ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంలో రెండు రాష్ట్రాల మధ్య తరచు వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తుండటం కూడా వివాదాలకు కారణమవుతోంది. కృష్ణాకు వరద వచ్చే రోజుల్లో.. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ నిండి.. జలాలు కడలిలో కలుస్తున్న సమయంలో రెండు రాష్ట్రాలు మళ్లించిన జలాలను కోటాలో కలపకూడదని ఏపీ సర్కార్ ప్రతిపాదిస్తుండగా.. తెలంగాణ సర్కార్ వ్యతిరేకిస్తోంది. ఈ మూడు అంశాలపై అధ్యయనం చేయడానికి బోర్డు సభ్యుడు అనిల్‌కుమార్ గుప్తా అధ్యక్షతన బోర్డు సభ్యుడు ఎల్.బి.ముయన్‌తంగ్, రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు, జెన్‌కో డైరెక్టర్లు సభ్యులుగా ఆర్ఎంసీని కృష్ణాబోర్డు పునరుద్ధరించింది.

ఏకాభిప్రాయం సాధ్యమేనా?

బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ రూల్ కర్వ్స్‌పై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రూపొందించిన ముసాయిదాపై చర్చించి, రెండు రాష్ట్రాల అభిప్రాయాల మేరకు వాటిలో మార్పులు చేయాలని ఆర్ఎంసీకి బోర్డు నిర్దేశించింది. కృష్ణాబోర్డు అనుమతి లేకుండానే.. దిగువన నీటి అవసరాలు లేకున్నా శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తుండటం వల్ల జలాలు వృథా అవుతున్న నేపథ్యంలో.. దానిపై చర్చించి విద్యుదుత్పత్తికి నియమావళిని రూపొందించాలి. వరద రోజుల్లో మళ్లించిన జలాలను కోటాలో కలపాలా? వద్దా? అనే అంశంపైన కూడా చర్చించాలి. ఈ అంశాలపై ఆర్ఎంసీలో సభ్యులైన కృష్ణాబోర్డు సభ్యులిద్దరు, ఏపీ అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తుండగా.. తెలంగాణ అధికారులు విభేదిస్తున్నారు.

ఆస్పత్రుల్లో ఈ-ఓపీ సేవలు

- ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో పేపర్ రహిత సేవలపై దృష్టి
- ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటుకు చర్యలు
- ప్రతిరోజూ పది శాతం ఈ-ఓపీలు ఉండేలా కార్యాచరణ
- దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో పేపర్ రహిత వైద్య సేవలపై వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) పరిధిలోని ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో తప్పనిసరిగా ఈ-అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఈ-ఓపీడీ) సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్ని జిల్లాల డీసీహెచ్ఎస్‌లను కమిషనర్ ఆదేశించారు. ఇప్పటికే అన్ని బోధనాస్పత్రుల్లో ఈ-ఓపీ సేవలు అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోగులు ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా.. కొన్ని ఆస్పత్రుల్లో స్కాన్, షేర్ విధానంలో ఓపీ రిజిస్ట్రేషన్‌లు చేపడుతున్నారు. ఇదే తరహాలో ఏపీవీవీపీ ఆస్పత్రుల్లోనూ ఈ-ఓపీ సేవల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏపీవీవీపీ పరిధిలో 12 జిల్లా, 53 ఏరియా ఆస్పత్రులు, 175 సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఏటా కోటికి పైగా ఓపీలు నమోదవుతుంటాయి. ఈ నేపథ్యంలో జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం ఓపీల్లో.. 10 శాతం ఈ-ఓపీలు ఉండాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ విధానం వల్ల క్యూలైన్‌లో వేచి ఉండే శ్రమ తప్పడంతోపాటు, పలు ఇబ్బందులు తొలుగుతాయి.

ఈ-ఆస్పత్రులుగా తీర్చిదిద్దడానికి చర్యలు

ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ఈ-ఓపీ సేవలు తప్పనిసరిగా అందించాలని ఆదేశించాం. భవిష్యత్‌లో ఆస్పత్రులన్నింటినీ ఈ-ఆస్పత్రులుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రచించాం. ఇందు కోసం ఇప్పటికే అన్ని ఆస్పత్రులకు అవసరమైన కంప్యూటర్‌లు, ప్రింటర్‌లు పంపిణీ చేశాం. వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా డిజిటల్ వైద్య సేవలను మరింత పెంచుతాం.
– డాక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ ఏపీవీవీపీ

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అడుగులు

వైద్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి/సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడివడిగా అడుగులు వేస్తున్నారని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బాఘెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన (ఏబీపీఎంజేఏవై), వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాలకు సంబంధించి ప్యానల్ ఆస్పత్రుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 3,257 ప్రొసీజర్‌లలో ఉచితంగా వైద్యం అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం ఏపీ అని చెప్పారు. ఈ పథకం కోసం ఏటా రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ,, ఆయుష్మాన్ భారత్ కింద కేవలం 1,055 ప్రొసీజర్లకు మాత్రమే ఉచితంగా చికిత్స అందేదని, ప్రస్తుతం ఏకంగా 3,257 రోగాలకు చికిత్స అందుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఏకంగా 90 శాతం కుటుంబాలు ఈ సౌకర్యం పొందుతున్నాయని వివరించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా ఏపీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేశామన్నారు. నాలుగేళ్లలో 49 వేలకు పైగా నియామకాలు చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరును కేంద్ర సహాయ మంత్రి బాఘెల్ ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ సీఈవో హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు కాదు.. బాబుకే రాజకీయ నరకం

- టీడీపీది మేనిఫెస్టో కాదు.. ‘మోస’ఫెస్టో
- ఇతరుల మేనిఫెస్టోలు కాపీ కొట్టి మరీ హామీలివ్వడం సిగ్గుచేటు
- మంత్రి అంబటి రాంబాబు, నాయకులు ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి అంబటి. వేదికపై మాణిక్య వరప్రసాద్, రాజశేఖర్, రోశయ్య, కొమ్మినేని తదితరులు

పట్నంబజారు(గుంటూరు): నాలుగేళ్ల నరకం అంటూ ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ప్రచురిస్తోందని.. ప్రజలకు కాదు.. చంద్రబాబుకు, ఎల్లో మీడియాకే రాజకీయ నరకమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కాపీ కొట్టిన పథకాలు చెప్పి తమ్ముళ్లా అదిరిందా.. అని అడుగుతున్న చంద్రబాబుకు 2019లో అదిరిందని, 2024లోనూ అదురుతుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ లాగా మేనిఫెస్టో తీసుకుని ప్రతి ఇంటికీ వెళ్లే దమ్ము టీడీపీకి ఉందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన చంద్రబాబు.. తిరిగి ఇతరుల మేనిఫెస్టోలు కాపీకొట్టి మరీ హామీలివ్వడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టింది మేనిఫెస్టో కాదని.. ‘మోస’ఫెస్టో అని విమర్శించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. చంద్రబాబుకు మేనిఫెస్టో అంటే కేవలం అధికారం కోసం రాసుకునే కాగితం మాత్రమేనని విమర్శించారు. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమాభివృద్ధిని సహించలేకే టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రబాబు వంటి నీచ బుద్ధి ఉన్న వ్యక్తిని ఎక్కడా చూడలేదన్నారు. అధికారం కోసం అనేక అబద్ధాలు ఆడిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా మేనిఫెస్టోనే టీడీపీ వెబ్‌సైట్‌లో లేకుండా చేశారని గుర్తు చేశారు. సీఎం జగన్ పేదలకు చిత్తశుద్ధితో మేలు చేస్తున్నారన్నారు. ఆయన పథకాలకు కూడా పేరు మార్చి మేనిఫెస్టోలో పెట్టిన ఘనత బాబుకే దక్కుతుందన్నారు. ఆర్థిక రంగ విశ్లేషకుడు డి.పాపారావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులనందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2014లో చెప్పినట్లుగా చంద్రబాబు ఇంటికో ఉద్యోగం ఇచ్చి ఉంటే.. ఇప్పుడు అన్ని లక్షల ఉద్యోగాలివ్వాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. సమావేశంలో శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు ముస్తఫా, కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నేతలు వేమారెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

మావోయిస్టు అగ్రనేత సుదర్శన్ మృతి

గుండెపోటుతో మే 31న కన్నుమూసినట్టు ప్రకటించిన మావోయిస్టులు

- ఆగస్టు 3 వరకు స్మారక సభలు నిర్వహించాలని పిలుపు
- రాడికల్ విద్యార్థి సంఘం నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు సుదర్శన్ ప్రస్థానం
- ఉమ్మడి ఆదిలాబాద్, దండకారణ్య ప్రాంతంలో ఉద్యమం వ్యాప్తికి కృషి



సాక్షి, హైదరాబాద్/బెల్లంపల్లి/చర్ల: మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్(69) అలియాస్ ఆనంద్ కన్నుమూశారు. ఐదు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన కొంతకాలం నుంచి దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి, మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో దండకారణ్యం గెరిల్లా జోన్‌లో మే 31న మధ్యాహ్నం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. దీనిపై మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. వందలాది మంది పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) కార్యకర్తలు, నాయకులు, కమాండర్ల సమక్షంలో విప్లవ సాంప్రదాయాలతో సుదర్శన్ అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. సుదర్శన్ భార్య, కుటుంబ సభ్యులు, స్నేహితులకు మావోయిస్టు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. సుదర్శన్ మృతికి సంతాపంగా సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా స్మారక సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

రాడికల్ విద్యార్థి సంఘంతో మొదలై..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి పట్టణం కన్నాల బస్తీకి చెందిన పేద కార్మిక కుటుంబంలో పుట్టిన కటకం సుదర్శన్.. 1974లో మైనింగ్ డిప్లొమా చదువుతున్న సమయంలో విప్లవ పోరాటంలో అడుగుపెట్టారు. 1975లో రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారు. తర్వాత నక్సల్బరీ, శ్రీకాకుళం సంఘర్షణ విముక్తి, పోరాటాల ప్రేరణతో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు. 1980లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా దండకారణ్య ప్రాంతంలోకి విప్లవోద్యమాన్ని విస్తరించడంలో కీలకంగా పనిచేశారు. 1987లో దండకారణ్య కమిటీ సభ్యుడిగా, తర్వాత ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఇంద్రవెల్లి ఆదివాసీ రైతాంగ ఉద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. 1995లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2001లో భారత కమ్యూనిస్టు పార్టీ (పీపుల్స్ వార్) 9వ కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2004లో పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ) కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. ఈ క్రమంలో 2007లో మరోమారు కేంద్ర కమిటీకి ఎన్నికై పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెంట్రల్ రీజనల్ బ్యూరో కార్యదర్శిగా పనిచేశారు. మొత్తంగా 2001 నుంచి 2017 వరకు సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) కార్యదర్శిగా కొనసాగిన ఆయన.. తర్వాత అనారోగ్య కారణాలతో ఆ బాధ్యతల నుంచి వైదొలగి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగారు. మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రచురితమైన పలు విప్లవ పత్రికలకు సంపాదకుడిగా కూడా వ్యవహరించారు.

ప్రభుత్వాల ఫాసిస్టు విధానాల వల్లే సుదర్శన్ మరణం: మావోయిస్టులు

విప్లవోద్యమ నాయకులకు, కార్యకర్తలకు మందులు, వైద్య చికిత్స అందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఫాసిస్టు దాడి ఫలితంగానే సుదర్శన్ మరణించారని మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో ఆరోపించారు.

జీవిత భాగస్వామి ఎన్‌కౌంటర్‌లో మృతి

విప్లవోద్యమంలో చేరిన తర్వాత సుదర్శన్ సహచర విప్లవకారిణి కోలం లలితాబాయి అలియాస్ లలితక్కను విప్లవ సిద్ధాంతం ప్రకారం వివాహం చేసుకున్నారు. లలితక్క పార్టీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 2003లో కొమురం భీం జిల్లా బెజ్జూర్ మండలం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో జరిగిన పోలీసుల ఎదురుకాల్పుల్లో ఆమె మృతి చెందారు. తర్వాత సుదర్శన్ మరో సహచర విప్లవకారిణి పద్మను ద్వితీయ వివాహం చేసుకున్నట్టు ప్రచారంలో ఉంది.

మావోయిస్టు ఉద్యమానికి ‘సుస్తీ’!

అనారోగ్యంతో వరుసగా కీలక నేతల మరణాలు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీని కీలక నేతల అనారోగ్యం దెబ్బతీస్తోంది. ఒక్కొక్కరుగా కీలక నేతలు అనారోగ్యంతో కన్నుమూస్తుండటంతో ఉద్యమంపై ప్రభావం పడుతోంది. మూడేళ్ల కింద ముసురుకున్న కరోనా మహమ్మారి దెబ్బతో అడవుల్లోని ఎంతో మంది మావోయిస్టు కీలక నాయకులు, కేడర్ విలవిల్లాడారు. ఆ తర్వాతి నుంచి ఆరోగ్యపరమైన అంశాల్లో మావోయిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. 2021లో కరోనా కారణంగా మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు యాప నారాయణ అలియాస్ హరిభూషణ్‌తోపాటు మరో కీలక నేత, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క మృతి చెందారు. అదే ఏడాది అక్టోబర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే అనారోగ్యంతో దక్షిణ బస్తర్ అటవీ ప్రాంతంలో మరణించారు. ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ సభ్యుడు భిక్షపతి అలియాస్ విజేందర్ కూడా మృతి చెందారు. అంతకు ముందు అగ్రనేత కత్తి మోహన్ అలియాస్ ప్రకాశ్ సైతం అనారోగ్యంతోనే కన్నుమూశారు.

కరోనాతోపాటు వయోభారం, బీపీ, షుగర్, ఇతర సీజనల్ వ్యాధులు వంటివి మావోయిస్టు నాయకులు, కేడర్‌ను కోలుకోలేని దెబ్బతీశాయి. అనారోగ్యం పాలైనవారికి మందుల సరఫరా కూడా ఇబ్బందిగా మారింది. మావోయిస్టు కీలక నేతలు గణపతి, గాజర్లరవి వంటి వారు కూడా వయోభారం, తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతున్నట్టు సమాచారం.

సన్నిధి

మంచి మాట



నిన్న నేడు రేపు

నేడులో ఉన్న మనం నిన్నను దాటుకుని వచ్చాం. నేడునూ దాటుకుని మనం రేపులోకి వెళ్లాల్సి ఉంది. నిన్న, నేడులకన్నా మనకు రేపు ఎంతో ముఖ్యం. నిన్న, నేడుల్లో లాభం, నష్టం, సుఖం, శోకం, ప్రగతి, పతనం మనకు వచ్చి ఉంటాయి. వీటి ప్రాతిపదికన మనం రేపులోకి వెళ్లాల్సి ఉంటుంది. మనం ఏ స్థితిలో ఉన్నా, మన పరిస్థితి ఏదైనా మనం తప్పకుండా రేపు వైపు కదలాలి; కదులుదాం.

నిన్నవైపు కాదు మన చూపు రేపు వైపు ఉండాలి. నేడులో ఉండిపోవడం కాదు మనం రేపువైపు నడవాలి. రేపువైపు చూపు వేసి మనం కదులుతూ ఉండాలి. మన చూపు నిండా, మన కదలిక నిండా చేవను మనం నింపుకోవాలి.

మనలో నీరసం ఉంటుంది. దాన్ని నిన్న మరిచిపోయినా నేడు నేల రాసేసుకోవాలి. మనలో చెడ్డతనం ఉంటుంది. అది నిన్నటి నుంచి నేడులోకి వచ్చేసినా రేపులోకి రాకుండా దాన్ని కూలదోసుకోవాలి. మనలోని మూర్ఖత్వాన్ని నేడు తప్పకుండా విడిచి పెట్టియ్యాలి. మన జాడ్యాలు మన రేపులోకి రాకుండా నేడు మనమే వాటిని మట్టు పెట్టుకోవాలి. నిన్న మనకు మనమే వేసుకున్న కుత్సితాల సంకెలల్ని నేడైనా తెంచేసుకోవాలి. నిన్న మనలోకి వచ్చి చేరి నిలిచి ఉన్న మత్సరభావాల విషాన్ని నేడు పూర్తిగా ఒంపేసుకోవాలి.

నిన్నకు నేడు కొనసాగింపు కాకూడదు. నిన్నకు నేడు కొనసాగింపు అయి ఉంటే అది తప్పు అని తప్పకుండా తెలుసుకోవాలి. ఆ తప్పు కొనసాగకుండా నేడు మనం జాగ్రత్త పడాలి. జాగరూకతతో మనం రేపును స్పృశించాలి.

నిలిచి ఉండే చెలిమితోనూ, నిజమైన నైజంతోనూ, నిర్మలమైన హృదయంతోనూ, చల్లటి ఆశయాలతోనూ, చక్కని ఆలోచనలతోనూ సత్ప్రవర్తనతోనూ మనం రేపులోకి వెళ్లాలి. మన నిన్నలో, నిన్న మనలో అవి లేకపోయినా రేపు అవి మనకు ఎంతో అవసరం అని నేడైనా గ్రహించి మనం రేపులోకి వెళ్లాలి.

నిన్న మనం ఎలా ఉన్నా, నేడు మనం ఎలా ఉంటున్నా రేపు మాత్రం మనం గొప్పగా ఉండాలి; అధమపక్షం రేపు మనం బావుండాలి. అందుకు నేడు మనం సిద్ధపడాలి. రేపులో మనం మెరుగ్గానూ, మేలుగానూ ఉండేందుకు మనం నేడు తయారుగా ఉండాలి; మనల్ని మనం తయారు చేసుకోవాలి.

అలవాటుపడ్డ సోమరితనానికి, అభిప్రాయాలకూ నేటితో స్వస్తి పలికి, ఉండాల్సిన ఉత్సాహానికి, అవగాహనకూ నేడైనా నాంది పలికి అభ్యున్నతికి ప్రస్తావన కలిగేందుకు, కల్పించుకునేందుకు రేపులోకి వెళ్లాలి మనం. పనిచేస్తూ ప్రయోజనాన్ని పొందే చేతులతో, మెరిసే తలపులు కలిగే మస్తిష్కంతో భేషజాల పరదాలు తొలగించుకుని, వేషాలు పోయే గుణాన్ని మరచిపోయి మనం రేపులోకి చేరాలి.

పరుల బాధను పట్టించుకోవడం పాపం కాదు; తోటి వాడికి మంచి చెయ్యడం నేరం కాదు; సాటివాడికి చేయూతను ఇవ్వడం దోషం కాదు కాబట్టి వాటిని చేపట్టడానికి కూడా మనం రేపును వేదిక చేసుకోవాలి.

రేపైనా మనల్ని మనం నరులం అని నిరూపించుకోవాలి.

మన కోసం, మన రాక కోసం వేచి ఉన్నది సుమా రేపు అన్నది; లేచి వెళ్లి అందుకోవడానికే మనం ఉన్నది. మనంత మనంగా, మనం మనంగా నిజమైన మనుషులంగా జీవం ఉన్నవాళ్లంగా జీవించేందుకుగా మనం రేపును అందుకోవాలి.

మన రాగం, మన యాగం, మన త్యాగాలతో గణనీయమైన మనుగడను సాధించేందుకు, ఆపై మన గానం, మన ధ్యానం, మన జ్ఞానాలతో స్మరణీయమైన మనుషులం అయ్యేందుకు మనం రేపును ఆవాహన చేసుకోవాలి.

– రోచిష్మాన్

> 'బెదురు లేకుండా కదులుతూ ఎదురు వెళ్లి రేపులోకి ప్రవేశిద్దాం; ఏ మాత్రమూ చెదిరిపోకుండా ఎదిగేందుకు విఫలం అవకుండా రేపుకు ప్రయుక్తం అవుదాం'.

గురువాణి



అలా చేయవచ్చా... అది అవమానం కదూ !!!

మన దేశం కష్టాల్లో ఉన్నప్పుడు సనాతన ధర్మానికి పూర్వ వైభవం తీసుకురావడంలో ఎనలేని కృషి చేసిన సమర్థ రామదాసు గారు చెప్పిన మరో సూత్రం – జ్ఞాన సముపార్జన, ప్రచారం. ఇంట్లో మంచి మంచి చిత్తరువులు, మంచి పరుపులు, మంచి మంచాలు, కుర్చీలు, ఇతర అలంకార సామాగ్రి ఎలా ఉంచుకుంటామో... ప్రతి ఇంటా కూడా చదవదగిన పుస్తకాలు కొన్ని ఉండి తీరాలి. చదివిన పుస్తకాల మీద చర్చ కూడా జరుగుతుండాలి.

ఇంటి పెద్ద ఒక మంచి పుస్తకం చదివి దానిలో తనకు నచ్చిన అంశాలు ఏ పేజీల్లో ఉన్నాయో ఆ పుస్తకం ముందుండే తెల్లకాగితంపై రాసి ఉంచాలి. పిల్లలు ఆ పుస్తకం తెరిచినప్పుడల్లా వాటిని చదివి పుస్తకంపట్ల ఆసక్తి పెంచుకుంటారు. చదివిన పుస్తకంపై కుటుంబ సభ్యులతో చర్చిస్తూండాలి. అప్పుడు తీరికసమయాల్లో వాటిని చదవడానికి అందరికీ ప్రేరణ కలుగుతుంది. నిజానికి ఇంటి సంపద వృద్ధిలోకి రావాలన్నా, ఇంటి గౌరవం ఆచంద్రార్కం కొనసాగాలన్నా.. ఆ ఇంటి యజమాని ఎన్ని పుస్తకాలు చదివి, ఎన్ని పుస్తకాల గురించి అలా రాసి భద్రపరిచి ఉంచాడన్నది ముఖ్యం. అదే వారికి నిజమైన ఆస్తి. అదే తరువాత తరాల వారిలో స్ఫూర్తి రగిలిస్తుంది, వారినీ ఉత్తములుగా తీర్చిదిద్దుతుంది. పుస్తకాలు కొనడం పెద్ద కష్టమేమీ కాదు, పుస్తకాలు భద్రపరచడం భారం కూడా కాదు. 'మా ఇంట్లో పుస్తకాలు చదివేవారు లేరండీ.. అని ఇచ్చేయడం ఆ కుటుంబానికి చాలా అవమానకరమైన విషయం.

చదివే వాళ్ళు లేకపోవడమేమిటి! చదివేవాళ్ళు ఉండాలి. ప్రతివాళ్లూ పుస్తకాలు ఒక నియమంగా చదవాలి. ప్రతిరోజూ మనం ఎదుర్కొనే ఎన్నో సమస్యల నుంచి బయటపడడానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయి. అవి మనకు మనశ్శాంతినిస్తాయి. ఒక్క ఆధ్యాత్మిక పుస్తకాలే కాదు... మన జీవితాలను, మన పిల్లల జీవితాలను ఉద్ధరించడానికి ఇది పనికొస్తుంది–అని అనుకున్న ప్రతి పుస్తకం ఆ ఇంట తప్పనిసరిగా ఉండాలి. పుస్తకాలు లేని జ్ఞానాన్ని ఇస్తాయి, ఉన్న జ్ఞానాన్ని అనేక రెట్లు పెంచుతాయి. ఆ జ్ఞానాన్ని పదిమందితో పంచుకున్నప్పుడు అది మరింత పెరుగుతుందే కానీ తరిగేది కూడా కాదు. అందరూ వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వక్కర్లేదు. కానీ కుటుంబ సభ్యులతో, ఇంటికొచ్చిన అతిథులతో, ఆత్మీయులతో జరిపే సమావేశాల్లో, విందులు, వినోదాల్లో కలిసిన సన్నిహితులతో వారు చదివిన మంచి పుస్తకాలపై చర్చ పెట్టాలి. అలాగే పిల్లలున్న ఇంటికి వెళ్ళినప్పుడు, ఇతరత్రా శుభకార్యాల్లో, దూరప్రయాణాలు వెళ్ళేవారికి మంచి మంచి పుస్తకాలు బహూకరించడం అలవాటు చేసుకోవాలి. వీలయితే ఆ పుస్తకాల ప్రాధాన్యతను, వాటిని ఎందుకు బహూకరిస్తున్నది వాటిపై రాసి సంతకం చేసి ఇస్తే... వారితో మీ బంధం మరింత గట్టిపడుతుంది. మీపట్ల వారికి, వారి కుటుంబానికి ఎనలేని గౌరవం ఏర్పడుతుంది.

వారు కూడా వాటిని చదివి ఎంత ప్రభావితమవుతారో, ఎంత శాంతి పొందుతారో మాటల్లో చెప్పలేం. సమర్థ రామదాసుగారి లాగా గురుస్థానాల్లో ఉన్న వారు ఇటువంటి విషయాలను ప్రబోధం చేయాలి, ప్రచారం చేయాలి... సమాజ అభ్యున్నతికి ఇది అవసరం.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్వికథ

ఎంత చెట్టుకంత గాలి!

ఓ నడి వయస్కుడు పౌర్ణమి రోజున ఆశ్రమానికి వెళ్ళాడు. ఫల పుష్పాదులను గురువుకు సమర్పించాడు. మంచిచెడ్డలు మాట్లాడాక తన మనసులోని విషయం బయటికి చెప్పాడు. తనకు మరింత డబ్బు సంపాదించాలన్న కోరిక బలంగా ఉందని గురువుకు తెలిపాడు.


గురువు అతడి కళ్ళలోకి చూస్తూ ''ఇప్పుడున్న డబ్బు నీకు సరిపోలేదా?'' అని అడిగాడు. 'నేను ఇప్పటిదాకా సంపాదించిన డబ్బు నా తరానికి సరిపోతుంది. అయితే నా తదనంతరం... నా బిడ్డలకు, వారి బిడ్డలకు సరిపడేంత డబ్బు మాత్రం లేదు. తగినంత డబ్బులేక వారు ఆర్థిక ఇబ్బందులు పడతారేమోనని ఆందోళనగా ఉంది' అని దిగులుగా చెప్పాడు.

గురువు నెమ్మదిగా తల ఆడించి రెండు రోజుల పాటు తన ఆశ్రమంలో నిద్ర చేయమన్నాడు. అందుకు ఆ నడివయస్కుడు అంగీకరించాడు. గురువు అతడికి చక్కటి విశ్రాంతిగదిని ఏర్పాటు చేశాడు. మొదటిరోజు పడుకునేటప్పుడు గురువు అతడి చేతికి చిన్న బెల్లం ముక్క ఇచ్చి దిండు పక్కన పెట్టుకుని పడుకోమన్నాడు. అలాగే చేశాడు ఆ నడివయస్కుడు.

నిద్రలేచాక గురువు అతడిని ''రాత్రి మంచి నిద్ర వచ్చిందా?'' అని అడిగాడు. బెల్లం చుట్టూ నాలుగు చీమలు చేరాయని, దాంతో రెండుసార్లు మెలకువ వచ్చి నిద్ర సరిగా రాలేదని చెప్పాడు.

''అవునా!'' అని ఆశ్చర్యపోయాడు గురువు.

రెండవరోజు కూడా ఆ నడివయస్కుడు నిద్రపోయే ముందు గురువు అతడి వద్దకు వెళ్ళాడు. ఒక పెద్ద బెల్లం ముద్దను చేతికిచ్చి దిండు పక్కన పెట్టుకుని పడుకోమన్నాడు. గురువు చెప్పినట్లే చేశాడు ఆ నడి వయస్కుడు.



మరుసటి రోజు ఉదయాన్నే గురువు లేచి చూసేసరికి అతనికి ముఖం పీక్కుపోయి ఉంది. కళ్ళు ఎర్రబారి కళ్ళవెంబడి నీళ్ళు కారుతున్నాయి. ''నిన్నటి కన్నా ఈరోజు నిద్ర బాగా పట్టిందా?'' అని అడిగాడు గురువు.

బెల్లం ముద్ద చుట్టూ చేరిన వందలాది చీమలు తనను క్షణం కూడా నిద్ర పోనివ్వలేదని బదులిచ్చాడు అతడు. చీమల బారినుంచి బెల్లాన్ని తప్పించడానికి రాత్రంతా మేలుకోవాల్సి వచ్చిందని బాధగా చెప్పాడు.

గురువు చిన్నగా నవ్వి ''ఎంత చెట్టుకంత గాలి ఉంటుందని తెలుసుకో. నీవు సంపదను పోగు చేసే కొద్దీ సమస్యలు కూడా పెద్దవి వస్తాయి. పెద్ద బెల్లం ముద్దంత దండిగా సంపద సమకూర్చి పెడితే నిద్రాహారాలు మాని వాటిని కాపాడుకోవడానికే జీవితకాలం సరిపోతుంది. అంతేకాకుండా ఆ సంపదను చూస్తూ మీ పిల్లలు సోమరులుగా తయారవుతారు. కష్టపడటానికి ఏమాత్రం ఇష్టపడరు. తగినంత సొమ్ము సంపాదించుకోలేనంత అసమర్థులుగా ఉండరు వారు. అతి ఎప్పుడూ అనర్థదాయకమే. కాబట్టి తరతరాలు కూర్చుని తినేంత ఎక్కువ సంపాదించాలన్న అత్యాశ వద్దు. ఉన్నంతలో తృప్తి పడటం నేర్చుకో. ఆశకు అంతు ఎక్కడిది?'' అని హితవు చెప్పాడు.

రాత్రంతా చేతిని కుట్టిన చీమల దద్దుర్లు చూసుకుంటూ ఆ నడివయస్కుడు 'అత్యాశ పడిన వాడు సుఖపడింది లేదని పెద్దలు ఊరకే చెప్పలేదు' అని అనుకున్నాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా


చిరంజీవి

భోళా మానియా ఆగయా

'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ చిత్రం తర్వాత చిరంజీవి హీరోగా రూపొందుతోన్న చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న 'భోళా శంకర్' ఆగస్టు 11న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మ్యూజికల్ జర్నీని ప్రారంభించారు మేకర్స్. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భోళా మానియా..' అంటూ సాగే మొదటి పాట పూర్తి లిరికల్‌ని ఆదివారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను రేవంత్ ఎల్వీ ఆలపించారు. ''యాక్షన్, భావోద్వేగాలతో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. 'భోళా మానియా..' పాట మాస్‌ని ఆకట్టుకునే బీట్‌లతో ఎనర్జిటిక్‌గా ఉంటుంది. చిరంజీవి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను, మెగా అభిమానులను అలరిస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలు పాత్రలో కీర్తి సురేష్ నటిస్తుండగా, సుశాంత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్.

ధనుష్ సరసన త్రిష...?

ధనుష్ సరసన త్రిష నటించనున్నారా? అంటే అవుననే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లోని 50వ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మించనున్న సంగతి తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాకు ధనుష్ స్వీయ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకే త్రిషను సంప్రదించిందట చిత్రయూనిట్. కథ విన్న త్రిష కూడా ఈ సినిమాలో యాక్ట్ చేసేందుకు సుముఖంగానే ఉన్నారట. ఇదిలా ఉంటే... 2016లో వచ్చిన 'కొడి'(తెలుగులో 'ధర్మయోగి') చిత్రంలో ధనుష్‌కు జోడీగా త్రిష కనిపించారు. అయితే ఈ చిత్రంలో త్రిష పాత్ర కాస్త నెగటివ్ టచ్‌తో ఉంటుంది. మరి..ధనుష్‌తో మరోసారి త్రిష స్క్రీన్ షేర్ చేసుకుంటే ఆమె పాత్ర ఎలా ఉండబోతుంది? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.


ధనుష్


త్రిష


ఎన్టీఆర్

బ్యాక్ టు హైదరాబాద్

హీరో ఎన్టీఆర్ వెకేషన్ నుంచి భారత్‌కు తిరిగొచ్చారు. వారంరోజుల క్రితం ఫ్యామిలీతో కలిసి దుబాయ్‌కు వెకేషన్‌కి వెళ్లిన ఆయన, పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్‌లోని స్వగృహానికి చేరుకున్నారు. కాగా ఎన్టీఆర్ ప్రస్తుతం 'దేవర' అనే సినిమా చేస్తున్నారు. 'జనతా గ్యారేజ్'(2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా, నటుడు సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. 'దేవర' సినిమా లేటెస్ట్ షెడ్యూల్ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్, జాన్వీ, సైఫ్.. ఇలా ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటుగా, ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట చిత్రయూనిట్. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

కల్యాణం.. కమనీయం

హీరో శర్వానంద్, రక్షితా రెడ్డి ఏడడుగులేశారు. ఇరు కుటుంబాల పెద్దలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో శర్వా, రక్షితల కల్యాణం శనివారం రాత్రి జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో కమనీయంగా జరిగింది. ముహూర్తానికి శర్వానంద్ క్రీమ్ పింక్ షెర్వానీ, రక్షిత సిల్వర్ క్రీమ్ కలర్ చీరను ధరించారు. వీరి వివాహానికి హీరోలు రామ్‌చరణ్, సిద్ధార్థ్, ఆశిష్, హీరోయిన్ అదితీరావు హైదరీ, నిర్మాతలు వంశీ, విక్రమ్, హర్షిత్, హన్షితలతో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు హాజరై, నూతన వధూవరులకు శుభాకాంక్షలు చెప్పారు. శర్వానంద్-రక్షతల పెళ్లి ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. పలువురు నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా ఈ కొత్తజంటకు అభినందనలు తెలుపుతున్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో శర్వానంద్, రక్షితల పెళ్లి రిసెప్షన్ వేడుక జరగనుంది. కాగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది.


శర్వానంద్, రక్షిత


పరేషాన్‌తో అలాంటి అనుభూతి కలిగింది – తరుణ్ భాస్కర్

''కేరాఫ్ కంచరపాలెం, సినిమా బండి, బలగం..' చిత్రాలు చూసినప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. 'పరేషాన్' మూవీ చూసినప్పుడు కూడా అలాంటి అనుభూతి కలిగింది. సినిమా చూస్తున్నప్పుడు మనల్ని మనం మర్చిపోతే అదే మ్యాజిక్. అలాంటి మ్యాజిక్ 'పరేషాన్' లో జరిగింది'' అని డైరెక్టర్ తరుణ్ భాస్కర్ అన్నారు. తిరువీర్, పావని కరణం జంటగా రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించిన చిత్రం 'పరేషాన్. రానా దగ్గుబాటి సమర్పణలో సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పరేషాన్' సక్సెస్ మీట్‌కి ముఖ్య అతిథిగా తరుణ్ భాస్కర్ హాజరయ్యారు. ''లగాన్' లాంటి టీం కలిసి చేసిన సినిమా ఇది. గెలవాలంటే లాస్ట్ బాల్‌కి సిక్స్ కొట్టాలి.. రానాగారు వచ్చి మాతో సిక్స్ కొట్టించారు'' అన్నారు తిరువీర్. ''పరేషాన్'ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు పావని కరణం. ''పరేషాన్'కి నైజాంలో మరో 75 థియేటర్స్ పెంచుతున్నాం'' అన్నారు రూపక్ రోనాల్డ్‌సన్.


తిరువీర్, తరుణ్ భాస్కర్, రూపక్ రోనాల్డ్, పావని

ట్రైలర్ చూస్తుంటే కన్నీళ్లొచ్చాయి – కె.రాఘవేంద్రరావు

'విమానం' ట్రైలర్ చూస్తుంటే మంచి భావోద్వేగాలతో సినిమా ఉంటుందని తెలుస్తోంది. తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌ని దర్శకుడు శివ ప్రసాద్ ట్రైలర్‌లో అద్భుతంగా చూపించాడు. ట్రైలర్ నా మనసును కదిలించింది.. నాకు కన్నీళ్లొచ్చాయి'' అని డైరెక్టర్ కె.రాఘవేంద్ర రావు అన్నారు. సముద్ర ఖని, అనసూయ భరద్వాజ్, మీరా జాస్మిన్, రాహుల్ రామకృష్ణ, మాస్టర్ ధ్రువన్ కీలక పాత్రల్లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వం వహించిన చిత్రం 'విమానం'. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదలకానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ–''తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి 'విమానం' సినిమా చూడాలి.. అప్పుడే పిల్లల కోసం తల్లిదండ్రులు పడే తపన ఎలా ఉంటుందో తెలుస్తుంది'' అన్నారు. జీ స్టూడియో సౌత్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ప్రసాద్, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు.


శివప్రసాద్, ప్రసాద్, రాఘవేంద్రరావు

ఇప్పుడే పరిచయమే...


శివ కందుకూరి, మేఘా ఆకాష్

శివ కందుకూరి హీరోగా, మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మను చరిత్ర'. ఈ మూవీతో భరత్ పెదగాని దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్.శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. గోపీసుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఇప్పుడే పరిచయమే...' పాటని హీరోయిన్ సంయుక్త మీనన్ లాంచ్ చేశారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, అర్మాన్ మాలిక్ పాడారు.

ప్రేమ ఇంత భారమా..?

సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోషి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భారీ తారాగణం'. శేఖర్ ముత్యాల దర్శకత్వంలో బీవీఆర్ పిక్చర్స్‌పై బీవీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెండే రెండు అక్షరాల ప్రేమ ఇంత భారమా..' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్ర సంగీత దర్శకుడు సుక్కూ రచించిన ఈ పాటను జయశ్రీ పాల్యం ఆలపించారు. ''లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భారీ తారాగణం'. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: చంద్రశేఖర్ గౌడ్.వి, నేపథ్య సంగీతం: సాహిత్య సాగర్.


సదన్, దీపికారెడ్డి

ఓ తండ్రి తీర్పు

రాజేందర్ రాజు కాంచనపల్లి, సురభి శ్రావణి జంటగా ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో శ్రీరామ్ దత్తి నిర్మించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ''ప్రేమ, ఆప్యాయతలు పంచుకోవాల్సిన తల్లిదండ్రులు, పిల్లల స్వార్థపు మత్తులో ఎలా దూరం అవుతున్నారు? ఎంత మానసిక క్షోభకు గురవుతున్నారు? అనేది ఈ చిత్రకథాంశం. ఇందులో రాజేంద్ర రాజు ఆత్మీయత పంచే అల్లుడుగా నటించారు. ఆయన రాసిన 'అమ్మానాన్నలు తెగిన గాలిపటాలు..' టైటిల్ సాంగ్ విన్న ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకుంటారు. అలాగే క్లైమాక్స్‌లో ఆయన రాసిన డైలాగ్స్ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా ఉంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ చెటిపల్లి, సంగీతం: బాపు శాస్త్రి, రచన–దర్శకత్వ పర్యవేక్షణ: రాజేంద్ర రాజు కాంచనపల్లి.


రాజేంద్ర రాజు, సురభి శ్రావణి



భారత రెజ్లర్లకు నిరాశ

వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో చివరిరోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు పతకాలు సాధించడంలో విఫలమయ్యారు. కిర్గిస్తాన్‌లో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో ములాయం యాదవ్ (70 కేజీలు), పంకజ్ (61 కేజీలు) కాంస్య పతకాల కోసం పోటీపడ్డారు. అయితే పంకజ్ 1–6తో ఎమ్రా ఒర్మానొగ్లు (తుర్కియే) చేతిలో, సెర్వెత్ కొస్కున్ (తుర్కియే) చేతిలో ములాయం ఓడిపోయారు. 61 కేజీల విభాగంలో పోటీపడాల్సిన భారత స్టార్ రెజ్లర్ రవి దహియా మోకాలి గాయంతో చివరి నిమిషంలో వైదొలిగాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌కు నాలుగు పతకాలు లభించాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు హాజల్‌వుడ్ దూరం



ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ఆస్ట్రేలియా పేస్ బౌలర్ హాజల్‌వుడ్ దూరమయ్యాడు. ఐపీఎల్‌లో బెంగళూరుకు ఆడిన అతను పక్క టెముకల గాయానికి గురయ్యాడు. ఇంకా కోలుకోకపోవడంతో ఆసీస్ జట్టు నుంచి తప్పించారు. అతని స్థానాన్ని పేసర్ నెసెర్‌తో భర్తీ చేసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్ బెయిలీ తెలిపారు. లండన్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ బుధవారం మొదలవుతుంది.

భారత అథ్లెట్లకు మూడు పతకాలు



రెజోనా

యెచోన్ (కొరియా): ఆసియా అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. మహిళల 400 మీటర్ల విభాగంలో రెజోనా మలిక్ హీనా, పురుషుల డిస్కస్ త్రోలో భరత్‌ప్రీత్ సింగ్ బంగారు పతకాలు సాధించారు. మహిళల 5000 మీటర్ల విభాగంలో అంతిమా పాల్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 16 ఏళ్ల రెజోనా 53.31 సెకన్లలో లక్ష్యానికి చేరింది. భరత్‌ప్రీత్ డిస్క్‌ను 55.66 మీటర్ల దూరం విసిరి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. ఇక అంతిమ పాల్ 17 నిమిషాల 17.11 సెకన్లతో మూడో స్థానంలో నిలిచింది.

అరువు 'పోల్'తో...

పోల్ వాల్ట్ ఈవెంట్‌లో భారత ఆటగాడు దేవ్ కుమార్ మీనాకు నిరాశ ఎదురైంది. ఎయిరిండియా నిర్వాకంతో అరువుతెచ్చిన 'పోల్' (పొడవాటి కర్ర)తో పోటీపడాల్సి రావడంతో అతను మూడు ప్రయత్నాల్లోనూ 4.50 మీటర్ల ఎత్తును అందుకోలేకపోయాడు. 18 ఏళ్ల దేవ్ రోజూ ప్రాక్టీసు చేసుకునే పోల్‌ను ఎయిరిండియా సిబ్బంది సాంకేతిక కారణాలతో అనుమతించలేదు. దీంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్వాహకులకు సమాచారమిచ్చి పోల్‌ను సమకూర్చాల్సిందిగా కోరింది.

జొకోవిచ్ రికార్డు

ఫ్రెంచ్ ఓపెన్‌లో 17వసారి క్వార్టర్ ఫైనల్ చేరిన సెర్బియా స్టార్

- నాదల్ పేరిట ఉన్న రికార్డు బద్దలు



పారిస్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగు వేశాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో జొకోవిచ్ రికార్డు సృష్టిస్తూ 17వసారి ఈ మెగా టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గతంలో రాఫెల్ నాదల్ అత్యధికంగా 16 సార్లు క్వార్టర్ ఫైనల్ చేరగా... నాదల్‌తో సమంగా ఉన్న జొకోవిచ్ తాజా విజయంతో ఈ స్పెయిన్ దిగ్గజాన్ని దాటి ముందుకు వెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6–3, 6–2, 6–2తో యువాన్ పాబ్లో వారిలాస్ (పెరూ)పై గెలుపొందాడు. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఏడు ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన అతను నెట్ వద్దకు 17 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచాడు. ఓవరాల్‌గా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అత్యధికసార్లు క్వార్టర్ ఫైనల్ చేరిన రికార్డు ఫెడరర్ (స్విట్జర్లాండ్; 58 సార్లు) పేరిట ఉంది. జొకోవిచ్ (55 సార్లు) రెండో స్థానంలో, నాదల్ (47 సార్లు) మూడో స్థానంలో, జిమ్మీ కానర్స్ (41 సార్లు) నాలుగో స్థానంలో, రాయ్ ఎమర్సన్ (37 సార్లు) ఐదో స్థానంలో ఉన్నారు. క్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా)తో జొకోవిచ్ ఆడతాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఖచనోవ్ 1–6, 6–4, 7–6 (9/7), 6–1తో సొనెగో (ఇటలీ)పై నెగ్గాడు.

అల్‌కరాజ్ అలవోకగా...

ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) మరో అలవోక విజయంతో రెండోసారి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. అల్‌కరాజ్ 6–3, 6–2, 6–2తో లొరెంజె ముజెట్టి (ఇటలీ)పై గెలిచాడు. ఆరు ఏస్‌లు సంధించిన అల్‌కరాజ్, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), సెబాస్టియన్ ఆఫ్నర్ (ఆస్ట్రియా) మధ్య ప్రిక్వార్టర్ ఫైనల్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ తలపడతాడు.

పావ్లీచెంకోవా ముందంజ...

మహిళల సింగిల్స్ విభాగంలో 2021 రన్నరప్ పావ్లీచెంకోవా (రష్యా), ముకోవా (చెక్ రిపబ్లిక్), స్వితోలినా (ఉక్రెయిన్) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో పావ్లీచెంకోవా 3 గంటల 9 నిమిషాల్లో 3–6, 7–6 (7/3), 6–3తో ఎలీజ్ మెర్‌టెన్స్ (బెల్జియం)ను ఓడించగా... ముకోవా 6–4, 6–3తో అవనెస్యాన్ (రష్యా)పై గెలిచింది. స్వితోలినా గంటా 56 నిమిషాల్లో 6–4, 7–6 (7/5)తో తొమ్మిదో సీడ్ కసత్‌కినా (రష్యా)ను బోల్తా కొట్టించింది. కసత్‌కినా ఓటమితో ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో టాప్–10లో నలుగురు మాత్రమే బరిలో మిగిలారు.

44 ఏళ్ల తర్వాత...

బ్రెజిల్‌కు చెందిన 14వ సీడ్ బీట్రిజ్ హదాద్ మాయ మూడో రౌండ్ మ్యాచ్‌లో 5–7, 6–4, 7–5తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై నెగ్గి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. అంతేకాకుండా 44 ఏళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన బ్రెజిల్ క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందింది. బ్రెజిల్ తరఫున చివరిసారి 1979లో పాట్రిసియా మెద్రాడో ఈ ఘనత సాధించింది.

అర్జున్‌కు మూడో స్థానం

టైటిల్ నిలబెట్టుకున్న అరవింద్ చిదంబరం



అర్జున్



అరవింద్

దుబాయ్: దుబాయ్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు అరవింద్ చిదంబరం, ఇరిగేశి అర్జున్ మెరిశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల అరవింద్ వరుసగా రెండో ఏడాది చాంపియన్‌గా నిలువగా... తెలంగాణకు చెందిన 19 ఏళ్ల అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో అరవింద్, జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్), అర్జున్, మాక్సిమ్ మత్లకోవ్ (రష్యా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... అరవింద్‌కు టైటిల్ ఖరారు అయింది. సిందరోవ్ తొలి రన్నరప్‌గా, అర్జున్ రెండో రన్నరప్‌గా నిలిచారు. ఈ టోర్నీలో అరవింద్, అర్జున్ అజేయంగా నిలిచారు. ఒక్క గేమ్‌లోనూ ఓడిపోలేదు. అరవింద్, అర్జున్‌లిద్దరు చెరో నాలుగు గేముల్లో గెలిచి, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. చాంపియన్ అరవింద్‌కు 12 వేల డాలర్లు (రూ. 9 లక్షల 88 వేలు), సిందరోవ్‌కు 8 వేల డాలర్లు, అర్జున్‌కు 6 వేల డాలర్లు (రూ. 4 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఇదే టోర్నీలో ఆడిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కార్తీక్ వెంకటరామన్ 12వ ర్యాంక్‌లో, లలిత్ బాబు 18వ ర్యాంక్‌లో... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్లు రాజా రిత్విక్ 58వ ర్యాంక్‌లో, హర్ష భరతకోటి 61వ ర్యాంక్‌లో నిలిచారు.

అనిరుధ్-విజయ్ జోడీకి డబుల్స్ టైటిల్



విన్నర్స్ ట్రోఫీతో అనిరుధ్, విజయ్ సుందర్ ప్రశాంత్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది తమ నిలకడైన ప్రదర్శనను కొనసాగిస్తూ హైదరాబాద్ టెన్నిస్ యువ తార అనిరుధ్ చంద్రశేఖర్ సీజన్‌లో మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజయ్ సుందర్ ప్రశాంత్ (తమిళనాడు)తో కలిసి అనిరుధ్ ఆదివారం ఇటలీలో ముగిసిన విసెంజా ఓపెన్ చాలెంజర్–75 టోర్నీలో డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. 74 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అనిరుధ్-విజయ్ ద్వయం 6–3, 6–2తో ఫెర్నాండో రొంబోలి-మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్) జోడీపై గెలిచింది. టైటిల్ గెలిచే క్రమంలో అనిరుధ్-విజయ్ జోడీ ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. అనిరుధ్-విజయ్‌లకు 4,250 యూరోల (రూ. 3 లక్షల 75 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది అనిరుధ్-విజయ్ ద్వయం పుణే, స్పెయిన్ చాలెంజర్ టోర్నీల్లో డబుల్స్ టైటిల్ గెలిచి, స్ప్లిట్ ఓపెన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. అనిరుధ్‌కు అతని సోదరుడు విఘ్నేశ్ పెరణమల్లూర్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

గౌతమి-అభినవ్ జోడీకి స్వర్ణం



సుల్ (జర్మనీ): జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి భానోత్-అభినవ్ షా జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో గౌతమి-అభినవ్ ద్వయం 17–7తో ఓషిన్ ముల్లర్-రొమైన్ అఫ్రె (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సంయమ్-అభినవ్ చౌధరీ (భారత్) జంట రజత పతకం సాధించింది.

వెర్‌స్టాపెన్ 'హ్యాట్రిక్'

సీజన్‌లో వరుసగా మూడో విజయం



మోంట్‌మెలో (స్పెయిన్): ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తన జోరు కొనసాగిస్తున్నాడు. ఆదివారం జరిగిన స్పానిష్ గ్రాండ్‌ప్రిలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్ నిలబెట్టుకున్నాడు. 66 ల్యాప్‌ల రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 27 నిమిషాల 57.940 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. హామిల్టన్ (మెర్సిడెస్) రెండో స్థానంలో, రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానంలో, పెరెజ్ (రెడ్‌బుల్) నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది వరుసగా మూడో విజయంకాగా, ఓవరాల్‌గా ఐదో టైటిల్ కావడం విశేషం. ఈ సీజన్‌లో మొత్తం ఏడు రేసులు జరగ్గా... ఏడింటిలోనూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే విజేతగా నిలువడం గమనార్హం. వెర్‌స్టాపెన్ బహ్రెయిన్, ఆస్ట్రేలియా, మయామి, మొనాకో, స్పానిష్ రేసుల్లో నెగ్గగా... పెరెజ్ సౌదీ అరేబియా, అజర్‌బైజాన్ రేసుల్లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సీజన్‌లోని ఎనిమిదో రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రి ఈనెల 18న జరుగుతుంది.

శ్రీలంక భారీ విజయం

రెండో వన్డేలో అఫ్గానిస్తాన్ ఓటమి



సమరవిక్రమ, కుశాల్

హంబన్‌తోట: అఫ్గానిస్తాన్‌తో సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో శ్రీలంక సమష్టి ప్రదర్శన కనబరిచింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో లంక 132 పరుగుల తేడాతో నెగ్గింది. మూడు వన్డేల సిరీస్‌లో షనక బృందం 1–1తో సమంగా నిలిచింది. తొలుత లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 323 పరుగుల భారీస్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (75 బంతుల్లో 78; 7 ఫోర్లు, 1 సిక్స్), కరుణరత్నే (62 బంతుల్లో 52; 7 ఫోర్లు) ధాటిగా ఆడారు. సమరవిక్రమ (46 బంతుల్లో 44; 5 ఫోర్లు), ధనంజయ (29 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), హసరంగ (29 నాటౌట్; 4 ఫోర్లు,1 సిక్స్) మెరుగ్గా ఆడారు. తర్వాత అఫ్గానిస్తాన్ 42.1 ఓవర్లలో 191 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జద్రాన్ (54; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హష్మతుల్లా (57; 6 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధనంజయ డిసిల్వా (3/39), హసరంగ (3/42), చమీరా (2/18) అఫ్గాన్ బ్యాటర్ల పని పట్టారు. నిర్ణాయక ఆఖరి వన్డే కూడా ఇదే వేదికపై 7న జరుగుతుంది.

హారిక శుభారంభం



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, కోనేరు హంపిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తొలి రౌండ్‌లో హారిక 80 ఎత్తుల్లో ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)పై గెలుపొందగా... 2020 చాంపియన్ హంపి 41 ఎత్తుల్లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడిపోయింది. మొత్తం పది మంది మేటి మహిళా క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. మొత్తం 1,80,000 డాలర్ల (రూ. కోటీ 48 లక్షలు) ప్రైజ్‌మనీతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. మొత్తం 10 మంది క్రీడాకారిణులకు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. విజేతకు 45 వేల డాలర్లు (రూ. 37 లక్షలు)... రన్నరప్ ప్లేయర్‌కు 35 వేల డాలర్లు (రూ. 28 లక్షల 84 వేలు)... మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్-ఆర్ఆర్‌బీల్లో 8612 పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. రీజనల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్‌బీ)ల్లో కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్-XII(సీఆర్‌పీ) ద్వారా వివిధ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రకటనను విడుదలచేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 8612
» **పోస్టుల వివరాలు:** ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్)-5538, ఆఫీసర్ స్కేల్-1 (ఏఎం)-2485, జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్(మేనేజర్)స్కేల్-2-332, ఐటీ ఆఫీసర్ స్కేల్2-68, సీఏ ఆఫీసర్ స్కేల్2-21, లా ఆఫీసర్ స్కేల్2-24, ట్రెజరీ మేనేజర్ స్కేల్2-08, మార్కెటింగ్ ఆఫీసర్ స్కేల్2-03, అగ్రికల్చర్ ఆఫీసర్ స్కేల్2-60, ఆఫీసర్ స్కేల్3(సీనియర్ మేనేజర్)-73.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.06.2023 నాటికి ఆఫీసర్ స్కేల్3 (సీనియర్ మేనేజర్) పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్2(మేనేజర్) పోస్టులకు 21 నుంచి 32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్1(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాతపరీక్ష, మెయిన్స్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** 01.06.2023 నుంచి 21.06.2023 వరకు
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది:** ఆగస్టు 2023.
» **ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షతేది:** సెప్టెంబర్ 2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

బీడీఎల్, హైదరాబాద్‌లో 12 మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **విభాగాలు:** వీఎస్ఎస్ఐ డిజైనర్/ఎంబెడెడ్ డిజైనర్, మైక్రోవేవ్ డిజైనర్, కంప్యూటర్ విజన్ సాఫ్ట్‌వేర్ డిజైనర్, సీఏఈ/ఎఫ్ఈఏ ఇంజనీర్, క్యూసీ మెకానికల్, ఎలక్ట్రానిక్స్ తదితరాలు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1.6 లక్షలు చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.07.2023.
» **వెబ్‌సైట్:** www.bdl-india.in

గ్రూప్స్‌కు వేళాయే..!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఉద్యోగార్థులకు శుభవార్త అందించింది. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్.. స్వప్నంగా భావించే.. గ్రూప్-1, గ్రూప్-2 సర్వీసుల్లో.. 1000 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు! వీలైనంత త్వరగా.. నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో.. గ్రూప్స్ అభ్యర్థులు తమ స్వప్నం సాకారం చేసుకునేందుకు అడుగులు వేయాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో త్వరలో వెలువడనున్న గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

గతేడాది జారీ చేసిన గ్రూప్–1 నియామక ప్రక్రియ కొనసాగుతుండగానే.. ప్రభుత్వం గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్‌లపై స్పష్టత ఇవ్వడంతో అభ్యర్థుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గ్రూప్ 1తో పాటు గ్రూప్–2 పోస్టుల భర్తీకి కూడా ఉపక్రమించడంతో.. అభ్యర్థులకు ఒకే సమయంలో రెండు పరీక్షలకు పోటీ పడే అవకాశం కూడా లభిస్తుంది.

గ్రూప్-1లో 100, గ్రూప్-2లో 900

గ్రూప్–1 నోటిఫికేషన్ ద్వారా 100 పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, ఆర్‌టీఓ, సీటీఓ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉంటాయి. అదే విధంగా గ్రూప్ 2 నోటిఫికేషన్ ద్వారా 900 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో డిప్యూటీ తహశీల్దార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సబ్ రిజిస్ట్రార్, ఏసీటీఓ వంటి పోస్టులు ఉంటాయి. ఈ రెండు సర్వీసులకు కూడా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

గ్రూప్-1 పరీక్ష విధానం

- గ్రూప్–1 పరీక్ష రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశ ప్రిలిమినరీ పరీక్ష, రెండో దశ మెయిన్ ఎగ్జామ్.
- **ప్రిలిమ్స్:** తొలి దశ ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1లో హిస్టరీ అండ్ కల్చర్, రాజ్యాంగం, పాలిటీ, సోషల్ జస్టిస్, అంతర్జాతీయ సంబంధాలు; భారత్, ఆంధ్రప్రదేశ్ ఎకానమీ, జాగ్రఫీ అంశాలు 120 మార్కులకు ఉంటాయి. పేపర్2లో జనరల్ అప్టిట్యూడ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలు 120 మార్కులకు ఉంటాయి. ఇలా మొత్తంగా రెండు పేపర్లు 240 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో 120 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు.
- **750 మార్కులకు మెయిన్:** గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో అయిదు పేపర్లుగా 750 మార్కులకు ఉంటుంది.

» మరికొద్ది రోజుల్లో గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు
» గ్రూప్-1లో 100, గ్రూప్-2లో 900 పోస్టులు
» నియామకానికి ప్రభుత్వ ఆమోదం
» బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» గ్రూప్స్ కల సాకారానికి సన్నద్ధమవ్వాల్సిన తరుణం

- **పర్సనాలిటీ టెస్ట్:** గ్రూప్–1లో మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 75 మార్కులు ఉంటాయి. మెయిన్, ఇంటర్వ్యూ మార్కులను పరిగణనలోకి తీసుకొని విజేతలను ఖరారు చేస్తారు.

గ్రూప్-2 రెండు దశలు.. మూడు పేపర్లు

- గ్రూప్–2 పరీక్ష.. స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్.. ఇలా రెండు దశలుంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది.
- మొదటి దశ స్క్రీనింగ్ టెస్ట్‌లో పేపర్–1, జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో భారత చరిత్ర, భౌగోళిక శాస్త్రం, భారత సమాజం, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ అంశాలు ఉంటాయి.
- **రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్:** స్క్రీనింగ్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను రెండో దశ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి.
- పేపర్ 1లో సెక్షన్–1 ఆంధ్రప్రదేశ్ సామాజిక సాంస్కృతిక చరిత్ర, సెక్షన్–2 భారత రాజ్యాంగం 150 మార్కులకు; పేపర్–2లో సెక్షన్–1: భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ, సెక్షన్–2: సైన్స్ అండ్ టెక్నాలజీ 150 మార్కులకు..ఇలా మొత్తం 300 మార్కులకు మెయిన్ ఎగ్జామ్ జరుగుతుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.
- ప్రతి పేపర్‌లోనూ ఒక్కో సెక్షన్ నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు.
- గ్రూప్–2లో అభ్యర్థులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహించే అవకాశం ఉంది.

సిలబస్‌పై అవగాహన

ముందుగా అభ్యర్థులు సిలబస్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. ఇప్పటి వరకు చదివిన టాపిక్స్, సిలబస్‌లో వాటికి కల్పిస్తున్న వెయిటేజీని గమనించాలి. దీనికి అనుగుణంగా కొత్త సిలబస్‌లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అంశాలను గుర్తించాలి. రెండు పరీక్షల్లో దాదాపు 80 శాతం సిలబస్ అంశాలు ఒకే మాదిరిగా ఉన్నాయి. కాబట్టి గ్రూప్స్ అభ్యర్థులు గ్రూప్–1, 2 రెండు సర్వీసుల ప్రిపరేషన్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి.

విశ్లేషణతో విజయం దిశగా

- అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచే ఆయా అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన, విశ్లేషణ, స్వీయ అభిప్రాయ దృక్పథం పెంచుకోవాలి. ముఖ్యమైన అంశాలకు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో అవగాహన చేసుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా నవరత్నాలు, అమలు చేస్తున్న పథకాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు లబ్ధి పొందిన వారి సంఖ్య తదితర వివరాలను ఔపోసన పట్టాలి.
- రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటిద్వారా కలిగిన అభివృద్ధిపై దృష్టి సారించాలి. అదే విధంగా జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, కీలకమైన తీర్పుల గురించి తెలుసుకోవాలి.

అన్వయ దృక్పథం

గ్రూప్స్ అభ్యర్థులు ప్రతి అంశాన్ని చదివేటప్పుడు అన్వయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. ముఖ్యంగా సమకాలీన అంశాలు సమ్మిళితంగా ఉండే ఎకానమీ, పాలిటీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీల్లో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. అదే విధంగా చదివే సమయంలోనే రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

గత ప్రశ్న పత్రాల సాధన

గ్రూప్స్ ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు గత ప్రశ్న పత్రాలను పరిశీలించడం, వాటిని సాధన చేయడం కూడా ఎంతో మేలు చేస్తుంది. దీనివల్ల పరీక్షలో సదరు అంశాలకు లభిస్తున్న వెయిటేజీపై అవగాహన లభిస్తుంది. ప్రశ్నలు అడుగుతున్న తీరు తెలుస్తుంది. దీంతో..ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు.. పరీక్షలో ప్రశ్నలు అడిగే కోణంలో సమాధానాలు సిద్ధం చేసుకునే సామర్థ్యం ఏర్పడుతుంది.

షార్ట్ నోట్స్

గ్రూప్స్ అభ్యర్థులు ప్రిపరేషన్ కోణంలో అనుసరించాల్సిన మరో వ్యూహం.. షార్ట్ నోట్స్‌ను రూపొందించుకోవడం. ఆయా అంశాలను చదువుతున్నప్పుడే.. వాటిలోని ముఖ్యాంశాలు, కాన్సెప్ట్‌లతో షార్ట్ నోట్స్ రాసుకుంటే..పరీక్షకు ముందు పునశ్చరణకు ఉపయుక్తంగా ఉంటుంది. షార్ట్ నోట్స్ ఆధారంగా వేగంగా రివిజన్ చేసుకునే అవకాశం లభిస్తుంది.

గ్రూప్-2.. మార్పులను పరిశీలించి

గ్రూప్–2కు సంబంధించి గతేడాది మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. స్క్రీనింగ్ టెస్ట్‌లో ఆయా అంశాల నుంచి వచ్చే ప్రశ్నల సంఖ్యను కూడా నిర్దిష్టంగా పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు తమ ప్రిపరేషన్ సమయాన్ని వెచ్చించాలి. ఇలా సిలబస్ పరిశీలనతో ప్రారంభించి పునశ్చరణ వరకు ప్రతి విషయంలో నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే..గ్రూప్స్ పరీక్షల్లో విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

పట్టు సాధించాల్సిన అంశాలు

- **హిస్టరీ:** రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ..ముఖ్యమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. ఇదే తీరులో భారతదేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- **జాగ్రఫీ:** రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్టులు..వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **పాలిటీ:** రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు.. తాజా పరిణామాలు (రాజ్యాంగ సవరణలు, వాటి ప్రభావం) తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన పెంచుకోవాలి. వాస్తవానికి దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలు లేనప్పటికీ.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు కొంత మేలు చేస్తాయి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు.. వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. సివిల్, క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి తెలుసుకోవాలి.
- **ఎకానమీ:** మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తుల నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై అవగాహన పొందాలి.
- **పునర్విభజన చట్టం:** గ్రూప్స్ అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన మరో కీలక అంశం.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014. ఈ చట్టం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు ఈ చట్టాన్ని ప్రత్యేక దృష్టితో అభ్యసించాలి. రాష్ట్ర విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి సమకాలీన అంశాలతో కూడిన సమాచారంతో పరీక్ష సమయానికి సన్నద్ధత సాధించాలి.
- **ప్రభుత్వ సంక్షేమ పథకాలు:** అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలపైనా అవగాహన పెంచుకోవాలి. నవరత్నాలు, వాటి పరిధిలో అందుబాటులో ఉన్న పథకాలు, లబ్ధిదారులు, ఇప్పటి వరకు మంజూరు చేసిన మొత్తాలు వంటి వాటిపై గణాంక సహిత సమాచారంతో సన్నద్ధమవ్వాలి.



ఏపీపీఎస్సీ ఎగ్జామ్స్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	119	62,547
నిఫ్టీ ▲	46	18,534

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,241	▲	140
డోజోన్స్	33,763	▲	701
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,607	▲	117
డాక్స్	16,051	▲	198
షాంఘై	3,230	▲	25
నికాయ్	31,524	▲	376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



స్కోర్ కొట్టు... లోన్ పట్టు!

అనుకోకుండా ఖర్చు వచ్చి పడితే ఏం చేయాలో తోచదు. వైద్యం, ఇంటి మరమ్మతులు, వేతనంలో కోత, ఉద్యోగం కోల్పోవడం, స్కూల్ ఫీజు.. అవసరం ఏదైనా వెంటనే డబ్బు కావాల్సి వస్తే.. క్రెడిట్ కార్డు నుంచి పరిమితి మేరకు డ్రా చేసుకుని గట్టెక్కేస్తుంటారు. ఇది కాకుండా అందుబాటులో ఉన్న మరో మార్గం వ్యక్తిగత రుణం (పర్సనల్ లోన్). హామీతో పని లేకుండా ఆదాయ వనరు ఉన్న ప్రతి ఒక్కరూ సులభంగా పొందగలిగే రుణం ఇది. దాదాపు అన్ని బ్యాంకులు మెరుగైన క్రెడిట్ స్కోరు ఉన్న కస్టమర్లకు పర్సనల్ లోన్ ఇచ్చేందుకు ఉత్సాహం చూపిస్తుంటాయి. వేగంగా ఒకటి రెండు రోజుల్లోనే రుణం మొత్తం చేతికి అందుతుంది. ప్రక్రియ ఎంతో సులభం, అందుకే నేటి రోజుల్లో పర్సనల్ లోన్ సాధనాన్ని ఎక్కువ మంది ఉపయోగించుకుంటున్నారు. అయితే, వ్యక్తిగత రుణం అయినా, గృహ రుణం అయినా వడ్డీ రేటు విషయంలో కొంచెం శ్రద్ధ అవసరం. దీనివల్ల పెద్ద మొత్తంలో ఆదా చేసుకోవచ్చు. కనీసం ఐదారేళ్ల కాలానికి వ్యక్తిగత రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తుంటాయి. అన్నేళ్లలో వడ్డీ రూపేణా పెద్ద మొత్తంలో చెల్లింపులు చేయాల్సి వస్తుంది. అందుకని వీలైనంత తక్కువ వడ్డీ రేటుకు వ్యక్తిగత రుణాన్ని పొందే మార్గాలను అన్వేషించాలి. వీటిపై అవగాహన కల్పించే కథనమే ఇది.


వ్యక్తిగత రుణం తీసుకునే వారు ముందు పరిశీలించాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. ప్రాసెసింగ్ ఫీజును పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే, వడ్డీ రేటు ఆధారంగా బ్యాంక్‌ను ఖరారు చేసుకోవాలి. ఖాతా ఉన్న బ్యాంకులోనే వ్యక్తిగత రుణం పొందాలనేమీ లేదు. తక్కువ రేటుకు వస్తుంటే ఇతర బ్యాంకుల ఆఫర్లను అయినా పరిశీలించొచ్చు. అయితే తక్కువ రేటుకు వ్యక్తిగత రుణం పొందేందుకు కొన్ని చిట్కాలున్నాయి. ఇందులో ముందుగా వ్యక్తిగత క్రెడిట్ స్కోరును పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి. ఒకవైపు మన వ్యక్తిగత రుణ చరిత్ర బలంగా ఉండేలా (మెరుగైన స్కోర్) చూసుకోవాలి. మరోవైపు తక్కువ రేటుకు వ్యక్తిగత రుణాన్ని ఆఫర్ చేసే బ్యాంక్‌లను గుర్తించాలి.

•••

మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి బ్యాంకులు కొంచెం తక్కువ రేటుకు రుణాన్నిచ్చేందుకు ఆసక్తి చూపిస్తాయి. ఎందుకంటే ఆ రుణం నమ్మకంగా తిరిగి వస్తుంది. డిఫాల్ట్ అవకాశాలు ఉండవు. రిస్క్ దాదాపుగా ఉండదు కనుక తక్కువ రేటుకు ఇస్తాయి. ''వ్యక్తిగత రుణాన్ని ఎలాంటి తనఖా లేదా హామీ లేకుండా బ్యాంకులు ఇస్తాయి. కనుక బ్యాంకులు ఎంత రుణం ఇవ్వాలి, ఎంత కాలానికి ఇవ్వాలి, ఎంత వడ్డీ రేటుకు ఇవ్వాలనే అంశాలను నిర్ణయించే విషయంలో రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు కీలక పాత్ర పోషిస్తుంది. అధిక క్రెడిట్ స్కోరు ఉన్న వారు వడ్డీ రేటు తగ్గించా



లంటూ బ్యాంకులను డిమాండ్ చేయవచ్చు''అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, సహజ్‌మనీ వ్యవస్థాపకుడు అభిషేక్ కుమార్ సూచించారు. క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌ను ఉపయోగించుకునే వారు సకాలంలో బిల్లులను చెల్లించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ డిఫాల్ట్ కాకూడదు. అలాగే, రుణం ఏదైనా కానీయండి ఈఎంఐల చెల్లింపుల విషయంలో బాధ్యతగా, క్రమశిక్షణగా వ్యవహరించాలి. వీలుంటే ఆటోమేటిక్‌గా చెల్లింపులు జరిగే ఆప్షన్ నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత రుణం తీసుకోవాలని భావిస్తుంటే, అప్పటికే ఉన్న ఇతర రుణాలను తీర్చివేయడం వల్ల కూడా క్రెడిట్ స్కోర్ మెరుగుపడుతుంది. ''మీ క్రెడిట్ కార్డ్ వినియోగ చరిత్ర చాలా సాఫీగా ఉండాలి. క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులను కొన్ని రోజులు కూడా ఆలస్యం చేయొద్దు. ఒకటి రెండు సార్లు సకాలంలో చెల్లింపులు చేయకపోయినా, అది క్రెడిట్ చరిత్రలో మచ్చగా చేరొచ్చు. అప్పుడు రుణాలిచ్చే సంస్థలు దీన్ని రిస్క్‌గా భావిస్తాయి. రుణ వడ్డీ రేటును ప్రభావితం చేస్తుంది'' అని ఇన్‌క్రెడ్ రిస్క్ అండ్ అనలైటిక్స్ ప్రెసిడెంట్ పృథ్వీ చంద్రశేఖర్ తెలిపారు. అవగాహన లేక క్రెడిట్ కార్డ్, వాహన, ఇతర రుణ వాయిదాల చెల్లింపుల్లో వైఫల్యం చోటుచేసుకుంటే అది భవిష్యత్తులో వారు తీసుకోబోయే రుణాలపై అధిక రేట్లకు దారితీస్తుందని గమనించాలి. అందుకే బ్యాంక్‌లు రుణ చరిత్రలో మచ్చలు ఉండి, రిస్క్ ఖాతాలుగా భావిస్తే అటువంటి వారికి సాధారణం కంటే అధిక వడ్డీ రేటుకే రుణాలు మంజూరు చేస్తాయి. అదే సమయంలో చెల్లింపుల్లో ఎలాంటి వైఫల్యం లేని, మెరుగైన రుణ చరిత్ర ఉన్న వారికి తక్కువ రేటుకు ఆఫర్ చేస్తాయి.



మార్గాలు..

రుణ చెల్లింపులు సకాలంలో చేయడం వల్ల క్రెడిట్ స్కోరుపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. రుణ వినియోగ రేషియో కూడా క్రెడిట్ స్కోరులో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంటే మీకు అందుబాటులో ఉన్న రుణం పరిమితిలో ఎంత వినియోగించుకున్నారనేది. రుణంపై మీరు ఏ మేరకు ఆధారపడుతున్నారో ఇది తెలియజేస్తుంది. నిపుణుల సూచన ప్రకారం.. క్రెడిట్ యూసేజ్ రేషియో 30 శాతం లోపు కొనసాగించాలి. ఉదాహరణకు క్రెడిట్ కార్డుపై రూ.1 లక్ష క్రెడిట్ లిమిట్ ఉందని అనుకుందాం. అప్పుడు మీ వినియోగం రూ.30 వేల వరకు ఉండాలి. ఒకటికి మించి క్రెడిట్ కార్డులు వాడుతున్న వారికి కూడా ఇదే వర్తిస్తుంది. ఒకే సమయంలో ఎక్కువ రుణాలకు దరఖాస్తు చేస్తుండడం కూడా క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అందుకే ఒకేసారి వెంటవెంట ఒక టికి మించిన క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవద్దు. అంతేకాదు ఒకటికి మించిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద వ్యక్తిగత రుణానికి అభ్యర్థనలు ఇవ్వొద్దు. దీనివల్ల ఏకకాలంలో ఒకటికి మించిన క్రెడిట్ అభ్యర్థనల సమాచారం క్రెడిట్ బ్యూరోలకు చేరుతుంది. అది క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపిస్తుంది.

వేతన ఖాతా..

ఉద్యోగులకు పర్సనల్ లోన్ విషయంలో బ్యాంకుల నుంచి మంచి ఆఫర్లు లభిస్తుంటాయి. వేతన ఖాతా ఉన్న బ్యాంకు నుంచి తీసుకోవడం అనుకూలమనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే మీ నెలవారీ వేతన జమ, మీ ఖర్చులు, ఉపసంహరణ వివరాలు ఖాతాలో నమోదై ఉంటాయి. కనుక రుణానికి ముందు బ్యాంక్ అధికారి వాటిని చూసి ఓ అంచనాకు రాగలరు. అందుకే వేతన ఖాతాలున్న వారికి ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్‌ను చాలా బ్యాంకులు డిజిటల్‌గా ఆఫర్ చేస్తుంటాయి. బ్యాంకు సిబ్బందితో మాట్లాడి తక్కువ రేటుకు రుణం పొందొచ్చు. ''బ్యాంకులు సాధారణంగా తమ ఖాతాదారులకు సంబంధించి నియమ నిబంధనలు, షరతుల విషయంలో కొంచెం అనుకూలంగానే వ్యవహరిస్తుంటాయి. అంటే వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు తగ్గించడం, వేగంగా మంజూరు చేస్తాయి. సంబంధిత ఖాతాదారుకు సంబంధించి వేతనం, ఇతర వ్యయాల సమాచారం అందుబాటులో ఉండడం వల్ల ఆర్థిక స్థిరత్వం, సామర్థ్యాన్ని బ్యాంకులు అంచనా వేయగలవు''అని అప్నా పైసా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వీ స్వామినాథన్ పేర్కొన్నారు.

ఇతర చార్జీలనూ చూడాలి..

వ్యక్తిగత రుణంలో ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, ఇతర చార్జీలను పరిగణనలోకి తీసుకోవాలి. రుణంపై వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు, ముందుగా తీర్చేస్తే పడే చార్జీలు తెలుసుకుని నిర్ణయానికి రావాలి. కొన్ని బ్యాంకులు ఫ్లాట్ ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. ఇతర బ్యాంకులు రుణం మొత్తంపై 1–3 శాతం మధ్య ప్రాసెసింగ్ ఫీజు విధిస్తున్నాయి. రుణం ముందుగా చెల్లిస్తే విధించే చార్జీలు కూడా బ్యాంకుల మధ్య వేర్వేరుగా ఉంటాయి. అందుకే భవిష్యత్తులో ముందుగా తీర్చివేసే ఉద్దేశం ఉందా అని చూడాలి.

ఆఫర్లు..

వ్యక్తిగత రుణం తీసుకునే ముందు వివిధ బ్యాంకుల ఆఫర్లను, రుణ రేట్లు, నియమ, నిబంధనలు, షరతులు అన్నీ చూడాలి. ఆ తర్వాతే ఆకర్షణీయమైన ఆఫర్‌ను వినియోగించుకోవాలి. ముందుగా వేతన ఖాతా, డిపాజిట్లు ఉన్న బ్యాంకును అడిగి చూడాలి. ఆ తర్వాత వివిధ బ్యాంకుల రుణ రేట్లు, ఇతర ఆఫర్ల సమాచారం పొందొచ్చు. సాధారణంగా బ్యాంకుల వెబ్‌సైట్లో వ్యక్తిగత రుణాలపై ఫిక్స్‌డ్ రేటు ప్రదర్శించరు. కనిష్టం నుంచి గరిష్టం రేటును ప్రదర్శిస్తాయి. మెరుగైన క్రెడిట్ స్కోరు ఉన్న వారికి అందులో కనిష్ట రేటుకే రుణం లభించే అవకాశాలున్నట్టు అర్థం చేసుకోవచ్చు. ''రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు ఒక్కటే కాకుండా, కోరుకుంటున్న రుణం మొత్తం, లోన్ టు వ్యాల్యూ రేషియో, నెలవారీ ఆదాయం, ఉద్యోగ స్వరూపం, ఇతర అంశాలను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి'' అని పైసా బజార్ సీనియర్ డైరెక్టర్ సని అరోరా తెలిపారు. కొన్ని బ్యాంకులు పండుగలు, ఇతర సమయాల్లో ప్రత్యేక రుణ మేళాలను నిర్వహిస్తుంటాయి. ఆ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు మాఫీ, వడ్డీ రేటుపై రాయితీలు ఇస్తుంటాయి. కనుక వాటిని పరిశీలించొచ్చు. వీలైనన్ని రుణ సంస్థల మధ్య వ్యక్తిగత రుణ ఆఫర్లను పోల్చుకోవాలని అరోరా సూచించారు. ప్రముఖ సంస్థల ఉద్యోగులకు కొన్ని బ్యాంకులు కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తుంటాయి. అలాంటివి ఏవైనా ఉన్నాయేమో చూడాలి.



వడ్డీ రేటుపై అవగాహన...

తక్కువ రేటుపై వ్యక్తిగత రుణాన్ని తీసుకున్నా.. రుణం కాల వ్యవధిలో వడ్డీ రూపంలో పెద్ద మొత్తమే చెల్లిస్తుంటారు. ముందుగా బ్యాంకులు రుణంపై వడ్డీ రేటును ఎలా లెక్కిస్తాయన్నది తెలుసుకోవాలి. ఫ్లాట్ రేటు, లేదా తగ్గింపు రేటును బ్యాంకులు ఆఫర్ చేయొచ్చు. ఫ్లాట్ వడ్డీ రేటు అయితే రుణం కాల వ్యవధి అంతటా అసలు మొత్తం (ప్రిన్సిపల్)పైనే వడ్డీ రేటు అమలవుతుంది. ఉదాహరణకు రూ.5 లక్షల రుణాన్ని 12 శాతం రేటుపై మూడేళ్లకు తీసుకున్నారనుకోండి. మొత్తం మీద రూ.1,80,000ను వడ్డీ కింద చెల్లించాలి. నెలవారీ ఈఎంఐ రూ.18,889 అవుతుంది. అదే తగ్గింపు వడ్డీ రేటు విధానంలో.. ప్రతీ వాయిదాకు ముందు మిగిలిన ఉన్న బకాయిపైనే వడ్డీ రేటును బ్యాంకులు లెక్కిస్తాయి. రూ. 5 లక్షల రుణాన్ని తగ్గింపు రేటు విధానంలో 12 శాతం రేటుపై మూడేళ్లకు తీసుకున్నారని అనుకుందాం. అప్పుడు మూడేళ్లలో వడ్డీ రూపేణా రూ.97,858 చెల్లించాల్సి వస్తుంది. నెలవారీ ఈఎంఐ రూ.16,607 అవుతుంది. దీంతో మొత్తం మీద ఈ విధానం వల్ల రూ.82,142 ఆదా అవుతుంది. అందుకే రెడ్యూసింగ్ ఇంటరెస్ట్ రేట్ విధానంలోనే వ్యక్తిగత రుణాన్ని తీసుకోవాలి. పర్సనల్ లోన్‌పై తక్కువ రేటుకు ఇస్తామంటే బుట్టలో పడిపోకుండా.. రుణంపై వడ్డీ రేటును నెలవారీ ఎలా లెక్కిస్తారో అడిగి స్పష్టత తెచ్చుకోవాలి.

ఐటీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీఐ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఐటీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌ను పరిచయం చేసింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ జూన్ 12న ముగియనుంది. 30 కంపెనీల్లో ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడి చేయనుంది. అప్లికేషన్ కనీస ధర రూ.5,000. ధీమంత్ షా, రోహన్ కొర్డే ఈ ఫండ్‌ను నిర్వహిస్తారని కంపెనీ తెలిపింది. ఐటీఐ మ్యూచువల్ ఫండ్ నిర్వహణలో రూ.4,011 కోట్ల ఆస్తులు ఉన్నాయి.

పతంజలి ఫుడ్స్ డివిడెండ్ రూ. 6



హైదరాబాద్: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం పతంజలి ఫుడ్స్ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరానికి(2022–23) డివిడెండును ప్రకటించింది. గత నెలాఖరున సమావేశమైన కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి 300 శాతం డివిడెండును ప్రకటించింది. వెరసి రూ. 2 ముఖ విలువగల ప్రతీ షేరుకీ రూ. 6 చొప్పున చెల్లించనుంది. కాగా.. గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో పతంజలి ఫుడ్స్ నికర లాభం 12 శాతం బలపడి రూ. 264 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ. 6,676 కోట్ల నుంచి రూ. 7,963 కోట్లకు జంప్‌చేసిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

05-6-2023	
విశాఖ	515-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
4-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

స్టాక్స్ వ్యూ

ఎన్‌టీపీసీ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 174

టార్గెట్: రూ. 205

ఎందుకంటే: గతేడాది(2022–23) జనవరి–మార్చి(క్యూ4)లో పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 19 శాతం ఎగసింది. రూ. 44,200 కోట్లకు చేరింది. ఇందుకు అధిక విద్యుదుత్పత్తి, ఉత్తమ సగటు సామర్థ్య వినియోగం (పీఎల్‌ఎఫ్) దోహదపడ్డాయి. ఈ కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 5 శాతం మెరుగుపడి రూ. 11,900 కోట్లను తాకింది. అయితే ఆదాయం, ఇబిటా మా అంచనాలకంటే దిగువనే నమోదయ్యాయి. ఇందుకు ప్రధానంగా విద్యుత్‌కు లభించిన తక్కువ ధరలు(లోయర్ టారిఫ్), అంచనాలకు మించి పెరిగిన ఇంధన వ్యయాలు ప్రభావం చూపాయి. బొగ్గు దిగుమతులు పెరగడం ఇంధన వ్యయాలను పెంచివేసింది. గతేడాదిలో కంపెనీ మొత్తం అవసరాలలో బొగ్గు దిగుమతుల వాటా 6.5 శాతానికి పెరిగింది. అంతక్రితం ఏడాది(2021–22)లో ఈ వాటా కేవలం 1.2 శాతమే. దీంతో క్యూ4లో సర్దుబాటు తదుపరి నికర లాభం వార్షికంగా 6 శాతం క్షీణించి రూ. 4,870 కోట్లకు పరిమితమైంది. ఇది కూడా అంచనాలకంటే తగ్గింది. కాగా.. గతేడాది 3.9 గిగావాట్ల సామర్థ్య విస్తరణ జత కలవడంతో స్టాండెలోన్ నియంత్రిత ఈక్విటీ 9.5 శాతం పెరిగి రూ. 77,600 కోట్లయ్యింది. ప్రస్తుతం కంపెనీ పునరుత్పాదక ఇంధన(ఆర్‌ఈ) సామర్థ్యం 3.2 గిగావాట్లకు చేరింది. వెరసి బ్యాలెన్స్‌డ్ పోర్ట్‌ఫోలియో బాటలో ఎన్‌టీపీసీ పయనిస్తోంది. దీంతో 2032కల్లా సామర్థ్యంలో 47 శాతం బొగ్గు ఆధారితం, 45 శాతం పునరుత్పాదక, 8 శాతం ఇతర విభాగాలు ఆక్రమించనున్నాయి.



జొమాటో | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 71

టార్గెట్: రూ. 83

ఎందుకంటే: ఫుడ్ డెలివరీ బిజినెస్ దిగ్గజం జొమాటో ఇటీవల లాభదాయకతను మెరుగుపరచుకోవడంలో నిలకడను చూపుతోంది. హైపర్‌ప్యూర్, క్విక్ కామర్స్ విభాగాలలో నష్టాలను చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గించుకోవడంతోపాటు.. ఫుడ్ డెలివరీ బిజినెస్ లాభదాయకతను మెరుగుపరచుకుంటోంది. వెరసి సమీప భవిష్యత్‌లో లాభదాయకత మరింత మెరుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కంపెనీ ఆదాయం, నిర్వహణ లాభం(ఇబిటా), నికర లాభ అంచనాలను పెంచేందుకు వీలు చిక్కింది. రానున్న రెండేళ్లలో కంపెనీ ఆదాయం 21 శాతం, ఇబిటా 139 శాతం, నికర లాభం 100 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని తాజాగా అంచనా వేస్తున్నాం. బ్లింకిట్‌సహా జొమాటో కన్సాలిడేటెడ్ ఫలితాలు నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలినాళ్లలోనే సర్దుబాటు తదుపరి ఇబిటా రూ. 18 కోట్లకు చేరవచ్చని భావిస్తున్నాం. ఫలితంగా డిస్కౌంటెడ్ క్యాష్ ఫ్లో(డీసీఎఫ్) ఆధారిత టార్గెట్ ధరను తొలుత ప్రకటించిన రూ. 65 నుంచి రూ. 83కు హెచ్చించేందుకు తాజాగా నిర్ణయించాం. గతేడాది(జనవరి–మార్చి) క్యూ4లో త్రైమాసికవారీగా చూస్తే స్థూల ఆర్డర్ విలువ(జీవోవీ) తగ్గింది. ఇందుకు సీజనల్ అంశాలు, డిమాండు క్షీణించడం కారణమయ్యాయి. అయితే యాజమాన్య వివరాల ప్రకారం ఏప్రిల్, మే నెలల్లో ఫుడ్ డెలివరీ బిజినెస్ జీవోవీ తిరిగి జోరందుకుంది. ఇది రికవరీపై అంచనాలను పెంచుతోంది. అత్యుత్తమ వ్యయ నియంత్రణలు కంపెనీ వేగవంత టర్న్‌అరౌండ్‌కు దారి చూపుతున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫ్యూచర్ జనరాలీ నుంచి డీఐవై హెల్త్ ప్లాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బీమా రంగ సంస్థ ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ (ఎఫ్‌జీఐఐ) కొత్తగా డీ.ఐ.వై. హెల్త్ ప్లాన్ పేరిట ఆరోగ్య బీమా పాలసీని ప్రవేశపెట్టింది. ఇందులో కస్టమర్లు తమ అవసరాలకు తగిన కవరేజీలను ఎంచుకునేందుకు వీలుంటుందని సంస్థ ఎండీ అనూప్ రావు తెలిపారు. దీని కింద మొత్తం 20 ఆప్షనల్ కవర్‌లను ఆఫర్ చేస్తున్నట్లు వివరించారు. మెటర్నిటీ కవర్, క్రిటికల్ ఇల్‌నెస్ బూస్టర్, ఎయిర్ అంబులెన్స్, యాక్సిడెంటల్ డెత్ కవరేజీ లాంటి వాటిని తప్పనిసరి ఫీచర్లుగా కాకుండా జీవితకాలంలో వివిధ దశల్లో వివిధ అవసరాలకు అనుగుణంగా తీసుకోవచ్చని అనూప్ రావు చెప్పారు. బీమా పాలసీల విషయంలో కస్టమర్లు ఏం కోరుకుంటున్నారనే అంశంపై యునోమర్ సంస్థతో కలిసి నిర్వహించిన సర్వేలో తేలిన అంశాల ఆధారంగా ఈ పాలసీని రూపొందించినట్లు అనూప్ వివరించారు. మరోవైపు, కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసే విషయంపై వాటాదారులదే తుది నిర్ణయమని అనూప్ చెప్పారు.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇండెక్స్ ఫండ్ ఎంపిక ఎలా?

మల్టీక్యాప్ పేరుతో కొత్తగా వస్తున్న మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– ఆశిష్

ఈ తరహా పథకాల నుంచి సరైన రాబడులు అందుకోగలమా? అన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. మల్టీక్యాప్, ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ మధ్య వ్యత్యాసం ఉంది. నేడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుసరిస్తున్న పెట్టుబడుల విధానాన్ని గతంలో మల్టీక్యాప్ ఫండ్స్ పాటించాయి. వాటిపై ఎటువంటి నియంత్రణలు లేవు. కనుక మార్కెట్ క్యాప్ పరిమితితో సంబంధం లేకుండా ఫండ్ మేనేజర్లు తమ స్వేచ్ఛ కొద్దీ అన్ని రకాల మార్కెట్ క్యాప్ ఆధారిత స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునేవారు. దీంతో వాటి విధానం మార్చే దిశగా సెబీ మార్గదర్శకాలను తీసుకొచ్చింది. ఇప్పుడు మల్టీక్యాప్ ఫండ్స్ కచ్చితంగా కనీసం 25 శాతం లార్జ్‌క్యాప్, 25% మిడ్‌క్యాప్, 25% స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. చాలా వరకు మల్టీక్యాప్ ఫండ్స్ నిర్వహణ ఆస్తుల పెరంగా పెద్దగా మారిపోయాయి. దీంతో 25% చొప్పున ప్రతీ విభాగంలో పెట్టుబడులు కచ్చితంగా ఇన్వెస్ట్ చేయాలన్నది వాటికి ప్రతిబంధకంగా మారింది. ఎందుకంటే భారీ పెట్టుబడులకు తగ్గ అవకాశాలు స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగంలో అన్ని వేళలా ఉండాలని లేదు. పరిశ్రమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న సెబీ మార్కెట్‌కు ఇది ప్రతికూలంగా మారుతుందని గుర్తించి.. ఫ్లెక్సీక్యాప్ పేరుతో కొత్త విభాగాన్ని ప్రవేశపెట్టింది. 25 శాతం చొప్పున కచ్చితంగా ప్రతీ విభాగంలో ఇన్వెస్ట్ చేయడం వీలు కాకపోతే మల్టీక్యాప్ పథకాలు ఫ్లెక్సీక్యాప్ విభాగంలోకి మారిపోవచ్చంటూ వెసులుబాటునిచ్చింది. దీంతో చాలా మల్టీక్యాప్ పథకాలు ఫ్లెక్సీక్యాప్ కిందకు మారిపోయాయి. కొత్త పథకం ఆవిష్కరించడం ద్వారా మరింత మంది ఇన్వెస్టర్లను ఆకర్షించొచ్చని మ్యూచువల్ ఫండ్ సంస్థలు భావించాయి. ఒక్కో విభాగంలో ఒక్క పథకమే ఉండాలన్నది సెబీ నిబంధన. దీంతో మల్టీక్యాప్ నుంచి ఫ్లెక్సీక్యాప్ కిందకు మారిపోయిన ఫండ్స్ సంస్థలు.. మల్టీక్యాప్ విభాగంలో కొత్త పథకాలను (ఎన్‌ఎఫ్‌వోలు) తీసుకొస్తున్నాయి. కనుక అవి తమకు అనుకూలమా? కాదా? అన్నది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల కాల వ్యవధి, రాబడుల అంచనాల ఆధారంగా నిర్ణయించుకోవాలి.

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఎటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి?

– శశాంక్

ముందుగా పథకం ఎక్స్‌పెన్స్ రేషియో చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించి పనితీరు ప్యారామీటర్లను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01%, 1.99%గా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో ఇక్కడ కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తుంటే, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది.

తెలంగాణ

అరుదైన శిలా ఫలకం.. అంతులేని నిర్లక్ష్యం!

రెండు దశాబ్దాల క్రితం ఫణిగిరిలో వెలుగుచూసిన సున్నపురాతి బౌద్ధ శిలా ఫలకం

- 2 వేల ఏళ్లనాటిదిగా గుర్తింపు.. 2003లో జరిగిన చోరీలో కొంత ధ్వంసం
- ఇప్పుడా శిలా ఫలకం ప్రదర్శన కోసం న్యూయార్క్‌కు తరలింపు
- తాత్కాలికంగా అతికించిన అధికారులు.. దాన్ని భద్రమైన చోట ఉంచాలని కోర్టు ఆదేశం
- ఈ తీరుతో శిల్పాలకు ప్రమాదమంటూ కేంద్రానికి ఫిర్యాదులు

■ లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న 120 అమరావతి సున్నపు రాయి శిల్పాలకు అసాధారణ పర్యవేక్షణ ఉంటుంది. సందర్శకుల సంఖ్య ఎక్కువగా ఉండి.. ఉష్ణోగ్రతలు పెరిగితే తాత్కాలికంగా ఆ గ్యాలరీని మూసి, ఉష్ణోగ్రతలు తగ్గాకే సందర్శకులను అనుమతిస్తున్నారు. పురాతన శిల్పాలకు నష్టం జరగకుండా తీసుకుంటున్న శ్రద్ధకు ఇది నిదర్శనం.

■ మరి తెలంగాణ వారసత్వ శాఖ ఆధీనంలోని మ్యూజియంలలో పరిస్థితి? రక్షించే శ్రద్ధ సంగతేమోగానీ, అలవిగాని నిర్లక్ష్యంతో శిల్ప సంపదకు మరింత నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ అరుదైన శిల్పం విషయంలో అధికారుల తీరును ఎత్తిచూపుతోంది. సురక్షితంగా, భద్రమైన చోటులో ఉంచాలని స్వయంగా కోర్టు ఆదేశించినా.. ఆ శిల్పాన్ని వేల మైళ్ల దూరానికి తరలిస్తుండటంపై విమర్శలు

– సాక్షి, హైదరాబాద్


దొంగల నుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు తాత్కాలికంగా అతికించిన బుద్ధ ఫలకం

సూర్యాపేట జిల్లా ఫణిగిరి గుట్టపై 2003లో జరిపిన తవ్వకాల్లో క్రీస్తుశకం 1– 3 శతాబ్దాల మధ్య కాలానికి చెందిన 3 అడుగుల సున్నపు రాయి ఫలకం వెలుగు చూసింది. సిద్ధార్థుడు బుద్ధుడిగా మారే క్రమంలో జరిగిన పరిణామాల చిత్రాలను మూడు వరుసల్లో దానిపై చెక్కారు. అరుదైన ఇలాంటి ఫలకాలకు అంతర్జాతీయ విపణిలో విపరీతమైన డిమాండ్ ఉంది. తవ్వకాలు జరిపిన కొత్తలో ఈ శిలా ఫలకాన్ని ప్రభుత్వ ఆధీనంలోని ఓ గదిలో భద్రపర్చగా.. 2003 సెప్టెంబర్‌లో దొంగలు దాన్ని ఎత్తుకుపోయారు. పోలీసు బృందాలు జల్లెడ పట్టి సమీపంలోని ఓ ఊరిలో దానిని స్వాధీనం చేసుకున్నారు. కానీ శిలా ఫలకం అప్పటికే రెండు ముక్కలు కావడంతో.. తాత్కాలికంగా అతికించారు. అయితే ఈ ఫలకాన్ని సురక్షిత ప్రాంతంలో ఉంచాలంటూ కోర్టు ఆదేశించడంతో.. హైదరాబాద్ స్టేట్ మ్యూజియంలో సిమెంట్ బేస్ సాయంతో కదలకుండా ఏర్పాటు చేశారు. అయితే నాలుగేళ్ల క్రితం ఈ శిల్పాన్ని విమానంలో ముంబై మ్యూజియానికి తీసుకెళ్లి, తీసుకొచ్చారు. ఆ సమయంలో పగులు విచ్చుకోవటంతో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి అతికించారు.


నాలుగేళ్ల క్రితం ముంబయిలో పగులు కనపడకుండా అతికించిన బుద్ధ ఫలకం

ఈసారి అమెరికాకు తరలించి..

అమెరికాలో న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో బుద్ధుడి జీవిత పరిణామ క్రమానికి సంబంధించిన భారతీయ శిల్పాలతో అంతర్జాతీయ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దానికి మన దేశం నుంచి 94 శిల్పాలను ఎంపిక చేయగా.. అందులో తెలంగాణ నుంచి 9 ఉన్నాయి. వీటిలో కరీంనగర్ మ్యూజియంలో ఉన్న నాగ ముచిలింద శిల్పం పగుళ్లతో ఉండటంతో.. దాన్ని వదిలేసి మిగతా 8 శిల్పాలను ఇటీవల విమానంలో తరలించారు. ఇలా తరలించిన వాటిలో ఫణిగిరి సున్నపురాయి ఫలకం కూడా ఉంది. అరుదైన ఈ శిలా ఫలకాన్ని అంత దూరం తరలించే క్రమంలో ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని.. అయినా ఎలా తరలిస్తారని ఇటీవల కొందరు కేంద్ర పురావస్తు శాఖకు ఫిర్యాదు చేశారు.

రెండు శిల్పాలు ధ్వంసం

దాదాపు 20 ఏళ్ల క్రితం స్టేట్ మ్యూజియం నుంచి బాదామి చాళుక్యుల కాలం నాటి ఎర్ర ఇసుకరాతితో చేసిన దుర్గాదేవి ప్రతిమను విదేశాలకు పంపగా.. రవాణాలో విగ్రహం ముక్కు భాగం దెబ్బతిన్నది. బెర్లిన్‌లో జరిగిన తేజస్ ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లిన ఓ నాగ శిల్పం వెనక భాగంలో దెబ్బతిన్నది. ఇలా అరుదైన శిల్పాలు దెబ్బతిన్న ఘటనలున్నా.. ఇప్పటికే దెబ్బతిని, తిరిగి అతికించిన శిలా ఫలకాన్ని విదేశాలకు తరలించడం అడ్డగోలు చర్య అని ఓ విశ్రాంత ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుప్తనిధుల తవ్వకాల పేలుడుతోనే శ్రీను మృతి?

- ఉదయగిరి దుర్గంపై ఘటన
- తవ్వకాలకు పూజలు చేసిన వ్యక్తి పోలీసుల అదుపులో.. ఇంటిముందు మృతదేహం పడేసిన ఘటనలో చురుగ్గా దర్యాప్తు

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని ముటుకులలో మృతదేహాన్ని మూటగట్టి ఇంటిముందు ఉంచి వెళ్లిన ఘటనపై పోలీసుల విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. గుప్తనిధుల తవ్వకాల్లో భాగంగా జిలెటిన్ స్టిక్ పేల్చడం వల్లే ఉప్పు శ్రీను మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి దుర్గంపై ఉన్న మసీదు ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపే సమయంలో ఈ ఘటన జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు శ్రీను సెల్‌ఫోన్ ఆధారంగా నూతన టెక్నాలజీని ఉపయోగించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తవ్వకాల సమయంలో పూజలు చేసిన బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముటుకులలో ఈ నెల 1వ తేదీ రాత్రి శ్రీను మృతదేహాన్ని మూటగట్టి కారులో తీసుకువచ్చి ఆయన ఇంటిముందు పడేసి, రూ.35 వేల నగదు, క్షమాపణ లేఖ అక్కడ ఉంచి వెళ్లిన సంగతి తెలిసిందే. సంచలనం కలిగించిన ఈ సంఘటనను పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆదేశాల మేరకు సీఐ మారుతీకృష్ణ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం, పెద్దారవీడు ఎస్‌ఐలు వై.శ్రీహరి, రాజేశ్ రంగంలోకి దిగారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఉదయగిరి దుర్గంపై ఉన్న మసీదులు, దేవాలయాల్లో నవాబులు, రాజులు దాచిన గుప్తనిధులు ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటంతో కొంతమంది ముఠాగా ఏర్పడి ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తుంటారని, మృతుడు శ్రీను ఆ ముఠాతో కలిసి పనిచేస్తున్నాడని పోలీసులు గుర్తించారు. గత నెల 31వ తేదీ రాత్రి దుర్గంపై ఉన్న చిన్నమసీదులో తవ్వుతూ బండరాయి అడ్డుతగలడంతో దాన్ని తొలగించేందుకు జిలెటిన్ స్టిక్ పేల్చడంతో అక్కడే ఉన్న ఉప్పు శ్రీను మృతి చెందాడని, కొందరికి దెబ్బలు తగిలాయని తెలిసింది. శ్రీను మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించాలని అతడి ఇంటికి తీసుకురావడాన్ని బట్టి చూస్తే ఆ ముఠా సభ్యులకు శ్రీను కుటుంబసభ్యులతో ముందుగానే పరిచయం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీను భవన నిర్మాణ పనుల కోసం ఇతర రాష్ట్రాలు వెళ్తున్నట్లు ఉన్న ప్రచారంలో వాస్తవం లేదని, మృతుడు గుప్తనిధులు తవ్వకాల ముఠాతో కలిసి పనిచేస్తున్నాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తీసుకొచ్చిన కారు బాపట్ల జిల్లా అద్దంకికి చెందినదని గుర్తించినట్లు తెలిసింది. ఉదయగిరి దుర్గంపై నాలుగైదు నెలలుగా తవ్వకాలు చేస్తున్నట్లు తెలిసింది. పేలుడుతో మృతిచెందిన శ్రీను మృతదేహాన్ని రాళ్ల కింద నుంచి బయటికి తీసేందుకు దాదాపు ఐదుగంటలు పట్టిందని సమాచారం. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడితో సంబంధం ఉన్న పలువురిపై దృష్టి సారించారు. ఈ ముఠాలో ఎంతమంది సభ్యులు ఉన్నారు, పోలీసులు ఎవరెవరిని అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంలేదు. కేసు విచారణలో ఉందని మాత్రమే పోలీసు అధికారులు చెబుతున్నారు.

దూసుకెళ్లి... మృత్యుకేళి

- నిండు ప్రాణాలు... నింగిలోకి..
- ఆలయంలోకి దూసుకెళ్లిన టిప్పర్
- డ్రైవర్, క్లీనర్‌తో సహా మరొకరు మృతి

తొండంగి: నిశి వేళలో... కళ్లెం లేని వేగం ఉసురు తీసింది.. నిండు ప్రాణాలను నింగిలో కలిపేసింది.. ఆ దారిలో మృత్యుకేళి మోగించింది.. అయినవారికి విషాదం మిగిల్చింది.. అతివేగం ఆపై నిద్రమత్తు కారణంగా టిప్పర్ తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లడంతో ముగ్గురు మృత్యువాత పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం నుంచి తొండంగి మండలం తీర ప్రాంతానికి టిప్పర్ వెళ్తుంది. అది అన్నవరం నుంచి తొండంగి వైపు వస్తుండగా ఎ.కొత్తపల్లిలో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న జీఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకును ఢీకొట్టింది. వెంటనే ఎదురుగా ఉన్న వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లింది. టిప్పర్ వేగానికి వినాయకుని ఆలయం పూర్తిగా నేలమట్టల అయ్యింది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనతో గజ్జనపూడి గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ చుక్కల శేఖర్ (28), క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర (23) అక్కడికక్కడే మృతి చెందారు. అయితే ఆలయంలో సేదతీరుతున్న ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన తూము లక్ష్మణరావు (47) కూడా దుర్మరణం పాలయ్యారు. అక్కడ ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో జేసీబీ సాయంతో లారీ క్యాబిన్, ఆలయ శిథిలాలను తొలగించి చుక్కల శేఖర్, కానూరి సూర్యనాగేంద్ర, తూము లక్ష్మణరావు మృత దేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తొండంగి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఎ.కొత్తపల్లిలో వినాయకుని ఆలయంలోకి దూసుకెళ్లిన టిప్పర్

కుమార్తెకు సారె పంపి వచ్చి..


తూము లక్ష్మణరావు

మృతుల్లో ఒకరైన లక్ష్మణరావుకు భార్య లోవలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎ.కొత్తపల్లి గ్రామంలో కూలి పని చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 1న తన పెద్ద కుమార్తె నాగలక్ష్మి వివాహం జరిగింది. శనివారం కొమ్మనాపల్లిలో తన వియ్యపు వారింటికి కుమార్తెకు సారెను కుటుంబ సభ్యులతో కలసి తీసుకెళ్లారు. అనంతరం అర్ధరాత్రి ఒంటి గంటకు స్వగ్రామం ఎ.కొత్తపల్లికి వచ్చారు. పెళ్లింట బంధువులు ఎక్కువగా ఉండటంతో ఖాళీ లేక లక్ష్మణరావు దగ్గరలోని వినాయకుని ఆలయంలో సేద తీరారు. ఇంతలో టిప్పర్ లారీ మృత్యువు రూపంలో కబళించింది. దీంతో లక్ష్మణరావు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పెళ్లింట బంధువుల రోదనలతో విషాదం నెలకొంది.

చిన్న కుటుంబం.. పెద్ద కష్టం


టిప్పర్ డ్రైవర్ చుక్కల శేఖర్

ప్రత్తిపాడు రూరల్: గజ్జనపూడికి చెందిన టిప్పర్ డ్రైవర్ చుక్కల శేఖర్ (28), క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర (23) మృతితో ఆ గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. పదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తూ శేఖర్ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అతనికి భార్య లోకేశ్వరి, కుమారుడు లలిత దుర్గామనీష్ (2), కుమార్తె అనితశ్రీ (10 నెలలు) ఉన్నారు. ఆ చిన్న కుటుంబానికి అతనే ఆధారం. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

ప్రేమ పెళ్లి చేసుకున్న ఏడాదికే..


క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర

లారీ క్లీనర్ కానూరి సూర్యనాగేంద్ర (23) ఏడాది కిందట పాదురుపాకకు చెందిన శివకుమారిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి జీవితం ఎంతో అన్యోన్యంగా సాగుతోంది. ఇంతలో ఈ ప్రమాదం తీవ్ర శోకాన్ని మిగిల్చింది. వివాహం కావాల్సిన సోదరితో పాటు తల్లిదండ్రులు నాగేంద్రతో ఉంటున్నారు. అతని మృతితో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. మృతుల కుటుంబాలు ప్రధాన జీవనాధారమైన పెద్దదిక్కులను కోల్పోయి రోడ్డున పడ్డాయి.

సాధారణంగా గాలిలో ధూళికణాల పర్టిక్యులర్ మేటర్ (పీఎం-10), పీఎం-2.5లు 60కి మించకూడదు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతో పాటు అమలాపురంలో సైతం ధూళికణాలు 65 దాటి ఉంటున్నాయని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) గుర్తించింది. దీనిని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో ప్రమాదకరమేనని అంటున్నారు.

నేల, నీరు, గాలికి.. నిత్యం హాని

ఆధునిక జీవన విధానంతో చేటు
తోడవుతున్న మానవ నిర్లక్ష్యం
తక్షణ చర్యలతోనే పరిరక్షణ
నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సాక్షి ప్రతినిధి, కాకినాడ

నింగి నుంచి నిప్పులు కురిపిస్తున్నాయా అనే స్థాయిలో చండప్రచండమైన ఎండలు.. ఏరూ, ఊరూ ఏకం చేసేట్టుగా కుండపోత వానలు.. మండు వేసవిలోనూ హిమపాతాలు.. మునుపెన్నడూ చూడని ఈ మార్పులు.. సమస్త మానవాళికీ ప్రకృతి చేస్తున్న హెచ్చరికలు. జీవరాశి మనుగడకు అత్యంత కీలకమైన నింగి, నేల, నీరు, గాలి వంటి వాటికి మనిషి తెలిసో తెలియకో హాని చేస్తూనే ఉన్నాడు. యథేచ్ఛగా మురుగు నీరు కలిపేస్తూ జలావరణానికి.. వాహనాలు, పరిశ్రమల పొగలతో వాతావరణానికి.. ప్లాస్టిక్, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంతో భూమాతకు చేటు తెస్తూనే ఉన్నాడు. ఇవన్నీ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా.. మార్పు తెచ్చుకునేందుకు నిరాకరిస్తున్నాడు. తప్పెక్కడ జరుగుతోందో నిజాయితీగా గుర్తిస్తేనే.. సరి చేసుకునే స్పృహ కూడా కలుగుతుంది. జూన్ 5– ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగానైనా కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలి.

కాలుష్యం కోరల్లో ఉమ్మడి 'తూర్పు'

- గోదావరి తీర నగరం రాజమహేంద్రవరంలో కాలుష్య భూతం కోరలు చాచుతోంది. ఇక్కడి పేపరు మిల్లు గోదావరి చెంతనే ఉంది. ఈ మిల్లు నుంచి విడుదల చేస్తున్న వ్యర్థ జలాలను వెంకటనగరం, తూర్పు లంక వద్ద గోదావరిలో కలుపుతున్నారు. దీనికి దిగువన కోటిలింగాల రేవులోని మున్సిపల్ వాటర్ ఇన్‌టేక్ పాయింట్ వద్దకు ఈ వ్యర్థ జలాలు చేరుతున్నాయి. దీనికి నగరం నుంచి ప్రతి రోజూ వస్తున్న మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు తోడవుతున్నాయి. వీటన్నింటి ఫలితంగా తల్లి గోదావరి కాలుష్యం కాటుకు గురవుతోంది.
- కాకినాడ పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భారీ, మధ్యతరహా పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సి ఉంది. వీటి నుంచి వచ్చే పొగను రాత్రి ఏడు గంటల తరువాత నేరుగా బయటకు వదిలేస్తున్నారని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేట ప్రాంతాల ప్రజలు నిత్యం వాయు కాలుష్యాలతో నరకం చవిచూస్తున్నారు.
- కోనసీమలోని తీర గ్రామాల్లో చమురు సంస్థలు సాగిస్తున్న అన్వేషణతో భూగర్భ జలాలు దాదాపు కలుషితమైపోయాయి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆక్వా సాగు కూడా దీనికి తోడవుతోంది.
- నగరాలు, పట్టణాలు, ఒక మోస్తరు పల్లెల్లో శబ్ద కాలుష్యం గురించి చెప్పనవసరమే లేదు.



ప్రమాదకరంగా ఈ-వ్యర్థాలు

మరోపక్క ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ–వ్యర్థాలు) సమస్య మరింత ప్రమాదరకంగా మారింది. పనికిరాని ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, కంప్యూటర్లు, ఎల్‌ఈడీ లైట్లు, జిరాక్స్ వంటి ఈ–వ్యర్థాలను దీర్ఘకాలం పాటు నిల్వ చేయడం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తులు, కాలేయం, మెదడువాపు తదితర సమస్యలు తలెత్తుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కాకినాడ నగరపాలక సంస్థ ఈ–వ్యర్థాలను పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ కీ పర్సన్ ప్రక్రియ ద్వారా రీసైక్లింగ్ చేసి కోల్‌కతాకు చెందిన సంస్థకు పంపేలా చర్యలు చేపట్టింది. దీనిని మరింత సమర్థంగా కొనసాగించాల్సి ఉంది.

ప్లాస్టిక్‌తో ముప్పు

మరోపక్క ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం ప్రమాదకరంగా మారింది. కాకినాడ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల్లో ప్లాస్టిక్ వాడకాన్ని దశల వారీగా నిషేధిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. అధికారులు తూతూమంత్రంగా దాడులు చేయడం.. ఆనక విడిచిపెట్టేయడంతోనే ఈ పరిస్థితి అని పర్యావరణవేత్తలు అంటున్నారు.

అవగాహనతోనే పరిరక్షణ..

అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం. ప్లాస్టిక్ వినియోగం చాలా ఎక్కువైంది. నేలలో ప్లాస్టిక్ ధాతువులు కలిసేందుకు చాలా సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ కవర్లకు బదులు కాగితం, క్లాత్ కవర్లు వినియోగించుకోవాలి. వాయు కాల్యుష్య నివారణకు ప్రతి ఇంటా మొక్కలు పెంచుకోవాలి. పారిశ్రామిక రసాయన వ్యర్థాలను నదులు, కాలులు, సముద్రాల్లోకి నేరుగా విడిచిపెట్టకుండా వాటర్ ట్రీట్‌మెంట్ చేయాలి. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నాం.

– ఎన్.అశోక్‌కుమార్, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి, కాకినాడ

పచ్చని చెట్లే శ్రీరామరక్ష

పర్యావరణ పరిరక్షణలో కీలకమైనవి అధిక వయస్సు ఉన్న వృక్షాలు. ఒక చెట్టు ఏడాదికి 2.5 సెంటీమీటర్ల వ్యాసం పెరుగుతుందని అంచనా. తద్వారా దాని వయస్సును లెక్కిస్తారు. ఒక చెట్టుకు 12 కేజీల కాండం ఉంటే అది 44 కేజీల కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుంటుంది. జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో రూపొందించిన 'బయోడైవర్సిటీ' అనే పుస్తకంలో కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల్లో 100 ఏళ్లకు పైబడిన వయస్సు కలిగిన వృక్షాల జాబితా, ప్రదేశాలు గుర్తించారు.

జీవన శైలిలో మార్పుతో..

పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ లైఫ్' అనే కొత్త నినాదంతో ఈ ఏడాది కార్యక్రమాలు చేపడుతోంది. జీవన శైలిలో మార్పుతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలం. పదేళ్ల క్రితం పర్యావరణంలో పీపీఎం 350 ఉండేది. ఇప్పుడది 420 వరకూ పెరిగింది. 350 ఉంటే పర్యావరణం, ఉష్ణోగ్రతలు సమపాళ్లలో ఉన్నట్టు.

– కేవీఎస్‌జీ మురళీకృష్ణ, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ క్లైమేట్ చేంజ్ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూకే

ప్రభుత్వం కృషి

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ఏడాది జూన్ నెలలో 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్‌ను ప్రోత్సహించింది. దీని ద్వారా గ్రామాల్లో రోడ్ల వెంబడి కిలోమీటరుకు 400 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఎన్నో చట్టాలు

పర్యావరణ పరిరక్షణకు ఎన్నో చట్టాలున్నాయి. జలవనరుల్లో వ్యర్థాలను పడేస్తే జలకాలుష్య నివారణ చట్టం–1974, మితిమీరిన శబ్దాలతో వాహనాలు నడపడం, వాటివలన వాయు కాలుష్యం జరిగితే వాయు కాలుష్య నివారణ చట్టం –1981, అడవుల నరికివేతకు పాల్పడితే అటవీ సంరక్షణ చట్టం–1980, ప్లాస్టిక్, రసాయనిక ఎరువులతో పరిసరాలను కలుషితం చేస్తే వాతావరణ పరిరక్షణ చట్టం–1981 ప్రకారం శిక్షలుంటాయి.

ఇవి పాటిస్తే మేలు

- నీటిని పొదుపుగా వాడాలి.
- ఒకసారి మాత్రమే వాడు ప్లాస్టిక్ వద్దు.
- ఈ-వ్యర్థాలను తగ్గించాలి.
- ఆరోగ్యకర ఆహార పద్ధతులు, జీవన శైలి

ప్రాణం తీసిన పూచీకత్తు

హత్యకేసు ఛేదించిన పోలీసులు.. ఏడుగురు నిందితుల అరెస్ట్
నిందితుల్లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు


నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్: తన స్నేహితుడి అప్పు విషయంలో తాను పూచీ పడినందుకు నిందితుల చేతిలో చావుదెబ్బలు తిని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. హత్య కేసుగా నమోదైన 24 గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ సంఘటనపై ఆదివారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.డి షరీఫ్ విలేకరులకు వివరాలను తెలియజేశారు. కడప నగరం ఊటుకూరుకు చెందిన పాలెంపల్లి శ్రీకాంత్ రెడ్డి అక్కాయపల్లిలో నివాసం ఉంటున్నాడు. అతని స్నేహితుడు సత్యనారాయణ అలియాస్ సత్య ఈ కేసులో ప్రధాన నిందితులైన కడప నగరం శంకరాపురానికి చెందిన అండ్లూరు చైతన్యకుమార్ రెడ్డి, చిన్నచౌక్ ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల ఒక్కొక్కరి వద్ద రూ. 10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తమ అప్పు తీర్చాలని పెద్దమనుషుల సమక్షంలో అడిగారు. ఆ సమయంలో సత్యనారాయణ స్నేహితుడైన శ్రీకాంత్‌రెడ్డి పూచీపడ్డాడు. తర్వాత పలుకకపోవడంతో మే 31న నిందితులు, మూడో నిందితురాలైన కడప నాగరాజుపేటకు చెందిన, టిఫిన్ సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ అక్క మద్దాల చాముండేశ్వరి ఇంటివద్దకు శ్రీకాంత్‌రెడ్డిని పిలిపించారు. అక్కడ నిర్బంధించి మిగిలిన నిందితుల సహకారంతో కొట్టారు. డబ్బులను కడితేనే వదిలిపెడతామన్నారు. అతన్ని ముత్తరాసపల్లిలోని లీల అలియాస్ శ్రీలీల ఇంటికి తీసుకెళ్లారు కట్టెలతో, క్రికెట్ బ్యాట్‌తో కొట్టారు, కాళ్లతో తన్నారు. పాలెంపల్లి శ్రీకాంత్‌రెడ్డి స్పృహకోల్పోయి అక్కడికక్కడే చనిపోయాడు. తరువాత ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని కాల్చి మాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వెంటనే డ్రైవర్ లేకుండా సెల్ఫ్‌డ్రైవింగ్ చేసుకుంటామని ఇటియోస్ కారును బాడుగకు తీసుకున్నారు. రెండు క్యాన్‌లలో 1200 రూపాయలకు పెట్రోల్ తీసుకున్నారు. శవాన్ని కారులో తీసుకెళ్లా చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె పమీపంలో మూలవంకలో కంపచెట్లలో వేశారు. పెట్రోల్ పోసి తగలబెట్టేశారు. మరుసటి రోజున పశువుల కాపరుల సమాచారంతో మొదట గుర్తు తెలియని మృతదేహంగా భావించి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌రెడ్డి రెండురోజులుగా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతకొమ్మదిన్నె పరిధిలో లభ్యమైన మృతదేహాన్ని శ్రీకాంత్‌రెడ్డిదిగా గుర్తించారు. దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి హత్య కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను కనుగొన్నారు. ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం ఏడుగురు నిందితులను ఊటుకూరు సర్కిల్– రిమ్స్ ఔటర్ రింగ్‌రోడ్డులోని పెద్దముసల్‌రెడ్డిపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కట్టెలు, బ్యాట్, శవాన్ని కాల్చేందుకు తెచ్చిన పెట్రోలు క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసులో అరెస్టయిన వారిలో ఫైనాన్స్ వ్యాపారి అండ్లూరు చైతన్యకుమార్‌రెడ్డి, ముత్తరాసపల్లికి చెందిన అవ్వారు లీల అలియాస్ శ్రీలీల, నాగరాజుపేటకు చెందిన మద్దాల చాముండేశ్వరి, చింతకొమ్మదిన్నె మండలం నరసరామయ్యగారిపల్లికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సోమశివ ప్రశాంత్ యాదవ్ అలియాస్ ప్రశాంత్, పాతకడప మామిడివీధికి చెందిన జకట ఉదయ్‌కిరణ్, శంకరాపురానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సింగనమల వెంకటసాయి, శ్రీలీల భర్త కాకి మోహన చంద్ర ఉన్నారు. వీరిని 24 గంటల్లోనే అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి, ఎస్‌బి ఎస్‌ఐ నర్రెడ్డి రాజరాజేశ్వరరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు విద్యాసాగర్, విశ్వనాథరెడ్డి, లక్షుమయ్య, కానిస్టేబుళ్లు జనార్దన్‌రెడ్డి, విజయ్, అశోక్, సాయికుమార్, సి. సుధాకర్‌యాదవ్, హోంగార్డు లక్ష్మీరెడ్డి, అనిత, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ అభినందించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd, 22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943